
ISSN No : 2581-7477


# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 2 సంచిక - 5 ఫిబ్రవరి - 2021 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



# సాహిత్య ప్రస్థానం

## ఆందోళనకర ధోరణులు

**దే**శంలో రాజకీయ, ఆర్థిక పరిణామాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. ఆలోచనాపరులకు అలసత్వం సరికాదని హెచ్చరిస్తున్నాయి. రైతాంగ వ్యతిరేక శాసనాలపై రెండు మాసాలుగా సాగుతున్న ఉధృత ఉద్యమానికి స్పందన లేకపోగా, కేంద్రం ఎదురుదాడి ప్రారంభించింది. జనవరి 26న జరిగిన కొన్ని అవాంఛనీయ ఘటనలను సాకుగా చూపించి నాయకులపైనే గాక మీడియా ప్రతినిధులపైన కూడా కేసులు మోపబడ్డాయి. సోషల్ మీడియాపైనా ఆంక్షలు వచ్చి పడ్డాయి. పదకొండు దఫాలు చర్చలు జరిపి, ఒకటిన్నర ఏడాది పాటు చట్టాల అమలును వాయిదా వేయడానికి సిద్ధమంటూ ప్రకటించిన ప్రభుత్వం... ప్రజాస్వామికంగా పరిష్కరించడానికి ఆటంకాలేమిటో అర్థం కాదు. ఆంక్షలు, నిర్బంధాలు అసలే సమర్థనీయం కాదు. ఈ రైతాంగ పోరాటాలకు మద్దతుగా తెలుగు కవులు, రచయితలు ముందుకు రావడం అభినందనీయం.

◆ ◆ ◆

కరోనా ఉధృతి నుంచి నెమ్మదిగా కోలుకుంటున్న నేపథ్యం. దెబ్బతిన్న దేశ ఆర్థిక వ్యవస్థను, కకావికలైన ప్రజా జీవితాన్ని పట్టాలెక్కించాలని కోరుకున్న తాజా బడ్జెట్ శత సహస్ర కుబేరుల బాట పట్టడంతో కార్మికులు, మధ్య తరగతి మానవులకు ఆశాభంగమే మిగిలింది. దేశ సంపదగా ఉండాల్సిన ప్రభుత్వ సంస్థలను దాదాపు రెండు లక్షల కోట్ల మేరకు బేరం పెట్టడం, జీవిత బీమాలోకి విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తూ 74 శాతం ప్రైవేటీకరణకు ద్వారాలు తెరవడంతో పాటు దేశమంతా భూములను మానిటైజ్ చేయాలని నిర్ణయించడం తీవ్ర ప్రభావం చూపించబోతోంది. ఉద్యోగ భద్రతకూ, ఉద్యోగుల భద్రతకూ ముప్పు పెరిగింది. కేంద్రం, రాష్ట్రాల అప్పులు అపారంగా పెరిగిపోతున్నాయి. ఆఖరికి ఆరోగ్యరంగంలోనూ అవసరమైనంతగా నిధులు పెరగలేదు.

◆ ◆ ◆

చిత్తూరు జిల్లా మదనపల్లిలో విద్యాధిక దంపతులు నిగూఢ మూఢ నమ్మకాలతో కన్నబిడ్డల ప్రాణాలు తీసుకున్న ఘటన దేశాన్ని కలవరపరిచింది. ఆలోచనాశీలతను ప్రశ్నించే తత్వాన్ని, విమర్శనా చైతన్యాన్ని పెంచవలసిన రచయితలు ప్రత్యేకించి దృష్టి పెట్టాల్సిన దారుణమిది.

ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాలపై దాడులు మతాల మధ్య మంటలు పెట్టే రాజకీయాలుగా మారడం అనుమతించరాని పరిణామం. కుట్రదారులను పట్టుకోవాలే గాని కొత్త కుట్రలను రగిలించడం తగని పని. ప్రజల్లో లౌకిక భావనల కారణంగా ఈ కుట్రలు పెద్దగా ఫలించకపోవడం హర్షనీయమే గాని అప్రమత్తత అనివార్యం. ■


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్**
**కెంగార మోహన్ ◆ వొరప్రసాద్**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

ఈ సంచికలో ...  **సాహిత్య ప్రస్థానం**  ఫిబ్రవరి 2021

**కథలు**


నీల – సమ్మెట ఉమాదేవి ....................5
ఆరుతడి – గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి .............22
టు లెట్ – జంధ్యాల రఘుబాబు ...............32
కోడలు కాదు; కూతురు – ఆర్‌సి కృష్ణస్వామి రాజు 44


**కవితలు**


అమ్మ గుర్తొచ్చిన ప్రతిసారీ – పి శ్రీనివాస్ గౌడ్ ....... 10
ఏ ఇద్దరి మధ్యా ... – ఏటూరి నాగేంద్రరావు ........ 14
తిరుగుబాటు – మెట్టా నాగేశ్వరరావు ....................15
గతి తప్పిన పంచేంద్రియాలు – అడిగోపుల ............18
పాదాలు – మోకా రత్నరాజు ........................... 21
మాకెందుకొస్తది? – అవని శ్రీ .......................... 31
ఎదురుచూపు – కొలిపాక శ్రీనివాస్ .................... 34
కొత్త చిగురులు– శ్రీధర్ చౌడారపు ......................36
అరుగు – చొక్కర తాతారావు ........................ 40
పొలాల్లోంచి ... – రవి నన్నపనేని ......................43
నానీలు – గాదిరాజు రంగరాజు..........................47
సబర్ కా ఫల్ మీఠా హోతా హై – జెబి .......... 48
వాళ్లు – వైష్ణవి శ్రీ ............................. 51
అరిగోస – గిరిప్రసాద్ చెలమల్లు ............ 52
ప్రేమలేఖ – పద్మావతి రాంభక్త ........................ 56
మిస్సింగ్ ఔట్– వేణు మరీదు ........................... 57
దేశం నాకు శానా బాకీ .... నాగరాజు మద్దెల ..........61
స్వీకారం ......................................................65


**వ్యాసాలు**


రాయలసీమ ముస్లిం కథ – వేంపల్లి షరీఫ్ ..................................11
భారతీయ భాషల్లో తొలి తరం నవలలు – ఆచార్య కొలకలూరి ఇనాక్ ............................. 17
దు:ఖాన్ని పోత పోసిన దండ కడియం – బోల యాదయ్య .................................19
నిరంతర అధ్యయనంతోనే సాహిత్య వికాసం – పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు ..................26
సాహిత్య ప్రస్థానం జనవరి 2021 పురస్కారాలు ....... 27
సమాజం వాకిట వెలుతురు చిమ్మే కవిత్వం – వొర ప్రసాద్ ......................................28
అక్షర ప్రేమికుడు, అందరి స్నేహితుడు దుర్గాప్రసాద్ – తెలకపల్లి రవి .................................... 35
సంపాదకీయాలు – స్వార్థ రాజ'కీ'యాలు – డాక్టర్ బి లలితా ప్రసాద్ ...........................37
కరోనా కాలాన్ని రికార్డు చేసిన కవిత్వం ...........41
చాలా ప్రమాదకర ధోరణి ఇది – ప్రభాత్ పట్నాయక్ ..49
రాయడం కన్నా చదవడం చాలా ముఖ్యం – నాగసూరి వేణుగోపాల్ ........................... 53
శ్రమ విశ్వరూపానికి మహాక్షరాభిషేకం – తిరునగరి శ్రీనివాస్ ...............................58
ఉత్తరాంధ్ర వలసపాట – డాక్టర్ చింతపల్లి జానకీ లక్ష్మి 62



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, కుంచనపల్లి, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# నీల

- సమ్మెట ఉమాదేవి
98494 06722

**చి**రుమువ్వల సవ్వడులతో నీల ఆ చేలదారుల నడిచి వెళ్తుంటే సెలయేటి పాయేదో సాగుతున్నట్టుంటుంది. ఆ సాయం సంధ్యవేళ పూలచెట్ల కింద ఆమె అలా కాస్సేపు కూర్చున్నదంటే కొమ్మలు వంగి ఆమె చెప్పే ఊసులేవో వింటున్నట్లుంటాయి. గాలి మెల్లగా వీస్తున్నది. ఇప్పుడా చెట్టుకింద కిషన్‌దాస్ కూడా చేరాడు. కిషనదాస్‌ని చూడగానే నీలకు రఘుకు అతనెంత ఆత్మీయుడో గుర్తుకు వచ్చింది.

“ఏందన్నా? ఈ పొద్దు ఎటు దిక్కుబోతున్నారు?” అడిగింది ఆప్యాయంగా. అతని వెనుక మందలు మందలుగా గొర్రెలు ఆ దారినే వస్తున్నాయి. ప్రతి ఏడూ అతనూ, అతనిలాంటి మరి కొందరూ, వారి గొర్రెల మందలూ ఆ ఊరిచేలకు, ఆ అడవికి వచ్చేపోయే అతిథులే!

“ఏడికి పోయేదేముంది చెల్లే. ఎటు పచ్చటి ఆకు గానొస్తే అటు దిక్కు ఈ జీవాలే ఉరుకుతాయి. మాపటేలకు గా లింగానాయక్ చేన్ల జీవాలు పంటయి. రేపటి రాత్రి నర్సయ్య చేనుకు పంపుమని చెప్పిండు ఎరువు కోసం. వాటి నిద్రలు మంచిగానే వున్నయిలే చెల్లే.”

‘ఎక్కడి దేవరకొండ? ఎక్కడి ఖమ్మం? ప్రతి యేడు గొర్రెలు మేపుకోను తమ ప్రాంతానికి వచ్చే కిషన్‌దాస్, అతని దోస్తులు ఈడ కొందరికి సుట్టాల తీరు అయింద్రు. ఊరి చివర చేన్లల్ల రెండు కర్రలు పాతుకుని గుడారంలా వేసుకుని రాత్రుళ్ళు అక్కడ పడుకుంటరు. మూడు రాళ్ళు పెట్టుకుని తెచ్చుకున్న రెండు గిన్నెల్లో ఇంత అన్నం, కూర వండుకుని తిని భుజంమీద ఓ మంచి నీళ్ళ సీసా ఏలాడదీసుకుని, ఆ పశువుల పచ్చి మేతకోసం నెలలకు నెలలు చేలదారుల్లో ఎండలో ఊర్లకు ఊర్లు తిరుగుతుంటారు పాపం’ అనుకున్నది నీల.

“నువ్వేంది చెల్లే ఒక్కదానివే ఈడ గూసున్నావ్?” అడిగాడు.

“ఒక్కదాన్నే కదా అన్నా మరి. ఇదే గదా నా జాగా. ఎప్పుడూ ఈడనే గూసుంట గదా”

“అవును. రఘు, నీలా వాళ్ళిద్దరూ ఎప్పుడూ అక్కడే కూర్చునే వాళ్ళు. ఒక్కదాని వెందు కయితవు చెల్లే. మల్లా పెండ్లి జేసుకున్నవట గదా!” మనసులో అనుకున్నాడు.

“నా సంగతి సరేగానీ, ఎందుకంత నీరసం గున్నవు. పొద్దుగాల్లనుండి ఏమి తినలేదా అన్నా?”

“అన్నం వండిన చెల్లె. నూనె, కారం తేనీకి మా రామిగాడిని బంపిన. ఈ జీవాలను గా లింగానాయక్ చేన్లకు పంపోస్తనని బయలెల్లిన. తిండి గురించి కాదు చెల్లే. మనసే బాగోలే. నేను వచ్చేటాల్లకు మీ వదినెకు ఎనిమిది నెలలు వద్దయి. ఎండాకాలమొచ్చిందంటే నాలుగయిదు నెల్లు గిట్ల గొర్రెల మేప తిరుగుడయితది గదా.. నా పాణం మంచిగా లేదు పోవ్వద్దన్నది. మరి కానుపుకు పైసలు

గావలె గదా! అస్సలు పోవద్దంటే యెట్లా.. పదిహేను దినాలల్ల వస్తా అన్నా. ఏడా నలుగురయిదుగురం కూడి వచ్చినం. మా తిండికి గడుసుడే సరిపోతున్నది. పోవుడే అయితల్లేదు. తొమ్మిదో నెల వడ్డట్టున్నది. పొల్ల మస్తు యాదికొస్తున్నది..” అతని కళ్ళల్లో నీళ్ళు నిండినాయి.

“అయ్యో అన్నా.. బాధపడకు. కదుమా వాళ్ళు ఉన్నారు గదా! వాళ్ళు గొర్రెల జూసుకుంటారు. నువ్వు మీ ఊరు బోయేటందుకు జూడు. మా ఇల్లు ఈడికి దగ్గరే. ఒక ముద్ద తినిపోదువుదా.” అన్నది. “ఈసారెప్పుడన్న వస్తాలే చెల్లే” అన్నాడు.

♦ ♦ ♦

ఆ మూడవ రోజున పొద్దున్నే ఒక మేకను తీసుకుని నీల దగ్గరకు వచ్చాడు కిషన్‌దాసు.

“ఇది కడుపుతో ఉన్నది చెల్లే. ఇప్పుడో మాపటికో కనేతట్టున్నది. ఇది బరువుగా నడుస్తుంటే మొదాలు నాకు దుఃఖం మొస్తున్నది. ఈడనే కట్టేసుకో చెల్లే. కన్నాక మేపుకో. నేను తిరిగి వచ్చేటాల్లకు మావోల్లు వేరే ఊరికిబోతరు. నేను కూడా వాళ్ళు వున్న దిక్కుకే పోవాల్సివస్తది. నీది మంచి మనసు. దేవుడు నిన్ను మంచిగా చూడాలే చెల్లే. అంత మంచి గుంటే ఒక ఆర్నెల్లకయినా వచ్చి నిన్ను చూసిపోత.” అన్నాడు.

“సరే అన్నా! ముందయితే జర కూసో” అని మంచినీళ ్ళ ఇచ్చి వేప చెట్టుకింద మంచం వేసి కూర్చోబెట్టింది. ఇంతలో “అమ్మా!” అంటూ ఎదురొచ్చాడు తొమ్మిదేళ్ళ శివ.

“అమ్మా! తమ్ముడు స్కూలు ఫస్ట్ వచ్చిండు. టీచర్లు అందరూ మెచ్చుకున్నారు.” అన్నది పావని లోపలికి వస్తూ. నీల తన కొడుకును ముద్దాడుతుంటే రఘు గుర్తుకొచ్చి కళ్ళలో నీళ్ళుతిరిగాయి కిషన్ దాసుకి. పదహారేళ్ళ ఈ అమ్మాయి నీలను “అమ్మా అమ్మా..” అని పిలుస్తుంటే మనసంతా అదోలా అయ్యింది అతనికి. ఇంతలో శ్రావణి వచ్చింది. “అమ్మా! నాకా సంగతి నాయినను అడిగావా లేదా?” అని అడిగింది. “ఇవ్వాళ అడుగుతా బిడ్డా! తప్పకుండా కాలేజీల చేరుదువుగానీ..” అన్నది నీల. వాళ్ళంతా అక్కాచెల్లెల్లా ఉన్నారు గానీ తల్లీబిడ్డల్లా లేరు..

“రా అన్నా.. కాళ్ళు కడుక్కో” అన్నది. మొహమాటంగానే ఆమె పరిచిన గోనెపట్టా మీద కూర్చున్నాడు. పళ్ళెంనిండా అన్నం పెట్టి, కూరా పచ్చడి వేసి చెంబుతో మంచినీళ్ళు పెట్టింది. దగ్గరుండి కొసరి కొసరి భోజనం పెట్టింది. అతను తన భార్యాపిల్లల ముచ్చట్లు చెబుతుంటే విన్నది. మధ్యలో గోపయ్య వచ్చాడు. అతడిని చూడగానే కిషన్ దాసు మనసంతా అదోలా అయిపోయింది. గోపయ్యకి కూడా భోజనం వడ్డించి.. కడుపుతో ఉన్న కిషన్ దాసు భార్య గురించి చెప్పి బాధపడింది. అన్నం తిని కాసేపు కిషన్‌దాసుతో మాట్లాడి గోపయ్య చేనుకి వెళ్ళిపోయాడు.

“చూడన్నా.. ఈ పైసల బాధలు ఎప్పుడూ ఉంటయి. ఊర్లె ఒక జీవాన్ని అమ్మయినా సరే ముందు నువ్వు వెళ్ళి వదినెని చూసిరా. కావాలంటే నేను బేరం దెస్త..” అని చెప్పింది. “ఒక్క నిముషమాగు” అని లోనికి వెళ్లి ఒక కవరు తీసుకొచ్చి ఇచ్చింది. “వదినెకు ఈ చీర ఇవ్వు. నీల ఇచ్చిందని చెప్పు” అన్నది

“అదేంది చెల్లే. చెల్లెకు అన్నావదినెలు పెట్టరా? నువ్వు మాకు బెట్టవా?” చాలా మొహమాటపడ్డాడు.

“మా వదినెకు నేను ఇస్తున్న. నువ్వేం మాట్లాడకు. అంతా మంచిగానే అయితది అన్న. రంధివడకు..” అని చెప్పింది.

“ఒక్క ముచ్చట అడుగుత చెల్లె.. ఏమనుకోవు గాదా ?”

“అడుగన్నా.. మనసులో దాసుకుని నాలుగుతీర్ల ఆలోచన చేసేదానికంటే అడుగుడే నయ్యం గదా..”

“ఏమీలేదు చెల్లే. మల్లెచెండు తీరున్నావు. అంత వయసోడిని, ముగ్గురు పిల్లల తండ్రిని మారు మనువోడిని ఎందుకు జేసుకున్నవో అని అడగాలనుకున్నా. నువ్వు బాధపడనంటేనే చెప్పు”

“అంతే కాదు. నీ దోస్తునెట్ల మర్చిపోయిననో అని కూడా.. నీ ఆలోచన నాకు తెలుసులే అన్నా!” అన్నది.

అతని ఆలోచనలేమిటో అర్థమైన నీల నీలాల కన్నుల నుంచి నీలాలు కారాయి. ఆలోచనల ధారలో ఆమె మనసు తడిచిపోయింది.

♦ ♦ ♦

ఆ చేలదారి వాతావరణమంతా వేసవి పూల వాసనలతో నిండిపోయి ఉన్నది. రఘు సైకిల్ ముందు భార్యను కూర్చోబెట్టుకుని చేనునుంచి ఇంటికి తీసుకెళ్తున్నాడు.

“అసలు ఈ ఎండలకు జనమేమో ఉడికి సస్తా వుంటరు కదా! ఇంత సుకుమారంగా ఉండే ఈ పూలేంది? ఎండల్లోనే ఇరగబూసి ఇట్లా మిలమిలా మెరిసి పోతుంటాయి?” కొమ్మలనిండా పువ్వులను నింపుకుని

వచ్చేపోయేవారి చూపులన్నీ తన వైపు మరల్చుకునే అగ్నిపూలచెట్లను, అక్కడక్కడా వున్న మోదుగ పూలచెట్లనూ కన్నులనిండా చూసుకుంటూ పదేపదే అదే ప్రశ్న అడుగుతుండేది నీల.

"పిచ్చి నీలా! వాటికి ఆహారమే ఈ ఎండ. ఎండ నిండుగా ఉన్న ఈ నాలుగునెల్లూ దారి పొడుగునా ఈ అడవి పూలన్నీ గుత్తులు గుత్తులుగా పూస్తుంటాయి. ఎంత ఎండయినా అవి వాడవు. కానీ ఒక కొమ్మ తెంచి తీసుకెళ్ళి చూడు. చల్లటి నీడలో పెట్టినా సరే... అరగంటకే వడలిపోతాయి. అదే ఇచిత్రం మరి.." అతను జవాబు చెప్తుంటాడు. అట్లా ఏదో ఒకటి మాట్లాడిస్తూ అతను మాట్లాడుతుంటే రఘుని మురిపెంగా చూసుకుంటుం టుంది. మధ్య మధ్య సైకిల్ ఆపేసి ఆ చెట్టు చుట్టూ, ఈ చెట్టు చుట్టూ తిరుగుతూ మురిసిపోతుంటుంది.

"పోనీ ఈడనే ఒక ఇల్లేసుకుందామా నీలా?" అని అడిగేవాడు. ఇంటర్ చదువుతున్న నీలను రఘు ఇష్టపడి వాళ్ళ అమ్మనాన్నలను ఒప్పించి చేసుకున్నాడు. ఒకవంక చదువుకోవాలని వున్నా తనను పెళ్ళి చేసుకుని తన ఇంటి ఇల్లాలయినందుకు ఎంతో మురిసిపోతుంటాడు రఘు. అతను సూరిడల్లె ఆమెకు తోడుంటే ఈమె ఆయా రుతువుల్లో పూసే పూవుల్లా సంతోషాలను విరగబూయిస్తుం టుంది. ఇంచుమించు ప్రతిరోజూ ఇద్దరూ చేను గట్లమీద ఉన్న ఆ చెట్ల కింద కూర్చుని తెచ్చుకున్న సద్ది తింటూ మనసులు విప్పుకుని మాట్లాకుంటుంటారు. తమ జీవితంలోకి ఓ బుడ్డోడు రాగానే వాడికి ఆ చెట్టుకొమ్మనే ఉయ్యాల చేసి, వాడికీ మురిపాలు పంచారు.

ఇప్పుడు వాడికి ఎనిమిదేళ్ళు వచ్చాయి. మళ్ళీ అన్ని రుతువులతోపాటు వేసవి వచ్చింది. ఎప్పటిలాగా మోదుగ పూచింది. అగ్నిపూలు పూసాయి. రేలపూలు విరగబూసి కొమ్మల ఊయలలూగుతున్నాయి. ఎప్పటిలాగే ఆ చెట్లకింద నీల ఉన్నది. నీల కొడుకు శివా ఉన్నాడు. రఘు మాత్రం ఆమె గుండెలనుంచి వెలికిరాని వెల్లువయ్యాడు. ఆమె కన్నుల్లో నీరయి సుడులు తిరుగుతున్నాడు.

ఓ సాయంత్రాన్ని నిశి ఆవహిస్తున్న వేళ అది. సిటీ నుంచి తిరిగివస్తూ ఇంటికి వెళ్ళాల్సిన తొందరలో జంట ఎడ్ల తాడు చూసుకోకుండా వాటి మధ్య నుంచి బండిపై ముందుకు దూసుకెళ్లాడు రఘు. ఆ తాడు అతని మెడను ఈడ్చి కింద పడేసింది. వెల్లకిల్లా పడ్డాడు. శరీరం ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించనేలేదు. అతని ప్రాణం మాత్రం పోయింది. ఈ తుపానును తట్టుకోలేని నీల ఇక దక్కదేమో అన్నంతగా కృశించిపోయింది. నెలల కొద్దీ ఏడ్చిఏడ్చి ఆమె రక్తమంతా కన్నీరుగా కరిగిపోయింది. చిక్కి శల్యమై పిచ్చివాడిలా తల్లి చుట్టూ చుట్టూ తిరుగుతున్న శివాను చూపించి ... "వాడిని ఏమి చేద్దాం అనుకుంటు న్నావు నీలా?" అని కఠినంగా నిలదీసింది నీల తల్లి. వాడిని పట్టుకుని గుండెలు అదిరేలా ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పోయింది ఆమె. అంతే! అక్కడినుంచి ఆమె దుఃఖాన్ని నిగ్రహించుకోవడం అలవర్చుకున్నది. కొడుకు కోసం మళ్ళీ లేచి పనుల్లో పడింది.

◆ ◆ ◆

ఎప్పటిలా అక్కడే ఎక్కడో అతను తచ్చాడుతూనే ఉంటాడనుకుంటూ ఓ వనకన్యలా అక్కడే చేల దారంట తిరుగాడుతూనే ఉన్నది. తన జతగాడు ఉంటే పులి కూడా అవతలి నుంచి అవతలికే వెళ్ళిపోతుంది. కానీ ఒంటరి జింకలా నీల తిరుగాడుతుంటే పిల్లి కూడా పులయి కారాడుతున్నదిప్పుడు. తానెంత దుఃఖంలో మునిగి ఉన్నా ప్రమాద ఘంటికలు పసిగట్టే ఆడతనం ఉలిక్కిపడి పరుగులు పెట్టిస్తూనే ఉంటుంది. ఇప్పుడూ అలానే ఉరుకులు పరుగుల మీద ముందుకు సాగుతున్నదామె.

"ఓ అమ్మీ ఏందా పరుగులు? జరంత ఆగు.."

"ఏమీలేదు గోపయ్యా! పిల్లోడు ఒక్కడే ఉన్నడు. తొందరగా ఇంటికి పోవాల.. అందుకే ఉరుకుతున్న"

"సరే సరే పోదువులే.. కొంచెమాగు" గుసగుసగ అన్నాడు.

నీల పై ప్రాణాలు పైనే పోయినయి. వెనుకనుంచి వాళ్ళెవరో తరుముకొస్తుంటే ముందునుంచి ఈయన ఏంటి "ఆగు, ఉండు" అని గుసగుసలు బోతున్నడు. తనకంటే సుమారు ఇరవయి ఏళ్ళ పెద్దవాడు. ముగ్గురు ఆడపిల్లల తండ్రి. ఇతనికి కూడా నేను చులకనయిపోయానా? మనసుకు ఒకింత బాధ కలిగినా పట్టించుకోకుండా ముందుకు కదిలింది.

"చెప్తుంటే నీకు కాదా? అట్లా పోకు. జర్రాగు.." మళ్ళీ గుసగుసగానే అయినా కాస్త పదునుగా అన్నాడు.

"ఎందుకు ఆగాలా? ఆడ మా పిల్లగాడు ఒక్కడే ఉన్నాడంటే నడుమ నువ్వేంది.. ముందుకు బోకుంట

ఆపుతున్నావ్?" పౌరుషంగా అడిగింది

"ఓ నీలా! ఆడ జంటనాగులు బుసగొడ్తున్నాయి. మంచి ఆటలో ఉన్నాయి. గిప్పుడు ఎవ్వలన్నా అటు దిక్కుబోతే కాటేస్తాయి. ఒక్క గంటవరకు అటు ఎవ్వళ్ళూ పోవద్దు" అతను అనునయంగా చెప్పేసరికి నీల తన రోజులు బాగోనందున ఇలా అందరినీ అనుమానించవలసి వస్తున్నదని కించపడింది. కొడుకు గుర్తుకు వచ్చి కంగారు పడింది. వెనక్కు మళ్లీ మళ్లీ చూసుకుంటూ ఇందాక వెంటపడ్డ వాళ్ళు వస్తున్నారేమో అని గమనించుకున్నది.

"పత్తి గొంటం, మిరపగొంటం అని ఊర్లెకు వస్తరు. వచ్చిన పని జూసుకొని పోరు. పైట కనపడితే పది మైళ్ళు ఎంట బడతరు" కష్టం చెప్పుకున్నది.

"ఏందీ నీలా! నీ ఎంట బడ్డరా గాడ్ది కొడుకులు? ఇందాకటి నుంచి చెప్పవేంది? నిన్ననే కొడవళ్ళు తేజ్ బట్టిపిచ్చిన. నరికి పారేస్త గాడ్ది కొడుకులను" ఆవేశపడ్డాడు గోపయ్య.

అతనలా మాట్లాడుతుండగానే రయ్ రయ్మంటూ రెండు బండ్లమీద నలుగురు మొగవాళ్ళు వేగంగా వచ్చారు. గోపయ్య ఎదురెళ్ళి రొమ్ము విరుచుకు నిల్చున్నాడు.

"అన్నా! మిరపకాయలున్నయానే? కొననీకి వచ్చినం" బండి ఆపి అమాయకంగా అడిగారు.

"లేవు తమ్ముడూ! మా దగ్గరే దంపుడు పట్టి కారం అమ్ముతున్నరు. మా ఊర్లె సిన్నోల్లు పెద్దోళ్ళు అందరికీ దంచుడు బాగా వొచ్చు. మీగ్గూడా కారం గొట్టిపిచ్చమంటారా?" అడిగాడు నర్మగర్భంగా.

"వద్దులే అన్నా.. కాయలే గావాల. పోతున్నాం." అంటూ వెనక్కు తిరిగి చూడకుండా వేగంగా వెళ్ళిపోయారు.

నీల మౌనంగా వెళ్ళిపోబోయింది. "ఏందీ నీలమ్మో ఈ కథ.. మొన్న, గా షావుకారు పొలంల నాట్లేసి వస్తాంటే వాడు నిన్ను నమిలేసేతట్టు జూస్తున్నాడు. చేతికి పైసలు దొరికితే తీసుకొని ఉరుకుదామని జూస్తవ్. గంతేగానీ అసలు ఎవరెవరు నీ దిక్కు ఎట్లెట్ల జూస్తున్నారో జర జూసుకోవా.." చనువుగా మందలించాడు. తలవంచుకుని మౌనంగా ముందుకు సాగిపోయింది.

♦ ♦ ♦

క్రితం సంవత్సరం గోపయ్య భార్య జాతరకు పోయివస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. గోపయ్య పిల్లలు కూడా ఎటూగాని పరిస్థితుల మధ్య నలిగి పోతున్నారు.. ఎటూగాని వయసులో ఉన్న ఆడపిల్లలకు తల్లి అవసరం ఎంతగానో ఉన్నది. చక్కగా చదువుకునే ముగ్గురు ఆడపిల్లలూ బిక్కచచ్చిపోయి బెదురుబెదురుగా తిరుగుతున్నారు. మారు మనువు చేసుకొమ్మని చుట్టాలు ఎంత చెప్పినా గోపయ్య వినలేదు. నీలకు తల్లిలేని ఆ ఆడపిల్లలను చూస్తే ఎక్కడ లేని జాలి. వీలు కుదిరినప్పు డల్లా వాళ్ళకు జడలు వెయ్యడం, వోణీలకు పిన్నులు పెట్టడం, ఏ కూర ఎలా వండాలో నేర్పడం చేస్తూ వుంటుంది.

ఒకనాడు శ్రావణి పరుగెత్తు కొచ్చి.. "తండ్రి అటు వెళ్ళగానే రోజూ శంకరయ్య వచ్చి కూర్చుని విసిగిస్తున్నా డని, చెయ్యి పట్టుకున్నాడని" నీలను పట్టుకుని బావురు మన్నది. నీల వెళ్ళి అతనితో తగాదా పెట్టుకుని కొట్టినంత పనిచేసి వచ్చింది.

మరో రోజు ఉరుక్కుంటూ వచ్చి "చెల్లె మూలకు చేరింది. అందరూ చేలకు వెళ్ళారు. ఏడుస్తున్నది. నాకు ఏమి చెయ్యాలో అర్థం కావడం లేదు." అని పావని పరుగు పరుగున వచ్చింది. నీల వెళ్ళి అన్నీ సక్కబెట్టింది. ఆ సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి వెళ్తుంటే చేతులు పట్టుకుని ఏడ్చింది శ్రావణి. తల్లిలేని ఆ పిల్లలంటే ప్రేమా జాలితో కదిలిపోయింది నీల. తనలాంటి బాధితులే వీళ్ళూనూ అనిపించింది. ఈ సమయంలో వాళ్ళ కన్నతల్లి ఉంటే ఎంత సంబరం చేసేదో అని బాధపడింది. ఇంటికి వస్తుంటే..

"ఏమే నీలా! నీకు వయసులో ఉన్న మేము నచ్చమా? ఆ ముసలోనితో ప్రేమలో పడ్డావా?" అని అంటూ దారంతా పోకిరీ వెధవలు నోటికొచ్చినట్టు వాగారు. గోపయ్యను కూడా దారి కాచి.. "వయసులో ఉన్న పిట్టను భలే పడేసావు.. ఆ రహస్యం ఏమిటో మాకూ చెప్పు" అనడం మొదలు పెట్టారు. రానురాను ఈ పరిస్థితి ఇద్దరికీ ఇబ్బందిగా మారింది.

ఒకరోజు.. అగ్నిపూల చెట్టుకింద కూర్చున్న నీల అదే దారిన వెళ్తున్న గోపయ్యను ఆపి "నీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నది.

"ఊరోళ్ళు ఇంటాబయట నిన్నూ, నన్నూ చాలా

చిరాకుబెడ్తున్నారు. ఇంట్లో శ్రావణి, పావని, శారద నాకు బాగా అలవాటయ్యారు. ఈ గోలంతా ఎందుకు నన్ను పెళ్ళిచేసుకుంటావా గోపయ్యా?" అంది. అదిరిపడ్డాడు గోపయ్య.

"నీకు దిమాక్ ఖరాబయ్యింది. నా కూతురి వయసు నీకు. నేను నిన్ను పెళ్ళిచేసుకునుడేంది? అసలు నేనే నీతో మాట్లాడాలనుకున్నా. ఈ లొల్లంతా ఎందుకు? నువ్వు మా ఇంటికి రాకు. నా పిల్లలు నీ ఇంటికిరారు అని చెప్పుదామనుకున్నా. మల్ల ఏడ ఏడుస్తవో అని ఊరుకున్న నీల." కోప్పడుతున్నట్టుగా, వారింపుగా అన్నాడు.

"అదే నేను అంటున్న గోపయ్యా! ఈ లొల్లికి ఒక్కటే మందు కనవడుతున్నది. నువ్వు నన్ను పెండ్లి చేసుకో" ఆమె స్థిరంగా అన్నది.

"అరె మల్ల అదే మాట. నాకు పెళ్ళేంది? అసలు నాకు ఇప్పుడు పెళ్ళి అవసరమా? రెండేండ్లయితే ఆడిపిల్లల పెండ్లిళ్ళు జేయ్యాల్సినోడిని. పెళ్ళట పెళ్ళి" చిరాకు పడిపోయాడు.

"అవును పెండ్లే దీనికి జవాబు. చూడు గోపయ్యా! నువ్వు నాకు మొగనిగా గానీ, నీకు నేను భార్యగా గానీ ఒకరికొకరు అవసరం లేదు. కానీ, నీ ముగ్గురు ఆడపిల్లలకు తల్లి ఎంత అవసరమో నాకు తెలుసు. వాళ్ళకు నేను, నాకు వాళ్ళు బాగా అలవాటయ్యాం. ఆ అమాయకపు పిల్లలకు నేను తల్లినౌతాను. ఇక నాకు బయట ఉన్న చిరాకులు నీకు తెలుసు. నాకు తెలుసు. నా కొడుకుకు ఒక దక్షత కావాలి. నాకు ఒక తోడు వున్నాడని లోకానికి తెలియాలి. ఇంత బలమూ, బలగమూ ఉన్న నువ్వు నా తోడుంటే జోలికి ఎవ్వరూ రారు. ఇంతే నాకు కావాల." ఆమె మాటలు చాలా స్పష్టంగా వచ్చాయి.

"వయసులో ఉన్న నిన్ను ఎవరయినా చేసుకుంటారు నీలా. ఎందుకు నన్ను చేసుకుని నీ బతుకును ఇట్లా పాడు చేసుకుంటావు?" అనునయంగా అన్నాడు.

"గోపయ్యా! ఈ పెళ్ళి అందరిలాంటి పెళ్ళి కాదు. ఇది ఒక అవసరాల పెళ్ళి అనుకో. నాకు నా జోలికి ఎవ్వరూ రాకుండా ఉండడం నాకు కావాలి. నా బిడ్డకు ఒక తండ్రి, పెద్ద దిక్కు కావాలి. నీ ఆడపిల్లలకు ఒక తల్లి కావాలి. వాళ్ళని మంచిగా ఒక తల్లికోడిలా కాపుగాసే ఆడది నీ ఇంటికి కావాలి. అందుకోసమే ఈ పెళ్ళి. అంతకు మించి నన్ను నువ్వు ఏమీ అడగవని తెలుసు. అంతకు మించి నేను నిన్ను ఏమీ అడగను. ఇదీ ఒప్పందం." గోపయ్య తెల్లబోయి విన్నాడు. మౌనంగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు. కొద్దికాలం పెద్దల చర్చలు జరిగాక అమ్మవారి గుడిలో కొద్దిపాటి బంధుమిత్రుల సమక్షంలో నీలకు, గోపయ్యకు పెళ్ళి జరిగిపోయింది


జరిగిందంతా తనకు తోచిన పద్ధతిలో చెప్పి "ఇదన్నా జరిగింది." అని నీల చెప్తుంటే కిషన్ దాసు విస్తుబోయి విన్నాడు. ఆమె చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు. "ఇప్పుడే కాదన్నా ఎప్పటికయినా నేను ఏడ కూర్చున్నా, ఏమి జేస్తున్నా రఘూనే నా మనసులో మెదులుతుంటాడు. ఈ పెళ్ళిజేసుకున్న గదా! ఇగ ఇప్పుడు నా జోలికి ఎవ్వరూ రారు" చిన్నగా గమ్మత్తుగా నవ్వింది నీల. విచిత్రంగా చూసాడతను

"చెల్లే! నీది మంచి మనసు. గాలివానకు అల్లాడిన గోపయ్య పిల్లలకు గొడుగువై నిలబడ్డవు. నీకంతా మంచే జరుగుతది. పోయొస్త చెల్లే. ఒక ఆర్నెల్లాగి నిన్ను జూడనీకయినా ఈ ఊరొస్త వస్త. పైలం చెల్లే.." అని చెప్పి వెనక్కు మరలి చూస్తూ కిషన్ దాసు వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

గదిలోకి వెళ్ళి మంచంమీద వాలిపోయిన నీలకు "ఇది ఒక అవసరాల పెళ్ళి" అనగానే కిషన్ దాసు చూసిన వెర్రిచూపు చూపు గుర్తుకు వచ్చింది. ఈ అవసరాల పెళ్ళిలో ఒక మాగాడిగా గోపయ్య తన మరో అవసరం తీర్చమని అడిగితే ఏమి చేసేదానివి?" అని మనసు ఎన్నిసార్లో నిలదీసింది. "కాయకష్టం నాకు అలవాటే కదా.. ఏమో స్నానానికి నీళ్ళు పెట్టినట్లు, ఆకలికి అన్నం బెట్టినట్లు నాకు అండగా ఉన్నందుకు ఆ అవసరం కూడా తీర్చేదాన్నేమో.." మూసినా కన్నులనుంచి నీరు జారుతుండగా అనుకున్నది నీల.

ఎప్పుడు వచ్చాడో కళ్ళు మూసుకుని పడుకున్న నీలను చూసి తలుపు దగ్గరకు వేసి వాకిట్లో వేపచెట్టుకింద మంచంపై వాలాడు గోపయ్య. "పెళ్ళయి సంవత్సరం అవుతున్నా.. ఉండుండి నా వంక బెదురుగా చూస్తుంటవు. పిచ్చి నీలా! నిన్ను ఆలిగా ఎప్పుడూ చూడడడం లేదు. నేను, నా పిల్లలూ నిన్ను అమ్మగానే చూస్తున్నాము.." గుండెల మీద చెయ్యి వేసుకుని అనుకున్నాడు గోపయ్య. ■



## కవిత

# అమ్మ గుర్తొచ్చిన ప్రతిసారీ ...

- పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

1
ఈ మధ్య అమ్మ గుర్తొస్తోంది
అమ్మ గుర్తొచ్చిన ప్రతిసారీ
అమ్మ పెట్టిన అన్నం ముద్ద
గుర్తొస్తోంది
అలిగినా కసిరినా
అన్నం ముద్ద విసిరికొట్టినా
అంతే మురిపెంగా ముద్దు చేసి
మరలా నోటికి ముద్ద అందించే
అమ్మ పదే పదే గుర్తుకొస్తోంది

2
పొలం నుంచి కౌలురైతు
ఎడ్లబండిలో వడ్లు తెచ్చి
గాదె నింపుతుంటే చూడాలి..
అమ్మ కళ్ల నిండుగా
కడుపు నిండుతున్న ఆనందం!

రైతు కాలు కదపనీయకుండా
సకల మర్యాదలతో
భారీగా భోజనం పెడుతుంది
'ఎందుకమ్మా' అంటే
'నేన్నీకు అమ్మనయితే
రైతు ఊరందరికీ అమ్మరా' అంటుంది!

3
అప్పటినుంచి
అమ్మన్నా.. రైతన్నా ఇష్టం
చూస్తే నాకు
అమ్మకి రైతుకి
పెద్ద తేడా లేదనిపిస్తుంది

4
అమ్మంటే చిన్నచూపు
రైతంటే మరీ కింద చూపు
అమ్మంటి రైతుల మీద
రాజ్యంది దేగ చూపు!

5
అన్నం పెట్టే మట్టిచేతులకు
బేడీలు వేసిన అటవిక ఆవుల రాజ్యం
రైతుల కడుపుల్లో మంట రాజేసి
చలి కాచుకుంటుందీ నల్లచట్టాల
రాజ్యం

మండీలు మాయం చేసి
కార్పొరేట్ తేలుకొండెల అంగళ్ల కిందకి
గిడ్డంగుల కిందకి
తిండిగింజల్ని సంకెళ్లేసి తెచ్చి
'రైతుకి స్వేచ్ఛనిచ్చాం'
నమ్మమంటోందీ రామరాజ్యం..

6
దేశానికి మాత ముఖం వేసి
దేశభక్తిని ఓట్ల తక్కెడలో లెక్కిస్తున్నావు సరే..

ముసలితల్లిని కూడా
నోట్లరద్దు రద్దీ లైనులో నిలబెట్టి
యాభై రోజుల మోసానికి
తెరలేపావు సరే..
చిన్ని చిన్ని వీధివర్తకుల నెత్తిన
జియస్టీ మేకు దిగ్గొట్టి
వాళ్ల కడుపులు కొట్టావు సరే..

నువ్వెవరివి.. నువ్వెక్కడోడివి అంటూ
పత్రాలడుగుతున్నావే..
నేల కింద వేర్లు తెంపుతున్నావే..
వేరు బంధం నెరుపుతున్నవే..
సరే కాదు..

అమ్మలని అన్నదాతలని
రోడ్డు మీద చలికి బలి పెడుతున్నావే..
దేశం నోటికాడ అన్నం తన్నుకెళ్లి
అదానీల భోషాణాలు నింపుతున్నావే..
సరి కాదు.. సరేకాదు..

7
అమ్మ
కడుపు మండదు. మండింది.
రైతు
గుండె మండదు. మండింది.

పొలం దున్నిన నాగళ్లు
చేను దున్నిన నాగళ్లు
చలిరోడ్డు మీద
నెగళ్లై కణకణమండుతున్నాయి!


అడగందే అమ్మయినా పెట్టదు
రైతు అడుగుతున్నాడు..
రైతు తల్లులడుగుతున్నారు
దేశం క్షుద్బాధ మీద అన్నం చినుకులై కురిసే
ప్రతి గింజా అడుగుతుంది..
మూతికి చిక్కం కట్టి
మాయామార్కెట్ల పని చక్కబెట్టే
మోసపు చట్టాలని
ఎండేసి ఎండగట్టాలని..
కనీసపు కంటి ఓదార్పు ధరనైనా
వడ్లబస్తాల కాటాలకు తగిలించాలని..

8
పొలాలన్నీ ఖాళీ..
ఊళ్లన్నీ ఖాళీ..
నాగళ్లన్నీ నలుదిక్కులా
హస్తిన చుట్టూ మోహరించాయి
దుక్కి దున్ని దున్నీ వున్న నాగళ్లు
ఈ దుఃఖాన్ని దున్నలేవా..
ఈ దుర్మార్గాన్ని దునుమాడలేవా..
వడ్లగింజ వెన్నులో
పాలు పొటమరించిన నాగళ్లు..
ఈ విషం చుక్కల నడ్డి విరగ్గొట్టలేవా?

9
అమ్మ గుర్తొచ్చిన ప్రతిసారీ
రైతులూ గుర్తొస్తున్నారు
రైతులు గుర్తొచ్చిన ప్రతిసారీ
అమ్మలు గుర్తొస్తున్నారు

ఇదిగో– అమ్మలకు అండగా
నాగలి ఎత్తుకుంటున్నా..
నీటితూటాలకు ఎదురొడ్డిన
మొండిగుండెల పక్కన నినాదమై
పిడికిలెత్తి నిల్చుంటున్నా..

10
అమ్మ కడుపు మాడితే
నా కడుపు మాడినట్టే..
రైతు కడుపు మాడితే
దేశం ఆకలికి మాడినట్టే.. ■



## సామాజిక సమతాస్థితిని కాపాడుతున్న
# రాయలసీమ ముస్లిం కథ

**- వేంపల్లి షరీఫ్**

**తె**లుగులో ముస్లిం మైనార్టీ కథా సాహిత్యానికి పుట్టినిల్లు రాయలసీమ. 1988లో కడపజిల్లాకు చెందిన షేక్ హుస్సేన్ సత్యాగ్ని 'పాచికలు' కథ రాయడంతో తెలుగులో ముస్లిం మైనార్టీ కథాసాహిత్యం మొదలైంది. అంతవరకు తెలుగులో ముస్లిములు రాసిన ముస్లిమేతర సాహిత్యం, ముస్లిమేతరులు రాసిన ముస్లిం సాహిత్యం ఉంది కానీ ముస్లిములు రాసిన ముస్లిం కథా సాహిత్యం లేదు. ఆ లోటును తీర్చడానికి రాయలసీమకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్తలు మధురాంతకం రాజారాం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య గార్లు చేసిన సూచన మేరకు తాను కలం పట్టానని రచయితే స్వయంగా తన కథల పుస్తకంలో చెప్పుకోవడం విశేషం.

పూర్తి భిన్నమైన సామాజిక, సాంస్కృతిక జీవితం ఉన్న ముస్లిముల గురించి ముస్లిములే రాసుకోవడం వల్ల అనేక విషయాలు మరింత లోతుగా తెలుగు సాహితీ లోకానికి తెలుస్తాయనే ఉద్దేశ్యంతో వారు ఈ సూచన చేసుండొచ్చు. ఏదేమైనా తెలుగులో ముస్లిం మైనార్టీ కథాసాహిత్యం అంతర్గత సంస్కరణాభిలాషతో మొదలవడానికి వాళ్లూ ఒక కారణమయ్యారు. తొలి కథ 'పాచికలు'లో రచయిత షేక్ హుస్సేన్ సత్యాగ్ని ఇస్లాం మతంలో 'తలాఖ్' పద్ధతి దుర్వినియోగం అవుతున్న తీరును కళ్లకు కట్టినట్టు రాశారు. దీన్ని ఆధారం చేసుకుని కొంతమంది మతపెద్దలు ఆడే ఆటలో పాచికల్లా మారుతున్న స్త్రీ జీవితాలను హృద్యంగా చిత్రించారు.

తెలుగులో తొలి మైనార్టీ ముస్లిం కథ మరో ప్రాంతంలో పుట్టి ఉంటే దాని తీరుతెన్నులు ఎలా ఉండేవో తెలియదు కానీ రాయలసీమలో పుట్టడం వల్ల అది లోపలి, బయటి సమస్యల్ని నిస్సంకోచంగా చీల్చి చెండాడే పదునైన కత్తిగా తయారైందని మాత్రం చెప్పగలను. ఎందుకంటే రాయలసీమ మొదటి నుంచి కూడా హిందూముస్లిముల ఐక్యతకు చిహ్నం. ఒకరి పట్ల ఒకరు సహానుభూతి కలిగి సహజీవనం చేసే సంస్కృతి రాయలసీమలో ఉంది. కులమతాలకు అతీతంగా ఇక్కడ ఒకర్నొకరు వరసలు పెట్టి పిల్చుకుంటారు. అందుకే బయటి ప్రాంతాల్లో జరిగే అనేక సంఘటనలు ఇక్కడ అంత తొందరగా ప్రభావం చూపవు. పైగా ఎంత క్లిష్ట పరిస్థితిలో అయినా రెండు సమూహాలు పరస్పరం శాంతి, నిగ్రహంతో మెలగడం ఇక్కడ చూస్తాం. ఇక్కడివాళ్లకు మొదట మానవీయత, ఆ తర్వాతే మతం. అందుకే ఎంత పెద్ద కథావస్తువునైనా సహానుభూతి ధోరణిలోనే చిత్రించడం ఇక్కడి ముస్లిం రచయితల ప్రత్యేకత. ఒకవైపు అంతర్గత సమాజంలోని చిన్న చిన్న లోపాలను ఎత్తిచూపుతూనే మరోవైపు మెజార్టీ సమాజంలో సహానుభూతిని పొందే లక్ష్యంతో ఇక్కడి కథ వెల్లి విరిసింది.

రాయలసీమ ముస్లిం కథను 2002 సంవత్సరానికి ముందు, ఆ తర్వాతగా విభజించుకుని పరిశీలిస్తే మనకు అనేక విషయాలు అర్థమవుతాయి. మొదటితరం రచయితలు ఇంతకుమునుపు చెప్పుకున్నట్టు ముస్లిం సంప్రదాయాల్లో ఉన్న లోటుపాట్లను చర్చకు పెడితే మలితరం రచయితలు సామాజిక వెనకబాటు, నిరక్షరాస్యత, నిర్లక్ష్యం, వివక్ష, హక్కులు, సమానత్వం గురించి మాట్లాడారు.

షేక్ హుస్సేన్ తర్వాత ముస్లిం సంప్రదాయాలు, కట్టుబాట్లను కథనం చేసే ఒరవడిని కొనసాగించిన రచయిత్రి షహనాజ్. అనంతపురం జిల్లాకు చెందిన ఈమె 1996 ఆగస్టులో

'మానవత్వం మకాం వేసిన చోట' అనే కథ రాశారు. ఈ కథ కూడా పూర్తిగా అంతర్గత సాంప్రదాయ స్త్రీ సమస్య అంశంగానే నడుస్తుంది. మొదటి భార్యకు తలాఖ్ ఇచ్చి ఇద్దత్ చెల్లిస్తూ రెండో భార్యతో సంసారం చేస్తున్న భర్త హఠాత్తుగా చనిపోతే షరియత్ ప్రకారం ఇద్దరి భార్యలకు న్యాయం ఎలా జరగాలి అనే అంశంపై చక్కగా అల్లిన కథ ఇది. ఈ కథరాసి షహనాజ్ రాయలసీమ నుంచి వచ్చిన తొలి ముస్లిం మైనార్టీ కథా రచయిత్రిగా కూడా తెలుగు సాహిత్యంలో నమోదై ఉన్నారు. ముస్లిముల్లో తలాక్ సంప్రదాయంపై ఇటీవల విపరీతమైన చర్చ జరిగిన నేపథ్యంలో తనదైన శైలిలో 'ముసుగు' అనే కథ రాసి చిత్తూరు జిల్లాకు చెందిన రచయిత వేంపల్లి అబ్దుల్ ఖాదర్ కూడా ఈ ఒరవడిని అందుకున్నారు. వరుస క్రమంలో చూసుకుంటే షహనాజ్ తర్వాత రాయలసీమలో కనబడే పేరు ఎన్నెస్ ఖలందర్. ఈయన 'మున్నీబేగం' కథను 2001లో వార్త దినపత్రికలో రాశారు. ఇంచుమించు ఇదే కాలంలో కడప జిల్లాకే చెందిన మహమూద్ విజయ విహారంలో 'హజారా' అనే కథ రాసినట్టు గుర్తు కానీ పూర్తి వివరాలు తెలియడం లేదు.

మొదట వచ్చిన రెండు (పాచికలు, మానవత్వం మకాం వేసిన చోట) కథలతో పోల్చుకుంటే మున్నీబేగం కథ కొంత భిన్నంగా ఉంటుంది. అంతిమంగా ముస్లిం స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన కథే అయినప్పటికీ ఇందులో రాయలసీమ స్థానిక సమస్య కూడా కనబడుతుంది. మొదటి రెండు కథల్లో ముస్లిం స్త్రీ పాత్రలకు ఎదురైన ఆయా సంప్రదాయ సమస్యలను పురుషులు జోక్యం చేసుకుని పరిష్కరిస్తారు. కానీ 'మున్నీ బేగం' కథలో స్త్రీ పాత్ర తన సమస్యకు తానే పరిష్కారం వెతుక్కుంటుంది. భర్త మీద సున్నితంగా నిరసన తెలపడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తుంది. పైగా పొట్టకూటి కోసం పురుషులు గల్ఫ్ వెళ్లిన ముస్లిం కుటుంబాల్లో స్త్రీలు ఎంత నిర్లక్ష్యానికి గురవుతారో ఈ కథ ఆర్ద్రంగా చిత్రించి కన్నీళ్లుపెట్టిస్తుంది.

రాయలసీమలో ఉన్న 13 శాతం మంది (2011 లెక్కల ప్రకారం) ముస్లిముల్లో చాలామంది పేదలు. టీ కొట్లు, మటన్‌షాపులు, రిపేర్ సెంటర్లు, సర్వీస్ సెంటర్లు, పంక్చర్ షాపులు, వెల్డింగ్ షాపులు, కూరగాయలు, పండ్లు, తిను బండారాలు, కూల్ డ్రింకు షాపులు నడుపుకుంటూ కనిపిస్తారు. మరికొంతమంది చిన్న చిన్న చేతి వృత్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. చదువుకున్న వాళ్లు తక్కువ. ఎంతోకొంత చదువుకున్నా అది ఎందుకూ పనికిరాక డ్రైవింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులు నేర్చుకుని సౌది, కువైట్, ఖతర్ వంటి గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు. కడప జిల్లాలోని రాజంపేట, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో వీరి సంఖ్య ఎక్కువ. స్వయంగా ప్రొద్దుటూరు వాసి కావడంతో ఏమో ఖలందర్ ఈ కథను ఆకట్టుకునేలా రాయగలిగారు. ఆ తర్వాతి కాలంలో మహమూద్, వేంపల్లె షరీఫ్ వంటి వారు కూడా ఈ అంశంపై ఒకట్రెండు కథలు రాసి ఉన్నారు.

అసలే కరువు ప్రాంతమైన రాయలసీమలో రైతులు ప్రత్యక్ష బాధితులైతే, ఇతర సమూహాల వాళ్లు పరోక్ష బాధితులుగా ఉంటారు. ఏళ్ల తరబడి ఉన్న పాలకుల నిర్లక్ష్యం, వనరులు వినియోగించుకోలేనితనం ఈ ప్రాంతానికి శాపంగా మారాయి. దీనికి తోడు నిరక్షరాస్యత, ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఏవీ ఉండకపోవడం వంటి సమస్యలతో ఇక్కడి ముస్లిముల జీవితం మరింత దుర్భరంగా మారింది. సచార్ కమిటీ చెప్పినట్టు దళితుల కన్నా వెనుకపడ్డ పేదరికం ఇక్కడ కొట్టొచ్చినట్టు కనబడుతుంది. పైగా చాలామంది ముస్లిం రచయితలు పేద కుటుంబాల నుంచే వచ్చినవారు కావడంతో ఇక్కడి కథల్లో ఎక్కువగా పేదరికం, దైన్యం, నిస్సహాయత కనిపిస్తుంది.

తోడబుట్టిన అన్నకు సంప్రదాయం ప్రకారం 'సాంగెం' తీసుకెళ్లలేని దైన్యం, సాంగెం తీసుకొచ్చిన చెల్లికి బట్టలు పెట్టలేని అన్న నిస్సహాయతను 'జైతూన్' (2004) కథలో కళ్లకు కట్టినట్టు వివరించి కదిలిస్తాడు రచయిత అక్కంపేట ఇబ్రహీం. షేక్ బేపారి రహమతుల్లా (శశిశ్రీ) రాసిన 'ముజక్కర్' (2009) కథ కూడా ఇలాంటి పేదరికాన్నే చూపిస్తుంది. ఒక పూట గడిస్తే మరో పూట గడవడం ప్రశ్నార్థకంగా ఉన్న పెళ్లిళ్ల పూజారి 'ఖాజీ సాబ్ ' కథ ఇది. అనంతపురం జిల్లాకు చెందిన నవ యువ కథకుడు మహమ్మద్ గౌస్ రాసిన 'రెండోజత' (2020) కథ కూడా – కనీసం బట్టలు కొనుక్కొని పండగ జరుపుకోలేని దైన్యాన్ని చిత్రిస్తుంది.

అయితే ఈ కథలన్నింటిలోనూ పేదరికం ఉందే తప్ప ఆ పేదరికానికి ఉన్న సామాజిక కారణాలు చర్చలో లేవు. అది కథా గమనానికి ఆటంకమని రచయితలు అనుకోని ఉండొచ్చు కానీ ఆ లోటును తీరుస్తూ కూడా కొన్ని కథలు వచ్చాయి. రచయిత ఎస్.నూరుల్లా గరీబ్ జిందగీ' (2004) అనే కథ రాశారు. ఈయన రాసింది ఒక్క కథే అయినప్పటికీ ఇది ముస్లిముల పేదరికపు మూలాల్లోని ఒక శకలం గురించి చెబుతుంది. కథలోని ఇద్దరు మిత్రుల్లో ఒకరైన జాకోబుకు రిజర్వేషన్ వల్ల ఉద్యోగం వస్తుంది. ఎక్కువ మార్కులు వచ్చినా కూడా అబ్దుల్లాకు ఉద్యోగం రాదు. ఆ విషయాన్ని స్వయంగా

జాకోబే చెబుతూ ఇకనైనా ముస్లిములు మేల్కొని సరైన నాయకత్వాన్ని తయారు చేసుకుని ఉద్యమించకపోతే పుట్టగతులు ఉండవని సూచిస్తాడు. ఓ రకంగా ఇది బహుజన తాత్విక ఐక్యతను సూచించే కథ కూడా.

ఇలాంటి అంశమే మహమూద్ రాసిన 'కాసింత నీడ' (2004) కథలో కనిపిస్తుంది. ఇంటి ఓనరు రహమతుల్లా తోటి ముస్లిం అయి ఉండి కూడా పేద ఖాసింని ఉన్న ఫలంగా ఇల్లు ఖాళీ చేసి వెళ్లమంటాడు. పేదసాదాని బతకనివ్వకుండా ఖాళీ చేయించి అక్కడ మిద్దెలు కట్టి మరిన్ని అద్దెలు వసూలు చేయాలని రహమతుల్లా ప్లాన్. డబ్బు ఏ కులం, ఏ మతం వాడి దగ్గరున్నా వాడి ఆలోచనలు ఎప్పుడూ ఆర్థిక సూత్రాల చుట్టే తిరుగుతాయని ఈ కథలో చెబుతాడు మహమూద్. చివరికి ఖాసీంని ఊరి చివర ఉన్న దళితులు అక్కున చేర్చుకుని కాసింత నీడ ఇవ్వడంతో కథ ముగుస్తుంది.

1992నాటి బాబ్రీ మసీదు ఘటన, 2002 నాటి గుజరాత్ ఊచకోత ఘటన తెలుగు ముస్లిం మైనార్టీ కథని తీవ్రంగా ప్రభావితం చేసింది. మొదటి ఘటన సమయంలో హైదరాబాద్ కేంద్రంగా కొంతమంది ముస్లిం కవులు, రచయితలు తీవ్రంగా స్పందించారు. కవితలు, కథల రూపంలో తమ అస్తిత్వ ప్రకటన చేశారు. అప్పటికే అస్తిత్వ వాదాల కాలం నడుస్తుండటంతో క్రమంగా ముస్లిం అస్తిత్వం కూడా ఒక వాదంగా బయల్దేరింది. అయినప్పటికీ రాయలసీమ ముస్లిం కథని అది పెద్దగా ప్రభావితం చేయలేకపోయింది. కానీ రెండో ఘటన తర్వాత రాయలసీమ ముస్లిం కథకులు కూడా సామాజిక అంశాలపై ఎక్కువగా తమ కథల్ని పదును పెట్టారు. అందుకు 2004లో వచ్చిన 'వతన్' ముస్లిం కథా సంకలనం కూడా కొంత ప్రభావితం చూపిందని చెప్పవచ్చు. ఎందుకంటే వతన్ కథాసంకలనం కోసం రాసిన కొంతమంది ముస్లిం రచయితలు ఆ తర్వాతి కాలంలో ఒక కథ కూడా రాయకుండా ఆగిపోయారు.

2003లో వచ్చిన 'పురుడు' గుజరాత్ అల్లర్ల మీద రాసిన కథ. కర్నూలుకు చెందిన ఇనయ్‌తుల్లా ఈ కథను రాశారు. అల్లర్లలో అహమ్మదాబాద్‌కు చెందిన కౌసర్ అనే గర్భిణిని పొట్టన పెట్టుకున్నాయి కొన్ని అల్లరి మూకలు. ఒకవేళ ఈ కౌసర్ రాయలసీమకు చెందిన బిడ్డే అయితే పరిస్థితి ఎలా ఉంటుందో అని ఊహించి, పరితపించి అక్కున చేర్చుకుని రాసిన కథ. ఇంతటి దు:ఖంలోనూ రచయిత చివర్లో సామరస్యాన్ని కోరుకుంటూ ముగించడం అతని సంయమనానికి నిదర్శనం. రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వమే ఇక్కడి రచయితలకు ఇంతటి సంయమనాన్ని ఇచ్చిందని భావించాలి. పులివీడు గఫార్ రాసిన 'ఖబుతరా' (2004) కథ కూడా ఇలాంటి సామరస్యాన్ని కోరుకున్నదే. అప్పటికప్పుడు పైకి కనిపించకపోయినా బాబ్రీ ఘటన రాయలసీమ లాంటి సామరస్య ప్రాంతంలో కూడా రెండు ప్రధాన సమూహాల మధ్య పెద్ద విభజన రేఖను గీసేందుకు ప్రయత్నించిందని ఈ కథ చదివితే అర్థమవుతుంది. అనంతపురం నుంచి జి. బాషా రాసిన 'బైపాస్ రైడర్స్' (2005) కథ ఒంటి నిండా సామరస్య భావాన్ని పులుముకుని కనిపిస్తుంది. బస్సులోని రెడ్డి, ముస్లిం మహిళను అనుమానంగా చూసి అవమానించినా చివరికి ఆ బస్సులోనే రెడ్డి కూతురికి పురుడు పోసి సామరస్యాన్ని, మానవత్వాన్ని చాటుకుంటుంది ఆ మహిళ. ఈ కథలన్నీ చాలావరకు రాయలసీమ మాండలికంలో ఉండటం వల్ల కూడా వీటికి అదనపు సొబగు అబ్బింది.

ముస్లిముమీద ఉన్న భాషాపరమైన వివక్షను మహమ్మద్ రఫీ రాసిన 'అచ్చులూ.. హల్లులు' (2018) కథ ఎదుర్కొంటే వారి తిండి మీద ఉన్న అనుమానాన్ని వేంపల్లి సికిందర్ రాసిన 'కష్టం ముద్ద' (2014) కథ ఎదుర్కొంటుంది. ఈ దేశంలో చట్టాలు అందరికీ ఒకేలా వర్తించడం లేదన్న సత్యాన్ని ఎస్.సికిందర్ బాషా రాసిన 'వివక్ష' (2004) అనే కథ చర్చకు పెడుతుంది.

మరోవైపు ముస్లిముల్లో ఉన్న కుల వివక్షను కడిగే కథలు కూడా రాయలసీమ నుంచి వచ్చాయి. కచ్చితమైన లెక్కలైతే లేవు కానీ రాయలసీమలో దూదేకుల జనాభా కూడా ఎక్కువే. వీళ్ల అస్తిత్వం ముస్లిముల అస్తిత్వమే. ముస్లిములని చెప్పుకోవడం వల్ల బయటి సమాజం నుంచి ఎదుర్కొనే వివక్షకు తోడు ఇటు ముస్లిం సమాజం నుంచి ఎదురయ్యే వివక్ష వీరిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఆ ఆవేదన నుంచి వచ్చిన కథే తిరుపతికి చెందిన షాజిదా రాసిన 'అజ్ఞానపు రైలు'. చాలా సాధారణంగా కనిపిస్తూనే అనేక విషయాలను చర్చకు పెడుతుంది ఈ కథ. రైలెక్కిన అమ్మలక్కలు తమకు తెలియకుండానే ముస్లిముల పట్ల, దూదేకుల పట్ల ఎంత నిర్దయతో ప్రవర్తిస్తారో చక్కగా కళ్లకు కడుతుంది. అంతేకాదు ముస్లిముల్లో దూదేకుల పట్ల ఉన్న చిన్నచూపు పోయి వాళ్లంతా ఏకమవ్వాలని కోరుకుంటుంది. ఆ అనివార్యతను కూడా అది సూచిస్తుంది.


రాయలసీమ ముస్లిం మైనార్టీ కథకుల్లో మహిళలు చాలా తక్కువ. తెలుగు చదువుకున్న వాళ్లు పెద్దగా లేకపోవడం, ఉన్నవాళ్లను సృజన రంగంవైపుకు ప్రేరేపించే దిశగా చర్యలేమీ తీసుకోకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. షహనాజ్ తర్వాత రాయలసీమలో ఎన్నో ఏళ్లకు కనబడుతున్న పేరు షాజిద.

ఇంత పెనుగులాటలోనూ నిగ్రహంగా నిలబడి సర్వమానవ సమానత్వాన్ని కోరుకుంటున్న కథలూ ఉన్నాయి. దాదాహయాత్ రాసిన ప్రసిద్ధ కథ 'మసీదు పావురం', కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన బాషా రాసిన 'మనిషి' కథలు ఈ కోవకు చెందుతాయి.

ముస్లిములమీద వివక్ష ఈనాటిది కాదు. 1857 సిపాయిల తిరుగుబాటు నుంచి అది ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉందని మనకు చరిత్ర చెబుతోంది. ఇస్లాం ఒక దుర్మార్గమైన మతమని, అది హింసని, మూర్ఖత్వాన్ని, తిరుగుబాటును తప్ప మరి దేన్నీ బోధించదనే జరిగే ప్రచారం ఒకవైపైతే ఆ మతాన్ని అవలంబించే ముస్లిములు మూర్ఖులని, సంఘవ్యతిరేకులని, దేశద్రోహులని, పరాయివాళ్లని, అంటరానివారని, నీతి నియమాలు లేని వాళ్లు అని జరిగే ప్రచారం మరోవైపు. ఈ ప్రచారాన్ని ఎదుర్కోవాల్సిన బాధ్యతను కూడా ఆధునిక రాయలసీమ ముస్లిం మైనార్టీ కథ తీసుకుంటోంది.

కరోనా మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో ఇటీవల ప్రత్యేకంగా ఒక మతసమూహం మీద ఎంతటి విష ప్రచారం జరిగిందో తెలిసిందే. దీన్ని తిప్పి కొట్టి అపోహల ద్వారా సామాన్యుడి మనసు కలుషితం కాకుండా కాపాడేందుకు ప్రయత్నిస్తుంది షేక్ షబ్బీర్ హుస్సేన్ రాసిన 'బూచి' (2020) కథ. అలాగే ఎన్నార్సీ, సిఏఏ విషయంలో నిజానిజాలేంటో చర్చించే ప్రయత్నం ఎస్.డివి. అజీజ్ రాసిన 'కాఫిర్' (2020) కథ చేస్తుంది.

రాయలసీమ ముస్లిం కథ పూర్తి సామాజిక బాధ్యతతో ముందుకు నడుస్తోంది. నిజానికి వర్తమాన ముస్లిం కథకుల ఎజెండాని పాలకులే నిర్దేశిస్తున్నారేమో అన్న అనుమానం కూడా ఈ కథలు చదివితే కలుగుతుంది. కానీ అది పూర్తిగా అబద్ధమైతే కాదు. ఒక రాయలసీమ ముస్లిం కథ ఎజెండానే కాదు; పూర్తిగా తెలుగు వర్తమాన ముస్లిం కథా ఎజెండానే పాలకులు నిర్దేశిస్తున్నారు. వారు వేస్తున్న మతరాజకీయ ముద్రలను చెరిపేసుకోవడానికే ముస్లిం మైనార్టీ కథా సాహిత్యానికి సమయం సరిపోవడం లేదు. ఒకవైపు తమను తాము చైతన్యం చేసుకుంటూ, మరోవైపు హక్కుల గురించి పోరాడుతూ, ఇంకోవైపు మత రాజకీయ ముద్రలను చిత్తు చేసుకుంటూ ఒక ఉద్యమంలా ముందుకెళ్లడం అంటే అది మామూలు విషయం కాదు. పైగా రాయలసీమ ముస్లిం మైనార్టీ కథ ఇన్ని కష్టాల్లోనూ, దు:ఖాల్లోనూ, దుర్ఘటనల్లోనూ ఒక ఆశావాద దృక్పథాన్నయితే వదులుకోలేదు. సామాజిక సంబంధాలను కాపాడే పరిధిలోంచే తన గొంతును వినిపిస్తోంది. ఈ గొంతు మరింత బలపడాలి. ■



## ఏ ఇద్దరి మధ్యా ...

- ఏటూరి నాగేంద్రరావు
74166 65323

స్వార్థం ఆకుల్లో
కాల్చిన మాంసం ముక్కల్ని
బయటకి తీశాడు వాడు
రాత్రి పగలూ పని మాని
ఏదో మోళీ కదుతుంటాడు
సీసాల నిండా దాహం
అంతటా వింత వాసన
ఈ దేశంలో మేధావి ముఖం
పొరలు పొరలుగా విభజించబడింది
బతకాలంటే శిబిరం కావాలి
కళ్ళ వెనకాల క్రూరత్వం ఉండాలి
నిన్ను నువ్వు నమ్మలేని
క్షణాలు కావాలి
ఏ ఇద్దరి మధ్యా ప్రవహించే జీవనదుల్లేవు
స్వార్థం అనంతంగా విస్తరించి
మన ఆత్మలను భయపెదుతోంది
మనిషి ఆలోచనలకు
తుపానులు భయపడుతున్నాయ్
ఏ ఒక్క హరిత వృక్షమూ పెరగడం లేదు
అంతా మడుగులా కసా బిసా
సకల ఉద్వేగాల గనుల్లో మనుషులు
మూర్ఖుల రూపాలుగా
స్పష్టపరుచుకుంటూ
ఒంటరిగా
ఒకానొక రాతి గుహల్లో! ■

కవిత



# తిరుగుబాటు

- మెట్టా నాగేశ్వరరావు

నిజం అబద్ధం చేయబడుతున్నప్పుడు
అబద్ధమే నిజంగా గెలుపు గుర్రమవుతున్నప్పుడు
న్యాయం అన్యాయం చేత హత్య
కావించబడుతున్నప్పుడు
తిరుగుబాటు చేయకపోవడం చేతకానితనమే!

నీ అడుగుల్లోని స్వేచ్ఛని
ఎవరో వచ్చి నిషేధిస్తుంటాడు, కిమ్మనవెందుకు?
ఎండలో రోజూ కోటి పనుల్లో నడుమొంచినా
శ్రమచేసి చేసి గొడుగుకర్రలా వొంగినా
నీవు దోపిడీ కాబడుతుంటావు
ఒక్కమాటనైనా విప్లవాగ్ని చేసి విసిరికొట్టవూ..!
నీవెపుడూ బోయీవే
పల్లకీ ఎప్పటికీ ఎక్కలేవు
దాని కారణాన్ని కనీసం ఆరా తీసి
బతుకులో వెలుగు కోసం
దుర్మార్గ దుర్నీతిపై రణానికి సైరన్ ఊదవెందుకు!?

రాతిరి నిద్రను కంటిమీదకు రానీకుండా
రంగులకలలైతే కంటావు
ఎవడో నీ నిద్రను నరికి కలను కూడా చంపుతాడు
ఎవరినీ ఏమనలేవు..!

రాజీ పడి పడీ
ఉన్నచోటనే గుంజలా పాతుకొని వుంటావంతే!

నీవు చూస్తుండగానే
నదీప్రవాహం గట్టుని కొద్దికొద్దిగా కోస్తుంటది
బంధింపబడ్డ కుందేలు
వాడి దంతాలతో వలను కొరుకుతుంటది
నీ ఎదురుగానే
పొయ్యి మీద ఎసరు సలసల మరుగుతుంటది!

సూర్యుడు కిరణ పాదాలతో
నల్లమబ్బుల గుంపుల్ని తన్ని పారేస్తుంటాడు
ముంగీసొకటి
పడగెత్తిన పాముపై తిరగబడుతుంటది

నీవు మాత్రం
మౌనవ్రతం చేస్తూనే ఉంటావూ
చేతులు పిడికిళ్లుగా మారవు
గొంతుకలో నిరసన ధ్వని మోగదు
నీవెప్పటికీ చేరని స్టేషన్లా
తిరుగుబాటు జన్మ కాలానికి దూరమౌతుంది!

గుండెవాద్యం ఊపిరి చప్పుడు చేసినంత సేపూ
తిరుగుబాటు చేయక
తిరోగమనం వైపు పలాయనం చెందినందుకు
నిరసనగానేమో
ఆఖర్న
నిన్ను మోసుకెళ్లే పాడెగెడలు కిర్రుకిర్రుమంటున్నాయి! ■

# గతి తప్పిన పంచేంద్రియాలు

- అడిగోపుల వెంకటరత్నమ్
98482 52946



**మ**నసుతో ఐక్యంగాని
స్వయం ప్రతిపత్తి పంచేంద్రియాలు
చూసిన చూపుల్ని కళ్ళు
భద్రంగా మూటగడతాయి
ఆర్థిక బలాన్నిబట్టి
భయకంపిత శక్తినిబట్టి
మూట విప్పిన చూపులు
పరావర్తనం చెందుతాయి
బోనెక్కిన చూపులు
దర్శించిన చూపుకు
రంగులు పులిమి ప్రదర్శిస్తాయి
బోను దిగిన చూపులు
అందించిన లక్ష్మిని భద్రంగా దాచుకుని
రంగులు తడుచుకుంటాయి
చూపు మనసు మాట వినదు!

అత్యాచారమో హత్యో
అపరాత్రి వేళ
ఆర్తనాదాలు పెగిలి ప్రతిధ్వనిస్తే
చూపులేగాని మాటల్లేని చంద్రుడి సాక్షిగా
చెవి శ్రోతై నమోదు చేస్తుంది
దర్యాప్తు ముందు నిల్చిన చెవి
రాత్రి నిశ్శబ్దమేగాని శబ్దంలేదని సాక్ష్యం
చెవి శబ్దం మాట వినదు!

న్యాయచరిత్ర
అతని నాలుకపై సరస్వతి అచ్చేసింది
ధనాపేక్ష పదవీకాంక్ష పెనవేసి
వక్రభాష్యం వికృత తాండవమై
న్యాయం నీట మునిగి
అన్యాయం అరవిందమై లేస్తుంది
జిహ్వ వాగ్దేవి మాట వినదు!

ప్రాణానికి ప్రాణవాయువు అందిస్తూ
నాసిక జీవవాహికై నిలిచింది
మధ్యమధ్య అత్తరు సువాసనల్నీ
మల్లెల సౌరభాన్ని అద్దుతూ
సంకోచ వ్యాకోచనాలై
దు:ఖానికి సంతోషానికి కోపానికి
నాసిక ప్రత్యక్ష అభినయం
నాసిక ఎవరి మాటా వినదు!

రిజర్వాయరు చుట్టూ ఆనకట్టలా
చర్మం శరీరానికి సంచిలా పోతపోసి
అవయవాల పనిని పరిశీలిస్తూ పర్యవేక్షిస్తూ
మధ్యన ఘర్మ జలాన్ని తోడి బైటకు పంపుతూ
శరీరాన్ని అందంగా బొమ్మను చేస్తుంది
చర్మం ఎవరి మాటా వినదు!

పంచేంద్రియాలు మనిషికి
అంటుకట్టిన మొక్కలు
ప్రవర్తనావళి నేర్పి
స్వయం ప్రతిపత్తి నియంత్రించాల్సి వుంది! ■

## పరిచయం




# భారతీయ భాషల్లో తొలి తరం నవలలు

### ఆచార్య కొలకలూరి ఇనాక్

**ఆ**చార్య ఎం.శ్రీధర్ రాసిన ఈ లఘు గ్రంథంలో అలఘు సమాచారం ఉంది. తెలుగులో తొలి నవల 'శ్రీరంగరాజ చరిత్రము' దక్షిణ భారతీయ భాషలన్నింటి కంటే ముందుగా వెలువడిందని, తమిళంలో 'ప్రతాప రుగలి చరిత్రము (1839) మలయాళంలో 'సరస్వతీ విజయం' (1892), కన్నడంలో 'ఇందిరాబాయి' (1899), తుళులో సతీకమలె (1936) వచ్చినట్లు తెలియటం ఆనందదాయకంగా ఉంది. అంతేకాదు; హిందీలో మొదటి నవల 'చంద్రకాంత' (1888) కంటే ముందుగా తెలుగులో మొదటి నవల వెలువడిందని తెలిసి తెలుగు వాళ్లు సంతోషిస్తారు. అదే సమయంలో భారతదేశంలో వచ్చిన మొదటి 15 భాగాల 15 నవలలు ఎప్పుడో ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. తెలుగు నవల ఆంగ్లానువాదం ఇంతవరకు భారతీయులకు లభించడం లేదన్నది దిగులుగా ఉంటుంది. బంకించంద్ర చటర్జీ 'బంగ్లా' నవల 'దుర్గేశ నందిని'ని తెలుగులోకి పదిమంది దాకా అనువదించారు. అనువదించిన అందరూ తెలుగు సాహిత్యంలో నిష్ణాతులు.

230 సంవత్సరాల పూర్వం 'ఫసానా-ఈ-రంగీన్' నవల హసన్‌షా రచన. ఇది మొదటి భారతీయ నవల, రచన ఆత్మకథాత్మకంగా ఉంది. కృపాబాయి సత్యనాదన్ నవల 'సగుణ'లోనూ, తోరూదత్ నవల 'లా జూర్నాల్ ద మాదమొజేల్ దార్'లోనూ ఆత్మకథాత్మక ఛాయలున్నట్లు అర్థమవుతుంది.

మొదటి పదహారు నవలల్లో రెండు స్త్రీలు రాసినవి ఉండటం స్త్రీవాద దృక్పథం కొంతలో కొంత కనిపించటం సంతోషం కలిగిస్తుంది. ఆంగ్లేయులు భారతదేశాన్ని పరిపాలిస్తున్నప్పటికీ, మహమ్మదీయ పాలన పాక్షికంగా గోచరమవుతున్నప్పటికీ, రాజపుత్ర వీరుల కార్యపరాక్రమాల విశేషం ఈ నవలలు కొన్నింట కనిపిస్తూ ఉంది. భారతీయ నవలా రచనలతోపాటు ఇతివృత్త వ్యాపనం కూడా ఈ గ్రంథం వల్ల సహృదయులు గుర్తిస్తారు. 'ఫసానా-ఈ-రంగీన్'లో ఆదర్శ కోమల ప్రేమ, తోరూదత్ నవలలో భారతీయ యువతి కోమల ప్రేమ భావనలు, తుళు నవలలో భర్తృస్మృతికి అంకితమైన విధవ జీవితం కనిపిస్తాయి.

ఈ తొలి నవలల్లో ఆదర్శ జీవితం, సంప్రదాయ సంసారంతోపాటు విధవా వివాహ ప్రోత్సాహం కనిపిస్తుంది. ఒడియా నవల 'పద్మమాలి'లో తక్షణ ఆకర్షణ స్త్రీపురుషుల్ని కలపటం కనిపిస్తుంది. హిందీ నవల 'చంద్రకాంత'లో ముక్కోణ ప్రేమ పరిణామం విశదమవుతుంది. తెలుగు నవల 'శ్రీ రంగరాజు చరిత్రము'లో క్షత్రియ, లంబాడీ వ్యక్తుల ప్రేమ ఫలించటం ద్యోతకమవుతుంది. ఇంత ఆదర్శ వివాహ వ్యవస్థను రచయిత నరహరి గోపాలకృష్ణమ సెట్టి (1872)లో భావిస్తే, ఎంత సంఘ సంస్కరణ ఈ నాటికి సాహిత్యంలో వచ్చి ఉండాలో సహృదయులు ఆలోచిస్తారు. కృపాబాయి సత్యానాదన్ నవల 'సుగుణ'లో (1895), పోతేరి కున్యాబు నవల 'సరస్వతీ విజయం' (1892)లో, బాబా పద్మాన్జీ మరాఠీ నవల 'యమునా పర్యటన్'లో, ఫ్రాన్సిస్కోలూయీ గోమేజ్ నవల (1866)లో క్రైస్తవ మతాంతరీకరణం, క్రైస్తవ మత ప్రభావం, ప్రమేయం కనిపిస్తున్నాయి. హైందవ సంప్రదాయం, హిందూమత

## సాహిత్య చర్చలో సంయమనం, సహేతుకత

**2019** నవంబరు సాహిత్య ప్రస్థానంలో ప్రచురించిన కొలకలూరి ఇనాక్ కథ 'వృద్ధి' ... 'కథ 2019'లో ప్రచురితమైన నేపథ్యంలో సోషల్ మీడియాలోనూ, పత్రికల్లోనూ కూడా సాగుతున్న చర్చ మా దృష్టికి వచ్చింది. చూసిన మేరకు వివరంగా పరిశీలించాము. ఈ సందర్భంగా వచ్చిన వ్యాఖ్యలలో రకరకాల ధోరణులున్నాయి. వాస్తవికంగానూ, మధ్యేమార్గంలోనూ విశ్లేషించిన వారున్నారు. వివాదగ్రస్త వ్యాఖ్యలు చేసినవారూ కొందరు లేకపోలేదు. ప్రస్థానం గాని, దాన్ని ప్రచురించే సాహితీ స్రవంతి గాని విశాల ప్రగతిశీల సాహితీ వేదికలుగా విమర్శనాత్మక చర్చను ఎప్పుడూ స్వాగతిస్తాయి. అయితే కారణమేదైనా ఒక కథపై చర్చ ఏడాది తర్వాత, అదీ ఒక ప్రత్యేక సందర్భంలో, ప్రస్థానం వెలుపల మొదలైంది. మా వరకు మేము ఆ కథను ప్రచురించేప్పుడే కాస్త ఆలోచించి సమాజంలో విభిన్న ధోరణులను, భావనలను, వాదనలను ప్రతిబింబించడమనే కోణంలోనే ప్రచురించాము. అప్పుడే ఏదైనా విమర్శ లేదా ప్రశంస వచ్చి వుంటే తప్పక ప్రచురించేవాళ్లం. మా స్పందనా ఇచ్చేవాళ్లం. అప్పుడే గాక ఇప్పుడు కూడా మాకు నేరుగా అలాటివేమీ రాలేదు. సోషల్ మీడియాలో చర్చను మొదలెట్టిన కొందరు... ఆ చర్చను ముగిస్తున్నట్టు ప్రకటించారు గనక సాగదీయవలసిన అవసరముందని భావించడం లేదు.


ప్రస్థానంలో వచ్చిన కథలు గతంలోనూ వివిధ సంపుటాల్లో ప్రచురితమైన సంగతి తెలిసిందే! మౌలికంగా ఒక సృజనాత్మక రచనలోని అంశాలకు సంబంధిత రచయితలే బాధ్యత వహిస్తారనేది అంగీకృత సూత్రం. ఏమైనా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం వంటి విలువలకు; భిన్న తరగతుల వాస్తవిక ఆకాంక్షలకు నికరంగా కట్టుబడిన ప్రస్థానం ... అందుకు భిన్నంగా వ్యవహరించే అవకాశమే వుండదని స్పష్టం చేస్తున్నాం. దాదాపు ఈ ఇరవయేళ్లలోనూ మేము పాటిస్తున్న ప్రమాణాలే విలువలకు, విశాలతకూ కూడా సంకేతాలుగా వున్నాయని విశ్వసిస్తున్నాం. అభివృద్ధి నిరోధక ఛాందస పీడక శక్తుల దాడులు పెరుగుతున్న పరిస్థితుల్లో వాటిని ఏకోన్ముఖంగా ఎదుర్కోవడమే కీలకమని మరోసారి మనవి చేస్తున్నాం.

**– సంపాదకుడు**

సంరక్షణ దృష్టితో స్త్రీ పాత్రలు చాలా నవలల్లో ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉన్నట్టు అర్థం అవుతుంది. రజనీకాంత బోర్దోలామ్ నవల 'మీరే జమోరి' (అస్సామీ 1885)లో పానై జొంకీల పసిప్రేమ పరమ అద్భుతంగా కనిపిస్తుంది.

ఇన్ని నవలల్ని తెలుగువాళ్లకు పరిచయం చేయటం ఆంగ్లం వచ్చిన ఆచార్య ఎం.శ్రీధర్‌కే సాధ్యమైంది. నాటి నవలల్లో ఇతి వృత్తాలనే కాక, నాటి మానవ మనస్తత్వం తెలుసుకోవడానికి ఈ పుస్తకం సహాయం చేస్తుంది. దళిత జీవితం కనిపించిన నవలల్లో 'సరస్వతీ విజయం' దళిత విజయంగా కనిపిస్తుంది. లంబాడీ యువతి విజయం గిరిజన విజయంగా అనిపిస్తుంది. స్త్రీ జీవితం చుట్టూ ఎన్నో ఉన్నత భావాలు ఈ నవలల్లో ఉన్నాయి. స్త్రీ జీవితం సంప్రదాయం నుంచి విడివడి, మెరుగుపడటం ఎదురైై స్త్రీవాదులకు సంతోషం కలిగిస్తుంది.

ఈ నవలల్ని సహృదయ పాఠకులే కాదు, రచయితలు, రచయిత్రులు పరిశీలించటం అవసరం. విమర్శకులు, పరిశోధకులు వీటిని ఆకళింపు చేసుకోవటం సాహిత్యానికి మేలు కలిగిస్తుంది. ఆచార్య ఎం.శ్రీధర్ ఈ నవలల్ని సవిమర్శకంగా పరిచయం చేయటం వల్ల తెలుగు సాహిత్య అవగాహనకు మేలు జరుగుతుంది. తెలుగు భాషకిది గొప్ప ఉపకారం. ఈ పుస్తకం ప్రచురించిన ఎమెస్కో పూనిక అభినందనీయం. తెలుగు సారస్వత మూర్తులు మన నవలలు, భారతీయ నవలలు ఎలా ఉన్నాయో అంచనా వేసుకోవటానికి, ఇది కొంత మార్గదర్శనం చేస్తుంది. ఈ కృషిని అందించిన ఆచార్య ఎం.శ్రీధర్‌ని తెలుగు రచయితలు, విమర్శకులు, పరిశోధకులు ఆత్మీయుడుగా భావిస్తారు. ■






# దుఃఖాన్ని పోత పోసిన దండకడియం

- బోల యాదయ్య
99122 06427

ఎన్ని గాయాలను మోసుకు తిరిగాడో, ఎన్నిసార్లు గుండె మీద కాలం మంటవెట్టి కాపుకుందో, అడుగడుగునా అక్షరాలు కాలం రాల్చిన బాధల అనుభవాలను పేర్చుకుంటూ వాడిపోని పదాల పూలపందిరి నల్లుకున్నాయి. ఎవరైనా జీవితాన్ని మాటల్లో జెప్తే కథ అవుతుంది. మనసు మబ్బు కరిగేలా ఆలపిస్తే పాటౌతుంది. అక్షరాలతో బంధిస్తే కవిత్వం అవుతుంది.

ఎక్కడో తూర్పు కొండల్లో ఉదయించే సూర్యుడు లోకానికి వెలుగైనట్లు తాను అనుభవించిన పేదరికం కష్టాలు కన్నీళ్లు ఎదుటోళ్ళ మనసులను అల్లుకోవడమే కవిత్వ పొద్దుపొడుపుకు తొలి అడుగైతది. మట్టిలో పుట్టలో తంగేడు పువ్వుల్లో ఆత్మీయ స్పర్శని పట్టుకుంటేనే అక్షరాలు పారాణియై మది చెంపలకు అద్ది పోతయి. అది కవిత్వమై, కాలానికి నిలబడే భరోసానిచ్చే వాక్యమై అందరి దుఃఖాన్ని తనవెంట తిప్పుకొని అక్షరాల్లో కరిగిస్తది. పల్లె చుట్టూ పెనవేసుకున్న పదబంధాలతో బంధుత్వం చేస్తే చరిత్ర రచ్చబండ మీద కూసోని కవిని భుజాలకెత్తుకుంటది. అట్లాంటి అచ్చమైన పల్లెకవి *తగుళ్ళ గోపాల్.*

ఈ గోపాల్ .. నడుస్తున్న ఈ కాలపు అక్షరం. తన కవిత్వమంటే జీవితాన్ని ఒంపుకొని తాగడమే, అనుభవాలను కాలం దండెం మీద ఆరేసుకోవడమే. అతడు తను పుట్టిన మట్టి వాసనను దోసిళ్ళలోకి తీసుకొని కడుపారా తాగాడు. మనందరికీ మనసారా పంచాడు. వస్తువు ఎంపికలోనూ, పదాల కూర్పులోనూ సమకాలీన బహుజన నేపథ్యాన్ని, పల్లెభాషను నింపి పరిమళిస్తున్న సజీవ కవిత్వం తగుళ్ళ గోపాల్‌ది.

తన చుట్టూ పెనవేసుకున్న అన్ని ఆత్మీయ బంధాలను అన్ని కవితల్లో నోరారా పిల్చుకున్నడు. తన తల్లి కండ్లతడిని సిరాలోకి ఇంకించుకొని అక్షరాలతో పలికించిండు. పశుపక్ష్యాదులకు ఉన్న దయ, జాలి, పాలిచ్చి పెంచిన కన్న కొడుకులకు తల్లి మీద సోయి లేదని 'అమ్మ దీపం' కవితలో సోయి దప్పినోళ్ళకు యాది జేసిండు.

*వత్తిని జేసి నూనెబోసి*
*బతుకును వెలిగించినందుకు కొడుకు*
*ఈ అమ్మ దీపాన్ని గాలికి పెట్టి పోయిండు. (పుట 39)*

మన నుంచి సాయం పొందినోళ్ళు ఎవరైనా సాయం చేయడానికి చూస్తరు, అది పక్షులైనా జంతువులైనా. కానీ మనిషి తల్లిపేగు తెంచుక పుట్టినోడె పండుటాకులను గాలిలో దీపంజేసి పోయిండని ఆవేదన ఆర్ద్రత కలిగిన కవితనందించాడు గోపాల్. బంధుత్వాలను డబ్బులతో సరితూచే మనుషులున్న ఈ కాలంలో ఎవరూ లేని అవ్వకు తాను తోడై అవ్వ బోసినవ్వులెంట పసిపోరడై దుంకులాడుతడు. బంధువులం కావడానికి రక్తసంబంధమే కాదు, ఒకే ఆకాశాన్ని, ఒకే మట్టిని కప్పుకుంటం కదా అది చాలంటడు. కవితలన్నీ చదువుతుంటే పలకరించినట్లే మాట్లాడి పచ్చబొట్టై హృదయం మీద దర్శనమిస్తాయి. తగుళ్ళ గోపాల్ కవిత్వమంత తన కలకొండ గ్రామం చుట్టూ అల్లుకున్న అక్షరాల గూడు. తన యెద మీద ఇరిగిన కష్టాల ముండ్లు ఒక్కొక్కటిగా పీకేస్తుంటే పారిన అక్షర ప్రవాహం.

*బండ మీద*
*బతుకును ఆరేసుకునే కొన్ని చేతులు*
*ఎసొంటి బట్టలనైనా*
*తెల్లటి కొంగల్ని చేసి ఎగిరేస్తాయి (పుట- 44)*

"చెరువు గట్టు మీద" కవితలో పల్లె చెరువును కండ్ల ముందర ఉంచిండు. సూర్యోదయం మొదలైన దినచర్యను పల్లె గుండె గూట్లో దీపం వెలిగించే వరకు తడుముకోకుండా చెరువు నీళ్లలోకి అందరిని దింపి ఊరి మైలనంత కడిగిండు. సాకలోల్ల జీవితాన్ని నాలుగు వాక్యాల్లో విప్పి చెప్పిండు.

గోపాల్ కవిత్వం చదువుతుంటే పల్లె మట్టి వాసనను పెయ్యంత పూసుకున్నట్లుంటది. నిమ్మలంగానే మొదలెడుతడు కాని గుండెలను అల్లుకుపోయే కవితా ప్రవాహమై పారుతడు.

*వాడకట్టు తల్లులంతా*
*గుండె బరువును దించుకోవడానికి*
*గుండ్రంగ ఒంగుడు బతుకమ్మలాడుతుంటే*
*వాళ్ల కాళ్లమధ్య సందమామ పసి పోరడై తిరుగుతుంటడు*
*దమ్ము తీసుకోకుండా*
*దుంకుడు బతుకమ్మలాడుతుంటే వెన్నెలమ్మ*
*వాళ్ల పాదాలకు మట్టి గంధం రాసిపోతది (పుట-53)*

అగో పాలమూరు పదాలను ఎత్తుకొని ఎట్ల దుంకులాడిస్తున్నాడో. వాడలోని తల్లులంతా ఒంగుడు బతుకమ్మలాడుతుంటే సందమామ వాళ్ళ కాళ్ళ సందులలోంచి పసిపోరడై తిరుగుతాడని, పల్లెల్లో తల్లులు బతకమ్మ ఆడుతుంటే వాళ్ళ పిల్లలు అంతా కాళ్ళ మధ్య ఆడుకునే వాస్తవ దృశ్యాన్ని, పండువెన్నెల నాడు ఆడే బతుకమ్మ ఆటకు నిజంగా సందమామ వాళ్ళ కాళ్ళమధ్య పసి పిల్లగాడై దుంకులాడుతన్నడు. ఆ తల్లుల అరికాళ్లకు వెన్నెలమ్మా సుట్టమై వొచ్చి మట్టిగంధం రాసిపోతది. గోపాల్ ఎట్లా పల్లెనాడి పట్టుకున్నాడో గాని అనుకున్న పదాలనన్నీ కవిత్వంలో ఈత గొట్టిస్తడు. మొగులెత్తు *దుంకి/ వేపరిల్లలమై/ దగ అల్సుకొని/ నాల్గు బుక్కలు/ చెయ్యి గడిగి పోరాదూ...* అంటూ జొన్నరొట్టె కమ్మదనంలోంచి కవితలో మనకు నిండుగా పూసిన తంగేడు పువ్వుల లాంటి పదాలతో పలకరిస్తడు. అరచేయిని కూడా తెల్లకాగితం చేసి అక్షరాలు మొలిపిస్తడు.

***అరచేతిని తెల్లకాగితం చేసి***
***అమ్మ పేరో, ఆకలి గీతమో రాసుకోవాలి***
***కనీసం తెలుగు అక్షరాలైనా రాసి***
***అమ్మ భాషను బతికించుకోవాలి (పుట-63)***

అరచేయి... పండుగ నాడు సందమామను చేతిలో పూయించే నీటి కొలను. అప్పుడప్పుడు తెల్లకాగితమై అమ్మ పేరో, ఆకలిగీతమో రాసుకుంటుంది. ఆఖరికి అమ్మ భాషను బతికించుకోవడానికైన అరచేయి ఒక వాడిపోని పత్రమే అంటున్నడు తగుళ్ళ గోపాల్. "గుంత గిన్నె" అంతరంగం చూస్తే ఇలా జెప్తడు : ***ఉరిమి కొట్టే వానలకు***

***మట్టి మిద్దె పొటుకులు పెడుతుంటే***
***రాలిపడే నీటిబొట్లకు దోసిలి పట్టి***
***అమ్మ నాయినలతో పాటు నిద్ర కాసేది***
***....................***
***ఈ గిన్నె మీద మాత్రం***
***సచ్చిపోయిన మా దేవక్క పేరు కనిపిస్తే***
***జ్ఞాపకాల గోడలన్నికూలి ఊపిరాడకుండయితది***

గిన్నెను గిన్నెలా జూస్తే కవిత్వమై పలకరించదు. గుంత గిన్నెను కూడా ఒక జ్ఞాపకంలా మదిలా దాసుకున్నడు. సచ్చిపోయిన తన దేవక్క పేరు దానిపై కన్పిస్తే ఆడిపాడిన జ్ఞాపకాలు యాదికొచ్చి ఊపిరాడకుండ జేస్తదని అపురూపంగా దాసుకున్న గిన్నె .. ఈ గుంత గిన్నె. "బువ్వచేతి కొంగు" కవితలో తన అమ్మను ఒక నిరలంకార పద్యం/ కుందెన పాట/ దేవగన్నేరు/ చెక్కుడు సంచి/ పచ్చనాకుల జమ్మి/ ఏడంత్రాల ఎల్లమ్మబోనం/ ఒక జానపద పాటని ఎన్ని ఉపమానాలతో అమ్మను ఎత్తుకొని దించిండో.

***చెవి కమ్మలు కుదువబెట్టి***
***నా నాల్కమీద అక్షరాన్ని గీసిన***
***మా అమ్మ ఒక సుక్కల ముగ్గు***
***మట్టిపూత పూసిన గోడల మీద***
***నిండుగా నవ్వే సున్నపు ధార (పుట-83)***

తన మదిని మట్టిపూతతో అల్కి సుక్కల ముగ్గేసి, అమ్మను అందులో దేవతను జేసిన తగుళ్ళ గోపాల్ అమ్మ పట్ల అవ్యాజమైన ప్రేమను కురిపించాడు. గోపాల్ మొదటి సంపుటి "తీరొక్క పువ్వు" నానీలు, రెండో సంపుటి వచన కవిత్వం "దండ కడియం". దానిని సమస్త సాహితీ ప్రేమికులకు తొడగడం జరిగింది. దండ కడియం నిండా 55 కవితలున్నాయి. వేటికవే భిన్నమైనవి. గోపాల్ కవిత్వం సరళంగా, సూటిగా, వినసొంపుగా ఉండి అందులో చిక్కదనం, సాంద్రత, హృదయానికి హత్తుకొని కలకాలం నిలిచిపోయే ఈ కాలపు కవిత్వం ఉంది. అమ్మ గురించి రాసినా, నాన్న గురించి చెప్పినా, అసిఫా గురించి ఆవేదన వ్యక్తం జేసినా, తాతను తలపాగలా చుట్టుకొని మనసుకు దండ కడియం తొడిగినా, గంజి గురించి చెప్పినా, చెరువుగట్టు గురించి చెప్పినా, బహుజన వృత్తుల గురించి రాసిన తన మూలాల నుంచి వాక్యనిర్మాణం జేస్తడు. పల్లె పొత్తిళ్ళలోంచి కవన పువ్వై పూస్తడు. మొగులెత్తు ఎగిరి దుంకె గోరేటి వెంకన్న తన కవిత్వంలో పాటల చెలికాడై తిరుగుతడు. 'దండ కడియం' నిండా జీవితాన్ని వడబోసిన తేనెలాంటి అక్షరాల ఊట ఉంది. పక్కన గూసోని పలకరించినట్లే ఉంటది గానీ ఎప్పుడు దిగింటడో అక్షరాల నిచ్చెననేసి ఎదుటోళ్ళ మనసులోకి, అమాంతం మనసులను వశీకరణం జేస్కుంటడు. కవిత్వం చదువుతుంటే తనదైన లోకం చుట్టు సాహితీ విహార యాత్రలు చేయిస్తడు. తగుళ్ళ గోపాల్ మరిన్ని సామాజిక రచనలు చేయాలి. ■



# పాదాలు

- మోకా రత్నరాజు
99890 14767

బీటలు తేరిన
దు:ఖ ధరిత్రిని ఓదార్చడానికి
నిలువెల్లా కరిగికరిగి నీరైపోతున్న మేఘాల్లా...
పనికోసమే పుట్టి పెరిగి
కాల ఋతువుల్ని కాదని
ఇంటి నావను నెట్టుకొచ్చే శ్రమ తెడ్ల పాదాలు!

కీటిల్లు నిలబెట్టడానికి
ఎఱ్ఱమట్టిని ముద్దలు ముద్దలుగా తొక్కిన పాదాలు!
పొయ్యిలోకి
పిడకల కోసం
గోతిలో పోగేసిన పేడను కసాబిసా తొక్కిన పాదాలు!
ఊడ్పు మునుమెనక
తొరాలేసిన పాదాలు!

నార తడపల్ని లాగేటప్పుడు
లేచి రాకుండా
తాటికమ్మను తొక్కిపెట్టి నిల్చిన పాదాలు!

ఇల్లు నేసుకోవడానికి
తాటాకుల్ని మడతొక్కి, బనిపెట్టి
చూరుకుట్టు బద్దపోటుకు
బెగిసిపోకుండా
మోరలెత్తిపెట్టే తాటాకు మడమల్ని అణతొక్కిన పాదాలు!

దుక్కు దున్నేటప్పుడు
అరకలెనకాల
ఉరుకూ పరుగులెట్టిన పాదాలు!

తెల్లారగట్ల ఉడకబెట్టే
వడ్ల కోసం
సగం రాత్రిదాకా
నట్టింట వరి పనల్ని నలిపిన పాదాలు!

సందలడేలోగా
ఎండి, రోట్లో పడాలని
వాకిట్లో ఆరబెట్టిన ధాన్యాన్ని
ఆరారగ తిరగ తిప్పిన పాదాలు!

చేపలు పట్టుకోవడానికి
బోదుల్లో నీళ్ల తోడి
బొమ్మిడాయిలు సహితం పైకి తేలేలా
ఊబి, ఒండ్రుల్ని కలతిప్పిన పాదాలు!

కోడికూతేళ
నిద్ర లేచింది మొదలు
సద్దుమణిగినలోకం
నిద్దరోయేదాకా
పనిలోపడి నలిగిన పాదాలు!

నిల్వలుండి చేసే
అద్దరి పనులకెళ్ళేటప్పుడు
నెత్తిన సంసార భార మూట బరువులతో
మైళ్ల, మైళ్ల దూరాల్ని
ఈడ్చి తన్నిన పాదాలు!

◆◆◆

వయసు మీదపడి
నిలబడటానికే తడబడుతూ
ఆలనా పాలనా కరువై
ఏకాకిగా మోకరిల్లి దు:ఖిస్తూ
అనాథలవుతున్న పాదాలు! ■

కథ



# ఆరుతడి

- గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి
9110595847

ఊరు జనంతో కిటకిటలాడుతోంది. ఎక్కడ చూసినా సందడి. జొన్నలు పిండి పట్టించే గిర్నీ దగ్గర గంపలు బారులు తీరి ఉంటున్నాయి. కిరాణా కొట్టు యజమానులు గిరాకీలతో సరుకులు అందివ్వలేనంత రద్దీగా ఉన్నాయి. కల్లు పెంట కళకళలాడుతూ వుంది. ఒక బండి 'కల్లు పెట్టెలు' ఖర్చయ్యేచోట, మూడు తిత్తులు ఎక్కువ తెప్పించినా సరిపోవడం లేదు. సారాయికి కూడా అంగడతను అందివ్వలేనంత డిమాండు వుంది.

ఆ ఊర్లో అది ఒక సంబరం. ఆరుతడి సీజన్‌లో ఊరు చుట్టూ వేరుశెనగ పంట పచ్చటి తివాచీ పరచినట్లు భూమిని కప్పి వుంటుంది. దాదాపు అన్ని కుటుంబాల వాళ్ళకు కాలువ కింద నీళ్ళు పారే పొలం వుంది. కూలి పని చేసే వారివి అతి కొద్ది కుటుంబాలు మాత్రం వున్నాయి. వర్షాకాలం మొదలు అన్ని పంటలకు పక్క గ్రామాల నుండి కూలి జనాలు రాకపోతే ఒక్క పంట కూడా చేతికి రాదు. ఎండాకాలం ఆరుతడిలో మాత్రం, ఊరు మొత్తం రైతులు వేరుశెనగ పంట వేస్తారు. వేరుశెనగ పంట పెరికి తెంచడానికి రాయలసీమ పల్లెల్నుండి గుంపులు గుంపులుగా వలస కూలీలు రావాల్సిందే.

రైతులు ముందుగానే కూలీల కోసం కర్నూలు జిల్లాలో వెల్దుర్తి, క్రిష్ణగిరి, అముకుతాడు లాంటి పల్లెలకు వెళ్లి వారికి ముందుగానే వాళ్లు రావడానికి కావాల్సిన ఛార్జీలు ఇచ్చి వస్తుంటారు. అలా కాలువ నీరు పారే గ్రామాలకు వలస పక్షుల్లా వచ్చిపోతుంటారు కర్నూలు జిల్లాలోని జనాలు. ఇలా కాలువ కింద నీరు పారే పల్లెలు జనంతో కళకళలాడుతుంటే, అక్కడ సీమలోని గ్రామాల్లో ముసలీ ముతకా తప్ప పిల్లికూన కూడా కనబడని పరిస్థితి వుంటుంది.

చంద్రారెడ్డి ఇంటి ముందు అరుగు మీద కూర్చుని ఆలోచిస్తున్నాడు. తన చేను పెరికి బుడ్డలు తెంచడానికి ఎవ్వరూ కుదరడం లేదు. చేను సమయానికి విత్తనం వేయలేదు. ఫెర్టిలైజర్ కావలసినంత వేయించలేదు. కలుపు ధాటికి పైరు ఎదగలేదు. కూలీలకు చేను పెరికి తెంచితే 'డబ్బా'కు 'ఇంత' అని, ఎవరు తెంచుకున్న బుడ్డల్ని వారికి డబ్బాలతో కొలిచి ఆ ప్రకారంగా పైకం ఇస్తూ ఉంటారు రైతులు. చేను బాగా పండితే కూలి బాగా గిట్టుబాటు అవుతుంది, లేకపోతే గిట్టుబాటు కాదు. ఇప్పుడు అదే సమస్యతో సతమతమవుతున్నాడు చంద్రారెడ్డి. తన చేన్లో బుడ్డలు తెంచడానికి ఏ గుంపూ ముందుకు రావడం లేదు.

ఊర్లో ఎవరు ఎదురు పడినా "చేను పెరికిస్తివా అన్నా" అంటున్నారు. వాళ్ళకు తెలుసు, పెరికించలేదని. అయినా ఏదో సానుభూతి చూపినట్లు మాట్లాడుతుంటారు. ఒకరిద్దరు మిత్రులు సాయం చేద్దామని తాము పిలుచుకొచ్చిన గుంపులను చంద్రారెడ్డి చేను పెరకమని పంపించారు. వచ్చిన వాళ్ళు చేను చూసి తమకు కూలి గిట్టుబాటు కాదని వెళ్ళిపోయారు.

"ఎవరయినా కుదిరినారా చేను పెరకడడానికి " అన్నాడు చంద్రారెడ్డి తండ్రి. తన ముందు వరండాలో మంచంలో వున్నాడాయన. దాదాపు మూడేళ్ల నుండి మంచంలోనే వున్నాడు. 'చేసిన పానం ఊరుకుండద'న్నట్లు, చంద్రారెడ్డి తనను ఎక్కడికీ పోవద్దు, ఇంట్లోనే వుండమని ఎన్నిసార్లు చెప్పినా కల్లం దగ్గరకు వెళ్ళి అక్కడ కింద పడ్డాడు. కాలు విరిగింది. అప్పటి నుండి మంచంలోనే ఉన్నాడు. ఇప్పుడు 80 సంవత్సరాలు దాటుంటాయి. కొడుకు నిస్సహాయతను చూడలేక పోతున్నాడు. "ఈ సంవత్సరం నర్సిగాని గుంపు

వచ్చిందంట.. వాళ్ళను పిలిపించి అడగరాదా" అన్నాడు. నిజమే.. నర్సప్ప గుంపు మనుషులు ప్రతి సంవత్సరం వీళ్ల చేన్లోనే దిగి వీళ్ళ పనులు అయిం తరువాతనే వేరే వాళ్ళ పనులకు వెళ్లేవారు. రెండు మూడేళ్ల నుండి వాళ్ళు సుగ్గికి రావడం లేదు. తండ్రి మాటలతో చంద్రారెడ్డికి ప్రాణం లేచి వచ్చినంత పనైంది.

చంద్రారెడ్డి తండ్రికీ, నర్సప్పకూ ఎన్నో సంవత్సరాల నుండి అనుబంధం. తనంటే కూడా ఎంతో గౌరవం నర్సప్పకూ. పిలిస్తే కాదనరనే ధైర్యం వచ్చింది. వెంటనే పిలిపించాడు. నర్సప్ప రాగానే పెద్దాయనకు దండం పెట్టి "బాగున్నావా రెడ్డి" అన్నాడు. మాటలయింతరువాత "చేను పెరకాల నర్సిగా" అన్నాడు, పెద్దాయన. "సరేలే రెడ్డి.. చేను చూసి వస్తము" అని చెప్పి, చంద్రారెడ్డి వైపు తిరిగి, "ఇంత ఆలస్యంగా విత్తనం ఎందుకు వేశావు. ముందువి మూడెకరాలైనా ఒకటే, ఎనుకవి ఏడు ఎకరాలైనా ఒకటే" అంటారు కదా! ఏ పనయినా ముందుండాల.." అన్నాడు. "అవును నర్సప్పా.. ఈసారి విత్తనం ఆలస్యమయింది.." అంటూ చేనుకు బయలుదేరారు. తన ఇబ్బందులు అతనికి ఏ విధంగా చెప్పుకోగలడు!

కాలువ కింద ప్రతి సంవత్సరం డిశెంబరు లోపలనే విత్తనాలు వేస్తారు రైతులు. ఆలస్యమైతే పంట రాదు. మార్చి ఆఖరుకల్లా కాల్వకు నీళ్లు బందు చేస్తారు. బ్యాంకులో చంద్రారెడ్డికి రూ. 2500ల అప్పు వుంది. రెండు మూడు సంవత్సరాల నుండి పెండింగులో వుంది. ఫీల్డాఫీసరు అవి కడితే రూ. 5000 శాంక్షన్ చేస్తానన్నాడు. సరేలెమ్మని డబ్బులు రాగానే ఇస్తానని చెప్పి, ఒకరి వద్ద అప్పు తీసుకుని వడ్డీతో రూ. 2,900లు కట్టేశాడు. ఫీల్డాఫీసరు బ్యాంకు చుట్టూ తిప్పుకుని "2,500 మాత్రమే పై ఆఫీసర్లు శాంక్షన్ చేయమన్నారు. సారీ రెడ్డి గారూ.." అన్నాడు. చేసేది లేక లోన్ డబ్బు తీసుకుని తను తెచ్చుకున్న చోట కట్టేశాడు. అదీ.. ఆ రైతు విత్తనం కొనడానికి తీసి పెట్టుకున్న డబ్బు. బ్యాంకులోను రాగానే ఇస్తాను అంటే ఇచ్చాడు. ఫీల్డాఫీసర్ రూ. 5000 లోను శాంక్షన్ గురించి చెప్పింది డబ్బు కట్టించుకోవటానికి తప్ప నిజంగా ఇవ్వటానికి కాదని తెలిసేసరికి ఆలస్యమయింది.

ఒక రైతు రికమెండేషన్‌తో కర్నూలులో దళారీ అంగడికి వెళ్లాడు. ఊర్లో సగం మంది రైతులు అప్పు కోసం ఆ అంగడికే వెళుతుంటారు. ఆ నారాయణ శెట్టి రెండు మూడు సార్లు తిప్పుకుని అడిగిన దాంట్లో సగం డబ్బే ఇచ్చాడు. ఎవరో తన మీద ఇతనికి డబ్బు ఇస్తే తిరిగి రాదని చెప్పినట్లున్నారు. తమ పబ్బం గడుపుకునడానికి ప్రతి ఊళ్లో ఒకరిద్దరు ఇలాంటి వాళ్ళుంటారు. నారాయణ శెట్టి ఇచ్చిన డబ్బుకు రెండు రూపాయల వడ్డీ, తన అంగట్లో రైతు అమ్మిన సరుకుకు నూటికి రూ. 2ల కమీషన్. అలాగే సంపాదించాడు రెండు మిద్దెలూ, నాలుగు మేడలు.

అంగట్లో ఆ డబ్బు తీసుకుని, అందులోనే సంక్రాంతి పండగ సరుకులు కొని, నాయనకు మందులు తీసుకుని మిగతా పైకంతో చాలీచాలని ఎరువులు కొని విత్తనం వేసేసరికి సంక్రాంతి పండగ వచ్చింది. చేనుకు ఆఖరి తడి అంటలేదు. చేను ఆరిపోతే పెరికినప్పుడు బుడ్డలు భూమిలోనే ఉండి ఉత్త చెట్టు మాత్రం చేతికొస్తుంది. 'నష్టానికి కష్టం మెందు' అన్నట్లు ఈ విషయాలన్నీ నర్సప్పకు ఎలా చెబుతాడు? వాళ్ళ కాలే కడుపులు, కష్టాలు వారికున్నాయి గదా.

నర్సప్ప పిలిచేసరికి ఈలోకంలోకొచ్చాడు చంద్రారెడ్డి. గుండ్రటి ముఖంలో నీరసించి లోపలికి పోయిన కళ్ళు, బట్టతలపై అక్కడక్కడ రాగి రంగు వెంట్రుకలూ, అదే రంగులో పెరిగిన గడ్డమూ, అణిగిన దవడలూ, తడారిన పెదవులూ. నర్సప్ప తనను తను పట్టించుకోడు. మనిషిలో నిజాయితీతో కూడిన హుందాతనం కనిపిస్తుంటుంది. అతని గుంపులో అందరూ అతనికి బంధువులే. తమ్ములూ, వారి భార్యలూ, బావమరదులూ ... ఎవ్వరూ అతని మాట జవదాటరు. చాలా సంవత్సరాల నుండి చూస్తున్నాడు చంద్రారెడ్డి. తలమీద కొంగుతో తలఎత్తి మాట్లాడినట్లు ఎరుగదు అతని భార్య. వాళ్ళకు పిల్లలు లేరు. గుంపంతా తమ పిల్లలే అన్నట్లుంటారు భార్యాభర్తలు. చేను చూసి నర్సప్ప పెదవి విడిచాడు. "ఈ చేను పెరికితే ఎవ్వరికీ కూలి గిట్టుబాటు కాదు రెడ్డీ" అన్నాడు. ఈ గుంపును వదులుకుంటే ఇక చేను పెరికించడం అయ్యే పని కాదు. "చెప్పు నర్సప్పా.. ఎంత అడుగుతావో అడుగు" అని అతన్ని ఒప్పించేసరికి తలప్రాణం తోకకొచ్చింది.

◆ ◆ ◆

"మూడు రోజులయింది చేన్లో బుడ్డలు తెంచబట్టి. రోజు సాయంత్రానికల్లా అయిపోతుంది రెడ్డీ" అన్నాడు నర్సప్ప. "ఇంటి దగ్గర నుండి డబ్బా తెప్పిస్తే సాయంత్రం కొలిచి

ఇంటికి తోలుకోవచ్చు బుడ్డలను" అన్నాడు. మూడు రోజుల నుండీ చంద్రారెడ్డి, నర్సప్ప చేన్లోనే పడుకుంటున్నారు బుడ్డల కుప్పల దగ్గర. కూలీలు ఎవరు తెంచిన బుడ్డలను వారు కుప్పలుగా పోసుకుంటారు. ఆఖరు రోజు కొలతలు వేయించి దాని ప్రకారం డబ్బు తీసుకుంటారు. చంద్రారెడ్డి రోజూ మధ్యాహ్నం ఇంటికి పోయి సాయంత్రం మళ్లీ వస్తుంటాడు. రాత్రి ఇంటి దగ్గర నుండి చంద్రారెడ్డికి, నర్సప్పకు సద్ది పంపిస్తారు. ఈ రాత్రికి ఇల్లు చేరుకోవచ్చనుకున్నారు ఇద్దరూ. కూలీలందరూ చేను అయిపోవాలని పనిలో వేగం పెంచారు. ఏప్రిల్ నెల కావడంతో ఎండ తళతళలాడిపోతోంది. ఆకాశం నిప్పులు గుమ్మరిస్తున్నట్లుంది. పైన వేడీ, కింద వేడీ, మధ్యలో బడుగు బతుకులు. వాళ్ళకు ఇవేమీ పట్టవు. వాళ్ళు బతకాలా, పిల్లల్ను బతికించుకోవాల... అంతే! తలలపై బుడ్డల ఆకు వేసుకున్నారు. పిల్లలు వున్నవారు మూడు కట్టెల్ని పాతి, పైన బట్టవేసి ఆ నీడన కూర్చోబెట్టారు. ప్రకృతి నిశ్శబ్ధంగా ఉంది, సూర్యుడి చిటమటలు తప్ప.

ఉరికి పనిచేసినా చేను అయ్యేసరికి చీకటి పడింది. బుడ్డలు కొలచడానికి వెలుతురు లేకపోయేసరికి ఇక ఉదయమే కొలిచి ఇంటికి తోలుకుందామనుకున్నారు. కూలీలందరూ ఉదయం నుండి పని చేస్తూ, అక్కడక్కడ ఏరుకున్న కట్టెపుల్లల్ని నెత్తిన పెట్టుకుని, పిల్లల్ని చంకనేసుకొని, ఊర్లోకి వెళ్లారు. ఎవరు తెంచి పోసుకున్న కుప్పల్ని వారు మంచిగా సర్ది గంపల్ని కుప్పల మీద వుంచారు.

అందమైన ప్రకృతి చిత్రానికి బూడిదరంగు అద్దుతున్నట్లు నలువైపుల నుంచి చీకట్లు అలుముకుంటున్నాయి. చీకట్లు చిమ్మ చీకట్లు కాకముందే, బుడ్డల కుప్పల దగ్గర మట్టి చదును చేసుకుని పడుకునడానికి జాడీ వేసుకుని కూర్చున్నాడు చంద్రారెడ్డి. ఇంకో కుప్ప దగ్గర గోనెపట్ట పరచుకుని పైన దుప్పటి వేసుకొని కూర్చున్నాడు నర్సప్ప. ఇంకొంచెం సేపట్లో తనకూ, నర్సప్ప కూడా చద్ది వస్తుంది ఇంటి దగ్గర నుండి. నర్సప్పకు తమ ఊళ్ళో అద్దెదేస్తే గిద్దెడు పండే రెండెకరాల పొలముంది. 'అంతా తువ్వ. తువ్వ సేను పంట ఒక నాటి వంట' అన్నట్లు ఎన్నడూ ఆ పొలంలో నాలుగు వేళ్ళు నోట్లోకి పోయిన పాపాన పోలేదు. ప్రతి సంవత్సరం జొన్న కోతలకు వచ్చి కూలికింద జొన్నలు తీసుకుపోవడం, మళ్లీ ఈ సీజన్లో వచ్చి 'నాలుగు రాళ్ళు' చేతబట్టుకొని పోయి బతకడం. నర్సప్పకు తెలిసిందల్లా ఒక్కటే, వాళ్ళ వూళ్ళో రెడ్లకు, గౌండ్లకు జరిగే ఎలక్షన్ల గొడవలూ, కోర్టు కేసులు. కొంచెం కదపాలి గానీ కథలు కథలుగా చెబుతాడు. మునుపు ఎప్పుడైనా చంద్రారెడ్డి దగ్గర నలభయ్యే, యాభయ్యో తీసుకుని వెళ్ళి మళ్ళీ వచ్చినప్పుడు ఇచ్చేవాడు. ఈసారి కూడా 'అద్దపంచెలు చిరిగిపోయినాయి. తీసుకునాలని యాభై రూపాయలు ఇమ్మ'ని అడిగాడు. చంద్రారెడ్డి తనకు ఇబ్బంది వున్నా 'ఇస్తాలే నర్సప్పా' అన్నాడు.

పరిసరాలన్నీ చీకటి వర్షధారలతో నిశ్శబ్ద అందాన్ని సంతరించుకున్నాయి. ఆకాశంలో నక్షత్రాలు చిరునవ్వులు చిందిస్తూ తమనే చూస్తున్నట్లు మిలమిలా మెరిసిపోతున్నాయి. మధ్యాహ్నపు ఎండవేడి తగ్గి వాతావరణం చల్లబడి ఆహ్లాదంగా తయారయ్యింది. రైతు, కూలీ, భూమీ, ఆకాశం, చుక్కలు, పంట, చీకటి ... సన్నివేశం సంభ్రమంగా ఉంది. పడమటి వైపు కెమెరా ఫ్లాష్ వెలిగినట్లు సన్నటి తీగమెరుపు కనిపించింది.

"ఏం నర్సప్పా మెరుస్తుంది" అన్నాడు చంద్రారెడ్డి, వర్షం వస్తుందేమో అన్న అనుమానంతో. వర్షం వస్తే బుడ్డలు తడిసిపోయి ధర తగ్గిపోతుంది. మరీ ఎక్కువైతే బుడ్డలకు బూజు వచ్చి పనికి రాకుండా పోతాయేమో అని భయం. "మెరుపు దూరంగా ఉందిలే రెడ్డీ, వాన రాదులే" అన్నాడు నర్సప్ప. "అయినా పడమటికి మెరిసిందంటే అనుమానించాల్సిందే" అన్నాడు మళ్లీ.

మెరుపులు రాను రాను ఎక్కువవుతున్నాయి. దట్టమైన అడవిలో ఎక్కడో దూరంగా సింహం గర్జించినట్లు ఉరుముల శబ్ధం. సమయం గడిచే కొద్దీ ఆకాశమంతా నల్లటి దూది కొండల్లాంటి మేఘాలు కప్పేశాయి. సారకొకసారి బుడ్డలపై బోర్లించిన గంపలపై టప్ టప్ మంటూ చినుకులు శబ్ధం చేయడం మొదలు పెట్టాయి. గాలి స్తంభించినట్లుంది. ఎదుటి మనిషి కనిపించనంతటి చీకటి. కొద్ది సేపట్లోనే ఉరుముల శబ్దాలు పెతేల్, పెతేల్మని పేలిపోతున్నాయి, చెవులు చిల్లులు పడేలా. కాసేపటికి వర్షం జోరందుకుంది. మెరుపు మెరిసినప్పుడు మాత్రం నర్సప్ప కనబడుతున్నాడు, తలపై రెండు చేతులతో పట్టుకున్న గంపలో నుండి మసకగా.. వర్షం రాళ్ళతో కొట్టినట్లు పడుతూ వుంది. బుడ్డల కుప్పలు కొంచెం తడిస్తే ఉదయం గెలికి ఆరబెట్టవచ్చు. కుప్పల అడుక్కు నీరు దిగితే బూజు రావడానికి అవకాశం ఉంది. కష్టపడి పండించిన పంట ఏ సమయంలోనైనా పనికి రాకుండా పోవచ్చు. విత్తనం మంచిది కాకపోతే మొక్క బలంగా ఉండదు.

ఎరువులు చాలినంత వేయకపోతే పైరు సరిగా రాదు. కలుపులు తీయకుంటే గడ్డిలో కలిసిపోతుంది. కల్తీ పురుగు మందులైతే తెగులు కంట్రోల్ కాక మాడిపోతుంది. నీళ్ళు ఎక్కువైతే నీరుసిచ్చుపడిపోతుంది. నీళ్ళు తక్కువైతే గిటకబారిపోతుంది. అన్ని సవాళ్ళను ఎదుర్కొని పండించిన పంటను దళారీ చేతుల్లో పెట్టి దైవం వైపు చూడాలి రైతు.

వర్షం ఆగడం లేదు. చంద్రారెడ్డికి ఇంటి ముందు మంచంలో ఉన్న తండ్రి జ్ఞాపకం వస్తున్నాడు. ఎవరైనా ఆయనను ఇంట్లోకి ఎత్తుకెళ్లి పడుకోబెట్టారో లేదో! ఇంట్లో అమ్మ, భార్య తప్ప ఎవరూ లేరు. వాళ్ళు ఆయనను ఇంట్లోకి ఎత్తుకెళ్లలేరు. కింద పరువులు తడిసిపోయి నీళ్ళు పారుతున్నాయి. కింద గంపలు వేసుకుని గంపలపై కూర్చున్నారు. తలలపై రెండు చేతులతో గంపలు పట్టుకున్నారు. మెరుపు వెలుతురుతో భూమంతా వర్షపునీరు సముద్రాన్ని తలపిస్తుంది. చంద్రారెడ్డికి మెల్లగా చలి మొదలయింది. అంతకంతకూ ఎక్కువపోతుంది. పండ్లు ఎంత బిగబట్టినా టకటకలాడడం ఆగడం లేదు. కండరాలు వేటికవి ఊగిపోతున్నాయి.

తలంతా చలితో బిరుసెక్కిపోయి ఎంత నిలబెట్టినా స్థిరంగా నిలవడం లేదు. "నర్సప్పా... చలి ఎక్కువై వణుకు ఆగడం లేదు" అన్నాడు తట్టుకోలేక. మాట్లాడడానికి కూడా రావడం లేదు. "ఏం కాదులే రెడ్డి .. కొంచెం ఓపిక పట్టు" అంటున్నాడు నర్సప్ప. ఇటువంటి సన్నివేశాలు ఎన్ని చూశాడో! చంద్రారెడ్డికి కడుపంతా ఎగిరెగిరి పడుతోంది. నర్సప్ప ముఖంలో అదే నిబ్బరం. "సద్ది వస్తుంది కదా. కొంచెం కడుపులోకి పోతే అదే సర్దుకుంటుంది" అన్నాడు. చినుకులు మెల్లగా తగ్గుముఖం పట్టాయి.

దూరం నుండి "నర్సప్పన్నా.. నర్సప్పన్నా.." అనే కేక వినిపించగానే, నర్సప్ప వెంటనే "రా! రా! ఈడనే వుండం. అట్ల కాలువ పోంటిరా" అంటూ, "రెడ్డి సద్ది వొస్తుందిలే, కొంచెం తింటే చలి తగ్గిపోతుందిలే" అని చంద్రారెడ్డికి ధైర్యం చెప్పాడు. సద్ది తెచ్చినతను నర్సప్ప తమ్ముడు సవారి. ఆ వర్షంలో సద్ది ఇవ్వడానికి ఎవ్వరూ రాకపోతే, కాళ్ళు రేగడి బురదలో గిరిగెల వరకు దిగబడుతున్నా రెండు కిలోమీటర్ల దూరంలోని చేనుకు సద్ది తీసుకుని వచ్చాడు. రాగానే వాళ్ళ అన్నపై కోపం ప్రదర్శించాడు. "చినుకులు మొదలుకాగానే ఊర్లోకి రాకూడదా! నీవు తడిసేది కాక, రెడ్డిని కూడా ఇబ్బంది పెడతావా" అన్నాడు. వేడి వేడి అన్నం, పప్పు, మామిడికాయ చెట్నీ ముద్ద దిగేసరికి మెల్లగా ఉపశమనం మొదలయింది చంద్రారెడ్డికి. ఇంక ఆ రాత్రి అక్కడ ఉండాల్సిన పని లేదు. వర్షం పడింది కనుక దొంగల భయం లేదు. ముగ్గురు ఊల్లోకెళ్లారు. బండ్లపై ఉదయం బుడ్డలను అరగెలికి సాయంత్రం కొలతలు కాగానే ఊళ్ళోకి తోలుకున్నాడు చంద్రారెడ్డి.

◆ ◆ ◆

రెండు సంవత్సరాలు గడిచాయి. వ్యవసాయం చేయలేక ఆ ఇబ్బందుల్ని తట్టుకోలేక పొలం గుత్తకు ఇచ్చాడు చంద్రారెడ్డి. ఒక ఉదయం ఊరుముందర కట్టపై కూర్చుని ఉన్నాడు. దూరంగా నర్సప్ప గుంపు వస్తూ కనిపించింది. తను సేద్యం తీసేసినప్పటి నుండి వాళ్లు కనబడలేదు. ఇప్పుడు ఎదురుగా కనబడుతుంటే ఏదో ఆత్మీయత గుండెల్లో కదులుతోంది. ఎప్పటిలాగే నర్సప్ప భార్య తలపై కొంగుతో తలవంచుకుని వస్తూ వుంది. గుంపులో నర్సప్ప కనిపించలేదు. గుంపులో అందరూ దగ్గరకొచ్చి "బాగుందరా! రెడ్డి" అన్నారు. ఆప్యాయత వాళ్ళ ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తూ వుంది. నర్సప్ప భార్య మెల్లగా దగ్గరకొచ్చి, "ఆయన కాలమాయ రెడ్డి" అంది. చంద్రారెడ్డికి ఏమీ అర్థం కాలేదు. "ఎవరమ్మా" అన్నాడు. "అదే! మా ఆయన రెడ్డి" అంది. ఒక్కసారిగా చంద్రారెడ్డికి వినరాని మాట విన్నట్లనిపించింది. మళ్లీ తనే "దొమ్మల్లో నీరొచ్చి సచ్చిపాయె రెడ్డీ" అంది. "పానం బోయే ముందర 'రెడ్డితో యాభై రూపాయలు తెచ్చుకునింటి. మీరు సుగ్గికి పోతే ఆ యాభై రూపాయలు మరిచిపోకుండా ఇయ్యే' అన్నాడు రెడ్డి" అని బొడ్లో నుండి యాభై రూపాయలు తీసి చంద్రారెడ్డి ముందుకు సాచింది. 'వద్దమ్మా వద్దని' ఎంత వారించినా చేతికందించింది. రుణశేషం ఉండకూడదని ఏ బుర్రకథలో, తోలుబొమ్మలాటలో విన్నాడో! అతనురా మనిషంటే అనిపించింది చంద్రారెడ్డికి. నీతి నియమాలూ, అనురాగ ఆప్యాయతలు దూరమవుతున్న ఈ రోజుల్లో, ఆర్థిక సంబంధాలే పరమార్థమనుకుంటున్న ఈ రోజుల్లో.. ఆ మట్టి మనుషుల హృదయాంతరాళాల్లో ఆవరించి వున్న నిజాయితీకి చలించి, చెమర్చిన కళ్ళ అశ్రుబిందువులతో తడిసిన యాభై రూపాయల నోటును జేబులో పెట్టుకున్నాడు చంద్రారెడ్డి. ■

ముఖాముఖి



# నిరంతర అధ్యయనంతోనే సాహిత్య వికాసం

## పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు

**క**ష్టాలూ కన్నీళ్ళు.. అవమానాలూ ... ఎన్నో చవిచూసిన సాహితీ సంపన్నుడు ఆయన. అవధానమంటే ఒక వర్గం వారే చేయాలనే వాదన నుంచి ... భాషా సాహిత్యాలపై పట్టుంటే ఎవరైనా రాణించవచ్చని నిరూపించిన కార్య సాధకుడాయన. అక్షరాన్ని ప్రేమిస్తే అందలమే తనకు మోకరిల్లుతుందని బలంగా నమ్మిన సాహితీవేత్త. దేశవ్యాప్తంగా 171 అష్టావధానాలు నిర్వహించి అవధాన విద్యలో సామాజిక అంశాలను బలంగా ప్రస్తావించిన ఆ కార్యశీలి డాక్టర్ ఆశావాది ప్రకాశరావు. పదమూడవ ఏటనే కలం పట్టిన ఆశావాది ఇప్పటికి దాదాపు అరవై పుస్తకాలు రాశారు. ఆయన రచనలు పాఠ్య పుస్తకాల్లో సిలబస్‌గా కొనసాగుతున్నాయి. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో సలహామండలి అధ్యక్షులుగానూ ఆయన ఉన్నారు. ఈ ఏడాది భారత ప్రభుత్వం ఆశావాదికి పద్మశ్రీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా ప్రస్థానం ప్రతినిధి ఆయనతో జరిపిన ముఖాముఖి ఇది :

**అష్టావధానిగా పద్మశ్రీ పొంది చరిత్ర సృష్టించారని సాహిత్యలోకమంతా అంటుంది..**

నాకు పద్మశ్రీ రావడం అనడం కంటే అవధాన విద్యకు రావడం శుభపరిణామంగా భావించాలి. ఇప్పటివరకు అవధానానికి ఇవ్వలేదు. మొట్టమొదట ఇచ్చారు. ఏ భాషలోనూ లేని, తెలుగులో మాత్రమే ఉన్న విశిష్టమైన సాహిత్య ప్రక్రియ అవధానం. భాష మీద ప్రేమకు పరిమితుల్లేవు. భాష మన ఊపిరి. దాన్ని ఎంత ప్రేమించినా ఇంత అని చెప్పడం సాధ్యం కాదు. మన జీవితంలో, జీవనంలో భాగమైన భాషను బతికించడం అంటే మనల్ని, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమే!

**అవధాన విద్యకు ప్రాధాన్యం పెరుగుతుందని భావిస్తున్నారా?**

ప్రాధాన్యత పెరిగేందుకు మనమేం చేయాలన్నది ప్రధానం. ప్రభుత్వాల కృషి అనివార్యం. అవధాన విద్యను ఒక కళగా.. ఒక భాషా ప్రక్రియగా.. మనలో లీనం చేసుకున్నప్పుడు కచ్చితంగా ప్రాధాన్యత పెరుగుతుంది. ఈ ప్రపంచీకరణ యుగంలోనూ అవధానాలు కొనసాగుతున్నాయి. కొత్తతరం వస్తున్నది. కొన్ని సాహితీ సంస్థలు అవధానానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నాయి.

**అరవై పుస్తకాల రచయితగా కొత్తగా రాస్తున్న వారికి మీరిచ్చే సందేశం..?**

యువత సాహిత్యంలో ఉండటం అభినందనీయం. యువకవులు ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసి రాస్తే వాళ్ళ రచనలకు పునాదులు వేసుకున్నవాళ్ళౌతారు. పునాదులు లేకుండా నిర్మించుకున్నది ఎక్కువకాలం నిలవదు. చదివింది కొంత, రాసింది పుంఖానుపుంఖాలు అయితే.. ప్రయోజనమేమి? ముందు భాష మీద అధికారం సంపాదించాలి. భాష మీద అధికారమే నన్నీ స్థాయికి తీసుకొచ్చింది. అందుకే రాసే రాతల్లో బలమైన వాక్యాలుండాలి. సంక్షిప్తత, సమగ్రత

## సాహిత్య ప్రస్థానం జనవరి 2021 పురస్కారాలు

**నాగలి యుద్ధం**
కవితకు రూ.500
కవయిత్రి : శిఖా ఆకాశ్

**ఆశ**
కథకు రూ.500
రచయిత్రి : డాక్టర్ విజయ భక్ష్

■■■

*కవితకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*
*కథకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

కూడా ముఖ్యమే.. అదే ఎప్పుడొస్తుందంటే బాగా చదివినపుడే సాధ్యమౌతుంది.

**సాహిత్యం ఎలా ఉండాలంటారు..?**

సాహిత్యం ఎలా ఉండాలన్నదానిపై నామటుకు నాకు స్పష్టమైన అభిప్రాయం ఉంది. నేను రాసే ఏ కావ్యమైనా ఔచిత్యంగా ఉంటుంది. ఉండాల్సిందే.. ఔచిత్యం కావ్యానికి జీవగర్ర అంటాడు క్షేమేంద్రుడనే కవి. ఒకసారి నా విద్యార్థి సుగాలి భాషలో స్వాగతం రాశాడు. తెలుగు అక్షరరూపమే అయినా ఆ భాషపై ఆ కుర్రాడికున్న అవిభాజ్యమైన ప్రేమ అటువంటిది. ఇప్పటికీ దాన్ని నేను పదిలంగా దాచుకున్నాను.

**అష్టావధానం కొందరికే పరిమితమైందనే విమర్శ కూడా ఉంది.**

అలా ఎందుకనుకోవాలి? సివి సుబ్బన్న.. ఆముదాల మురళి.. ఇప్పుడిప్పుడు ఇంకొంతమంది.. వారంతా ఎవరు? అలా ఎందుకనుకోవాలి. ఇదొక విద్య. ఎవరైనా అభ్యసించవచ్చు. అయితే నిరంతర సాధన, ధారణ ముఖ్యం. నిరంతర అధ్యయనం కూడా చాలా ముఖ్యం. చదవడం వల్లే ప్రతిభావంతులవుతారు. కవిత్వం ప్రతిభ వల్లే వస్తుంది. ఏ ప్రక్రియలోనైనా సరే మధ్యలో ఆగిపోకూడదు. ఆగిపోతే వికాసముండదు. అభ్యాసం.. చెప్పే ప్రయత్నం.. ఆ తర్వాత రాసే ప్రయత్నం చేయాలి.


**రాయడంలో నైపుణ్యం ఎలా వస్తుందంటారు?**

నేను వంద పుటలున్న విషయాన్ని పది పుటల్లో రాయగలను. ఎలా సాధ్యమౌతుందంటారు? అది నిరంతర అధ్యయనం వల్లే సాధ్యం. ఏమి చదువుతున్నామనడమెంత ముఖ్యమో ఎలా చదివి జీర్ణం చేసుకున్నామన్నది కూడా అంతే ముఖ్యం. అందుకే పుస్తకం హస్తభూషణం కాదు.. మస్తక భూషణమవ్వాలి. విషయాన్ని దోచుకుని మస్తకమయం చేసుకోవాలి.

**పద్యానికిచ్చిన ప్రాధాన్యత వచనానికిస్తున్నారా?**

నాకు అలాంటి భేదాభిప్రాయాల్లేవు. నేను దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ రాశాను. అవన్నీ సాహిత్యలోకంలో నన్ను సగర్వంగా నిలబెట్టాయి. నా రచనలపై దేశవ్యాప్తంగా సెమినార్లు జరుగుతూనే ఉన్నాయి. విద్యార్థులు నా రచనలపై, సాహిత్య జీవితంపై పరిశోధనా పత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. నాపై దాదాపు 22 పుస్తకాలొచ్చాయి. ఇది నా ఘనత అనడం కంటే తెలుగుతల్లికి జరుగుతున్న అభిషేకంగా భావిస్తాను. పద్యమైనా వచనమైనా ఏదైనా మన భాషలో భాగమే కదా. ఎవరేమి రాసినా చదవాలి. అందులో విషయాన్ని గ్రహించాలి. ఆకళింపు చేసుకోవాలి. అదే మనల్ని మంచి సాహితీవేత్తగా తీర్చిదిద్దుతుదదదదంది.

సంభాషణ : కెంగార మోహన్
94933 75447






# సమాజం వాకిట వెలుతురు చిమ్మే కవిత్వం

- వొర ప్రసాద్
9490099059

**"వరి కంకులు/ వేట కొడవళ్ళై తిరగబడ్డాయి"** బాలవరం థర్మల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తిరగబడ్డ ప్రజలకు సంఘీభావంగా రాసిన ఈ కవితా వాక్యాలు... ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని జరుగుతున్న దేశవ్యాప్త రైతు ఉద్యమానికి ప్రతీకగా కూడా సరిగ్గా సరిపోతాయి. ఈ కవితా చరణాలు రెడ్డి శంకరరావు తొలి కవితా సంపుటి 'వెలుతురు వాకిట'లోనివి.

శంకరరావు కవి మాత్రమే కాదు; రాజకీయ కార్యకర్త. మార్క్సిజం భావజాలంతో ప్రభావితుడై సమాజాన్ని మార్చాలని అంకితమైన ఉద్యమకారుడు. రోజూ ప్రజల కష్టాలతో, రకరకాల సామాజిక సమస్యలతో, వాటికి పరిష్కారాల ప్రయత్నంలో నిరంతరం మునిగి ఉండే కార్యక్షేత్రం శంకరరావుది. ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్న అంశాల గురించి మిగతా కవులకన్నా ప్రజల మధ్య ప్రత్యక్షంగా పనిచేసే వారికి ఎక్కువగా తెలిసే అవకాశం ఉంది. ఈ అనుభవాలు, అవగాహన నుంచే శంకరరావు కలం పట్టారు. ఉద్యమ బాధ్యతలు చూస్తూనే సాహిత్య కృషి కూడా చేస్తున్నారు.

ఆటవిక సమాజం ఆధునిక సమాజంగా రూపొందిన క్రమాన్ని తెలుసుకొంటేగానీ, సమకాలీన సమాజ స్వరూపాన్ని వాస్తవిక దృష్టితో అర్థం చేసుకోలేం. సమాజంలో జరిగే పరిణామాలన్నీ ఒక దానికొకటి సంబంధం కలిగి ఉంటాయి. దీర్ఘకాలంలో ఈ మార్పులన్నీ కలిసి సమాజానికి సరికొత్త రూపాన్ని తీసుకొస్తాయి. ఆ చైతన్యం, అవగాహన కలిగిన తర్వాత ఎవరైనా గానీ ఆ మార్పులు తీసుకురావటానికి తానూ భాగస్వామిగా ఒక చేయి వేస్తారు. ఆ విధంగానే సమాజం ముందుకు సాగుతూ మెరుగైన సమాజంగా మన భవిష్యత్ తరాలకు అందుతుంది. ఈ అంశాలను కవిత్వం చేయటంలో శంకరరావు ఉత్తేజం ఈ పుస్తకం నిండా పరుచుకుని పాఠకుల్లో ఉత్సాహం నింపుతుంది.

సామాజిక పరిణామాన్ని అర్థవంతంగా ఆవిష్కరిస్తూ ***"సూర్యోదయాన్ని సోషలిజాన్ని ఆపడం ఎవరితరం?/ శిశిరంలో రాలిన ఆకులు/ వసంతంలో చిగురిస్తాయి/ పడమర అస్తమించిన సూర్యుడు/ తూర్పున ఉదయిస్తాడు/ రుతువులు కాలాన్ని బట్టి మారినట్టే/ వ్యవస్థా మారుతుంది/ వెలుతురుకి- చీకటికీ మధ్య కొన్ని గంటలు/ రుతువుకీ రుతువుకీ మధ్య కొన్ని రోజులు/ వ్యవస్థకీ వ్యవస్థకీ మధ్య శతాధిక సంవత్సరాలు పట్టొచ్చు/ అంతమాత్రాన వ్యవస్థ పండుటాకై/ రాలిపోకుండా ఉండిపోతుందా?/ కొత్తగా కొంగొత్తగా కొత్త చిగురు ఆవిష్కరించక తప్పుతుందా?"*** (చైతన్య వసంతం) అంటూ సమాజం మార్పువైపు పయనించడాన్ని మన కళ్ళకి కడతారు. ప్రకృతిలోలాగానే వ్యవస్థలోనూ అనివార్యంగా మార్పు వస్తుందని తేలికైన పదాలతో చెప్పడం కవి ప్రతిభకు నిదర్శనం.

ప్రపంచీకరణను నిరసిస్తూ ప్రత్యామ్నాయాన్ని సూచిస్తూ చాలా బలమైన కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయం ఏమిటి? ఎలాంటి

మార్పులు సమాజ వికాసానికి దోహదం చేస్తాయి? వంటి ప్రశ్నలకు ఈ సంపుటిలో సమాధానాలు ఉన్నాయి. ప్రపంచాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న వాణిజ్య శక్తుల గుట్టు విప్పుతాడు 'అతడు బయల్దేరాడు… తస్మాత్ జాగ్రత్త' కవితలో. ***"అతడు బయల్దేరాడు/ తనకాలికి గుచ్చుకున్న/ మాంద్యం ముల్లును/ వదిలించుకునేందుకు/ రాబందుల రారాజు బయల్దేరాడు" "వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చి/ వేపచెట్టును, పసుపుకొమ్మును పేటెంట్ చేసి/ మన రాజ్యాధిపతుల్ని ఏజెంట్లుగా మార్చి/ కులాసాగా ఖుషీఖుషీగా బయలుదేరాడు యుద్ధోన్మాది/ విశ్వవిద్యాలయ విద్య… హైర్ అండ్ ఫైర్ పద్ధతిని/ బహుమానంగా మనకిచ్చాడట/ మన పర్యావరణాన్ని విషపూరితం చేసి/ మన గాలి పీల్చనంటూ విమానంలో అమెరికా ఆక్సిజన్‌తో/ బహుదానందంగా బయలుదేరాడు"*** అంటూ లాభాల కోసం సమస్త మానవ విలువల్నీ సర్వనాశనం చేస్తున్న అమెరికా నిజస్వరూపాన్ని కవిత్వం చేశారు.

సమాజ అభివృద్ధికి మార్పులు అవసరమే. మానవ జీవనాన్ని ఆ మార్పులు సులభతరం చేయాలి. ఆ మార్పులు అపూర్వమైన ప్రకృతి వనరులను కాపాడాలి. ప్రకృతి, పర్యావరణానికి వీలైనంత తక్కువ నష్టం కలిగే విధంగా విధానాలన్నీ ఉండాలి. విచక్షణ లేకుండా, ప్రకృతి వనరుల్ని నిర్లక్ష్యం చేస్తే 'కరోనా' వంటి విపత్తులు వస్తాయని ఇప్పుడు ప్రపంచానికి బాగా అర్థమైంది. ఈ అంశాలను పట్టించుకోని ప్రపంచీకరణ విధానాల తీరును తన 'మరణశయ్యపై పురిటిగడ్డ' కవితలో ఎండగడతాడు ఈ కవి.

***"డాలర్ దేగ ప్రపంచీకరణ జపం చేస్తూ/ రెండు దశాబ్దాల క్రితమే దేశంలో వాలింది/ ఫలదీకరణ చెందిన ప్రపంచీకరణ/ కాలుష్యపు విషవాయువులు వెదజల్లి/ పరిశ్రమలకి పురిటిగడ్డైంది"***

***"తొలకరి జల్లుకి పులకరించే కప్పలు/ పంటచేలో సందడి చేసే బాతులు/ నేటికీ నా హృదయవీణను మీటుతూనే ఉన్నాయి/ మొసలి, దుప్పి, లేడి, జీబ్రా… ఒకటా రెండా/ వేనవేల జీవకోటి/ కాలం చెప్పిన కన్నీటి కథలో పాత్రధారులై/ ప్రపంచ ఫొటో ప్రదర్శనలో విజేతలై నిలిచాయి"*** అంటాడు.

నేడు ప్రపంచీకరణ పేరుతో అమలు చేయబడుతున్న విధానాలు సమకాలీన మానవ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఎవరికివారుగా, ఏ దేశానికి ఆ దేశంగా, ఏ ఖండానికి ఆ ఖండంగా, ఏ నాగరికతకు ఆ నాగరికతగా, ఏ సంస్కృతికి ఆ సంస్కృతిగా విలసిల్లిన దృశ్యం ఈ ప్రపంచీకరణతో ఒక్కసారిగా మారిపోయింది. పరస్పరం ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి పెరిగి ప్రపంచమంతా ఒక మిశ్రమ సంస్కృతి వైపు ప్రయాణించడం మొదలైంది. ఇప్పుడు అనివార్యంగా ప్రతి ఒక్కరూ ప్రాపంచిక అవగాహన పట్ల దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శంకరరావు 'వెలుతురు వాకిట' పుస్తకాన్ని చూడాలి. అంతర్జాతీయ సామ్రాజ్యవాదం దగ్గర నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లె వాతావరణం వరకూ ఈ సంపుటిలో వైవిధ్యమైన కవితలు ఉన్నాయి.

శంకరరావు చారిత్రాత్మక మేడే సందేశాన్ని తన కవితలో శక్తివంతంగా చిత్రీకరించారు. ***"మండే ఎండల్లో/ మంచు బిందువుల్లా రాలిన చెమట చుక్కలు/ చరిత్ర పుటల్లో త్యాగాల పూలై/ పరిమళిస్తాయి/ నేలకొరిగిన హే మార్కెట్ అమరవీరుల/ వెచ్చటి నెత్తురులో తడిచి ముద్దయి ఎగిరిన/ వస్త్రం/ అరుణ పతాకమై రెపరెపలాడింది" "చరిత్రకు చావు ఉండదు/ అర్థవంతమైన చావుతోనే/ మానవ జీవితం చరితార్థమవుతుంది/ వర్గకత్తుల నిశ్శబ్ద యుద్ధంలో/ త్యాగాల చరిత్ర జనించింది" "వేకువ వెన్నెల తెలియని/ బానిస బతుకుల్లో/ వెలుగులు విరజిమ్మాలని/ చికాగో నగరంలో తలెత్తిన/ అరుణ పతాక/ సకల జనుల కల్యాణానికి/ సందేశమై మెరిసింది"*** (ప్రభాత కిరణం) అంటారు. మేడే విశిష్టతను, చారిత్రక ప్రాధాన్యత తెలిసిన కవి అంతే ప్రేమతో మేడే కవితను రాసి పాఠకుల్లో ఉత్తేజం నింపుతారు.

కవిది సమసమాజ స్వప్నం. తన మార్గాన్ని, దృక్పథాన్ని స్పష్టం చేస్తూ తన మార్గం పట్ల అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తారు. **"సమసమాజ స్థాపనకై/ సాగుతున్న సమరం/ ఇప్పుడే… ఇప్పుడిప్పుడే చల్లారేది కాదు/ దోపిడి చరిత్ర గతి మారే వరకు/ ప్రజల రక్తకన్నీరు/ ఆనంద భాష్పాలుగా జాలువారే వరకు/ ముమ్ముందుకే సాగిపోతుంది"** (పోరుదారి) అంటారు. సమ సమాజమే మానవత్వాన్ని పండిస్తుందనీ, అసమానతల ఆర్థిక వ్యవస్థలో అమానుషత్వం రాజ్యమేలుతుందనీ అడుగడుగునా కవిత్వమై పలుకుతారు శంకరరావు. ఉత్తరాంధ్రలో ప్రగతిశీల భావజాల వారసత్వాన్ని కవిత్వంలో తరచూ స్పర్శిస్తారు ఈ కవి. తాను గురజాడ, శ్రీశ్రీ వారసుడినని, మరో ప్రపంచాన్ని కలగంటానని

నిర్భయంగా కవిత్వం చేస్తాడు. అమరుడైన తన సమకాలీన ఉత్తరాంధ్ర కవి 'అల'పై రాసిన కవితా వాక్యాలు కదిలిస్తాయి – ***"సామ్రాజ్యపు విష కౌగిలిలో/ భరతమాత బందీ అవుతుంటే../ అలా!/ నీ కలం నిప్పుల వాగై ఎగిసిపడింది"***

***"సాయంత్రం సంధ్యాసమయం మేలుకొనే ఉంటుంది/ నీ ఊపిరి ఆగినా... నీ ఆశయం సజీవంగానే వుంది"***

***"వెలుతురు పూవును నలిపే వానని/ చీకటి రాకాసి సంబరపడేలోపే/ తూర్పు దిక్కున ఉదయభానుడి/ వెలుగురేఖలు విచ్చుకుంటాయి"*** (మట్టివాసన తెలియాలంటే) అన్న వాక్యాలు... అల పరిచయం ఉన్న వారి మనసంతా ఉద్వేగంతో నిండిపోయేలా చేస్తాయి.

జాతీయోద్యమ స్ఫూర్తితో నెలకొల్పిన ప్రభుత్వ రంగసంస్థలను ఇప్పటి ప్రభుత్వాలు ప్రైవేటుపరం చేస్తున్నాయి. స్వాతంత్ర్యోద్యమానికి ముందు ఒక రకమైన దోపిడీకి గురయితే.. ఇప్పుడు మరింత దారుణమైన దోపిడీకి గురవుతూ స్వాతంత్ర్యం మేడిపండులా మారిందంటూ శంకరరావు కవిత్వం చేస్తాడు – **"భారత గగనంలో / ఎగురుతున్న సామ్రాజ్యవాద/ రాబందులకి/ మన స్వాతంత్ర్యం ఫలహారమై/ మేడిపండులా మెరుస్తుంది/ తెగిపడబోయే – ఉల్కలా...?/ మన దరిద్రం ఇంకెన్నాళ్ళు?/ శ్రమజీవులు చెమట చుక్కలు/ చైతన్యధారలా ప్రవహించే వరకే ..."** (పంద్రాగస్టు) అంటూ శ్రమజీవుల్లో చైతన్యం వెల్లివిరిసిన నాడే ఇటువంటి దోపిడీకి అడ్డుకట్ట వేయగలమని ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తాడు.

మనదేశంలో కులవ్యవస్థ సాగించిన, సాగిస్తున్న దుర్మార్గాన్ని చాలా వేదనతో కవిత్వం చేశాడు. ***"పచ్చని పల్లెల్లో కాలుష్య నగరాల్లో/ వేళ్ళూనుకున్న కులరక్కసిని కూకటివేళ్ళతో పెకలించేందుకు/ ఇప్పుడు నా చెమట చుక్కలు సంఘర్షిస్తున్నాయి/ సకల జనుల్లో సమానత వెల్లి విరియాలని/ ఇప్పుడు నా చెమట చుక్కలు సంఘర్షిస్తున్నాయి"*** (చెమట చుక్కల సంఘర్షణ) అంటూ కరడుగట్టిన కులవ్యవస్థను తునాతునకలు చెయ్యాలంటే చెమటచుక్కల పోరాటాలతోనే సాధ్యమని చెప్తాడు.

నేటి సమాజంలో మహిళలపై అత్యాచారాల సంఘటనలకు అంతూ పొంతూ లేకుండా ఉంది. నిర్భయ ఘటనపై శంకరరావు స్పందన గుండెను కదిలిస్తుంది – ***"ప్రేమకు ప్రతీకైన/ తెల్లని పాలరాతి తాజ్‌మహల్/ ఎర్రని చారికలతో నిండిపోయింది/ ప్రజాస్వామ్య ముసుగు కప్పుకుని/ జీవంలేని శవంలా బతుకుతున్న/ పార్లమెంటు.../ సిగ్గుతో తలదించుకుంది..." "వేయిపూల పరిమళాలు వెదజల్లే/ నిశిరాత్రి.../ నిలువెల్లా విషమైన మృగాడిని చూసి/ నిర్ఘాంత పోయింది... నిశ్చేష్టురాలైంది...."*** (అమ్మా– బతకాలని ఉంది)

ప్రజా ఉద్యమాలతో పెనవేసుకున్న ఈ కవికి ప్రజల భాష, మాతృభాషల ప్రాధాన్యత బాగా తెలుసు. అందుకే భాష గురించి పాలకుల నిర్లక్ష్యాన్ని తన కవితల్లో ఎండగట్టారు– ***"అనుభవాలను అక్షరబద్ధం చేసి/ ప్రజల ముంగిట భావాలు పలికే భాషకి/ ప్రపంచీకరణ గ్రహణం పట్టింది/ వెలుతురు ముంగిట్లో/ చీకట్లు ముసురుకున్నట్లు/ గలగలపారే సెలయేరు ఒడ్డున/ మోడుబారిన చెట్టుకి కన్నీరు నిండుకున్నట్టు"*** (తెలుగుపూలు) అంటాడు.

ఇటీవల రాస్తున్న కొద్దిమంది మినహా చాలామంది కవులు శిల్పరీత్యా ప్రతిభ కనపరుస్తున్నారు. కానీ వస్తువును ఎన్నుకోవడంతో, వ్యక్తీకరణలో చాలా అయోమయానికి గురవుతున్నారు. కొంతమంది కవులైతే పాలకపక్షాల భుజాలకెక్కి ఇదే ప్రగతి అనే సాహసం కూడా చేస్తున్నారు. అలాంటి వారందరూ కవితా సంపుటి చదవాలి. నిజమైన ప్రజాకవి ఎలా రాస్తాడో, తడబాటులేని కవిత్వంలో ప్రజల గొంతు ఎలా వినిపిస్తుందో తెలుస్తుంది. ఈ కవితా సంపుటి శీర్షిక 'వెలుతురు వాకిట' పేరుతో రాసిన కవిత ఈ సంపుటికే తలమానికం. తెల్లవారుజామున లేచి రోడ్లను పరిశుభ్రం చేసే కష్టజీవుల గురించి రాసిన వాక్యాలు మన హృదయంలో ముద్రించుకుపోతాయి. ***"వేకువను తట్టిలేపి/ చీకటిని మృదువుగా పక్కకు నెట్టి/ ముఖాన్ని వెలుతురు పులుముకొని/ నల్లత్రాచులాంటి రోడ్డు పైకి/ వడివడిగా అడుగులేస్తూ కదులుతారు"*** (వెలుతురు వాకిట) అంటూ తెల్లవారు జామున లేచి పనిచేయడానికి తరలివెళ్ళే కష్టజీవుల ముఖచిత్రాన్ని మన మనసుల్లో ఇంకేలా కవిత్వం చేస్తారు శంకరరావు. ప్రతి పేజీలో కష్టజీవుల పోరాట పరిమళం మన గుండె కవాటాలను తడుతూ ఉంటుంది ఈ కవితా సంపుటిలో. సామాజిక అవగాహన, మానవీయ దృక్పథంతో రెడ్డి శంకరరావు కలం నుంచి వెలువడిన కవితాధార ఈ పుస్తకం. వర్తమాన సమాజాన్ని కలవరపెడుతున్న అంశాలను కవిత్వం చేసి మన ముందుంచారు. ఆత్మీయతను పంచే, ఆలోచనలను రేకెత్తించే కవిత్వ కరచాలనం కోసం 'వెలుతురు వాకిట'ను తెరవండి. ఈ పుస్తకం కోసం 9494333511 సంప్రదించండి. ■

## కవిత

# మాకెందుకొస్తది?

- అవనిశ్రీ
9985419424

ఈతాకు తాటాకులు కలిపి
అల్లుకున్న మా గుడెసెలోకి
తుమ్మపూల వాసనేగానీ
తుళ్లీ తూగే
మత్తువాసన ఎందుకొస్తది?

సుట్టు బందారాకు లబ్బరు బర్రెలతో
గిజిగాడు తీర్లనే
కట్టుకున్న వాకిట్లోకి
తంగేడు పూల వాసనేగానీ
గత్తరబిత్తరయ్యే గంజాయి కంపు
వాసన మాకెందుకొస్తది?

పొద్దెక్కుతుంటే ఎర్రమట్టితో
అలికిపూసిన కట్టెల పొయ్యిమీద
కాలుతున్న సద్దరొట్టెల వాసనేగానీ
మూడొద్దులు డీ ఫ్రిజ్‌లో ఉగ్గబెట్టిన
పిజ్జాల పాసి వాసన
మాకెందుకొస్తది?

మూడు వారాలకోపారి సంత
సౌదకుబోతుంటే దాసుకున్నోట్ల
వాసనేగానీ



మా నెత్తురంత జుర్రి దాసుకున్న
స్విస్ బ్యాంకుల్లో మూలిగే
మీ డాలర్ల వాసన మాకెందుకొస్తది?

ఏరువాక నాడు నాగేటి సాళ్ల
మట్టి పొత్తిళ్లలో నుంచి తన్నుకొచ్చిన
మల్లెల గంధంలాంటి
మట్టివాసనేగానీ
మన్నుతాకని ముల్లునాటని
మీ తెల్లకాళ్ల వాసన
మాకెందుకొస్తది?

గుడిసెలోపల త్యాపత్యాపలు బెట్టి
పెండనీళ్లతో సాన్పుజల్లి
అలికిపూసిన పెండవాసనే గానీ
మీ పాలీష్ బండల ఫినాయిల్ కంపు
మాకెందుకొస్తది?

సాకిరేవు బండల మీద పిడికెడు
సౌదు మట్టితో
ఉతుకొచ్చిన రేవు పాకర వాసనేగానీ
పూటకో సబ్బు నురగగక్కే
గబ్బువాసన మాకెందుకొస్తది?

మా బత్కే మల్లెపూల వాసన
మా మెతుకే సెమటపూల వాసన
మీ ఏసి గదుల్లో చల్లదనంకన్న
మా మోరి కంపువాసనే నయం! ■

# ఓ వెన్నెల రాత్రి కోసం...

-గవిడి శ్రీనివాస్
70192 78368



చాలా కాలమే అయింది
కాసిన్ని నవ్వులు పూసి
వెన్నెల దోబూచులాడి
సిగ్గుపడే చుక్కలతో మాట్లాడి
కొద్దిగా కొరికే చలిగాలుల్లో ఈదులాడి
ముచ్చట పడే మేఘాల్లో తేలి
చాలా కాలమే అయింది!
ఇన్ని దినాలు ఎన్ని వర్షాలు నాలో ఒంపుకో లేదూ...!
ఊసులు కొసరుతుంటే
ఎన్ని చలి మంటలు
గుండెల్లో దాచుకోలేదూ....!
మౌనం పెగలక
ఎన్ని ఎండలకి తడిసినా...
కాసింత కాలం నడిచాక ఏదో చల్లని సమీరం
ఆకుల వెంబడి తాకింది!
వెన్నెల వేలాడ దీసే పక్షుల్ని
మబ్బులు అల్లిన రంగవల్లుల్ని
చీకటిని తొలిచే మిణుగురుల్ని
అదే పనిగా చూస్తున్నాను
కొంత ప్రయాణం సాగాక
ఈ నిర్లిప్త క్షణాల్లో ఓ వెన్నెల రాత్రికోసం
ఆశను పరచుకొని
నీలి ఆకాశం వంక
ఇంకా ముచ్చటగా వీక్షిస్తున్నాను! ■




# టు లెట్

**జంధ్యాల రఘుబాబు**
98497 53298

**అ**ద్దె ఇంటికోసం తిరిగి తిరిగి వేసారిన నాకు జీవితం గురించిన ఎన్నో విషయాలు తెలిశాయి. ఆరోజు కూడా అదే వేటలో ఉన్నాను. అది అంతకుముందు తిరిగిన వీధే అయినా మేము చూడవలసిన ఇళ్ళు దాన్ని దాటిపోవాలి కాబట్టి అందులోంచే పోతున్నాను. అంతకుముందు టు లెట్ బోర్డు ఉన్న ఇల్లే ఈసారి కొత్త బోర్డుతో దర్శనమిచ్చింది. లోలోన ఆనందం, ఉద్వేగం కలగలసి వచ్చాయి. నెలరోజుల క్రితం జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా గుర్తొస్తున్నాయి.

నా జన్మ భూమి ఎంత అందమైన దేశము, జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి, నా జెండా ఎగురే ఎగురే ఎండ వానా ఉన్నన్నాళ్ళూ ఎగురే ఎగురే మొదలైన పాటలు చిన్నప్పుడు విన్నాను, పాడాను. అలాంటి పాటల సందడితో జెండా పండుగ చేసుకున్న నాకు వయస్సు యాభై ఏండ్లు దాటినా ఇప్పటికీ స్వాతంత్ర్య దినం, గణతంత్ర దినం వచ్చిందంటే మనసు విద్యార్థి దశకు పోతుంది. ఈ స్వతంత్ర్య దేశం ఎవరికి ఏమిచ్చిందో కాని నాకు మాత్రం చాలా చేదు అనుభవాలనే మిగిల్చింది. జాషువా, పూలే, అంబేద్కర్ లాంటి మహానుభావులే అవమానింపబడ్డ దేశంలో ఉన్నానని, వాళ్ళతో పోల్చుకుంటే ఒక మామూలు మనిషినైన నాకు ఇవేమంత లెక్కలోకి రావని సరిపెట్టుకున్నా... మనసులో ఎన్నో ఉద్వేగాలు! నా పుట్టుక నన్ను జీవితాంతం వేటాడుతుందని తెలుసుకున్న నాకు ఇక దానితో సహజీవనం చేయడమొక్కటే మార్గమని అర్థమైపోయింది. మరి నా పిల్లలు, తరువాత మనవలు, ముని మనవలు ... ఇలా ఇంకా ఎన్ని తరాలు నాలాగే ఈ పరిస్థితుల్ని ఎదుర్కోవాలో అన్న ప్రశ్న కూడా నాతో సహజీవనం చేయడం నన్ను ఎలర్ట్‌గా ఉంచుతోంది. ఏదో ఒక చోట దీన్ని ఆపకపోతే దేశం బాగుపడదని తెలిసిపోయింది.

ఎంత తెలుసుకున్నా, ఎంత ఆలోచించినా, ఎన్ని పోరాటాలు చేస్తున్నా జీవితాన్ని ఈ మనుషుల మధ్య ఇష్టమున్నా, కష్టమైనా జీవించవలసిందే. జీవించడానికి ఒక ఇల్లు అవసరం. సొంత ఇల్లు లేని నాకు అద్దె కొంపే ఆధారం. పెరుగుతున్న అవసరాలకు సరిపోయినట్టు ఇల్లుడాలంటే ఎప్పటికప్పుడు ఇల్లు మారుతూ ఉండవలసిందే. ఆ మారే క్రమంలో ఇంట్లోని చెత్తా చెదారాన్ని పారేసి ఇంటిని శుభ్రం చేసుకుంటాము. కాని అలా ఇల్లు వెదికే పనిలో ఉన్నప్పుడు మనసునిండా, మస్తిష్కం నిండా అంతకుముందు ఎదురైన చేదు అనుభవాలు, గాయాలు మాత్రం సముద్రంలోని అలల్లా వచ్చిపోతూనే ఉంటాయి. ఐనా మనసును శాంతంగా ఉంచుకోలేకపోయినా నటించడం అవసరం మనిషికి.

ఆరోజు బాగా గుర్తు. ఇల్లు మారతాము అని ఇంటి ఓనరు రాఘవశర్మకు చెబితే ఆయన బాధపడ్డాడు. నాలుగేళ్ళు ఎటువంటి సమస్యా లేకుండా ఉన్న మాకు స్నేహం కూడా బాగా పెరిగింది. పేరునుబట్టి ఒక ముద్రవేసే రకం మనిషి కాదాయన. ఎన్నో ఉన్నత భావాలు కలవాడు. ఇంట్లో చేరేటప్పుడే మేము దళితులమని, ఫలానా అని చెబుతుంటే ఆపేశాడు. 'నేనా విషయం అడిగానా' అని మందలించాడు. 'మీ ఇంట్లో ఉన్నన్ని రోజులు నాన్ వెజ్ చేసుకోము' అని చెప్పేంతలోనే .. 'ఎవరి ఆహారం, అలవాట్లు వారివి. నేను ఏ ముస్లిం ఇంటిలోనో అద్దెకు చేరితే వారి ఆహారాన్నే తినాలా? అన్న ప్రశ్నలాగే ఉంటుంది నేనా విషయం అడిగితే..' అంటూనే తమకెలాంటి అభ్యంతరాలూ లేవని సూటిగా చెప్పేశాడు.

"మీరిద్దరూ చదువుకున్న వాళ్ళు, ఉద్యోగులు. అదీ కాక మా మిత్రుడు కలాం చెప్పాడంటే మీ గురించి ఆలోచించాల్సిన పనే లేదు" అని ఇల్లు మొత్తం చూపించి మాకిచ్చే పై పోర్షన్‌కు

తీసుకొని పోయాడు. ఆయన మాటల్లోని నిజాయితీని మించిన ఆయన ప్రవర్తన, ఆయన అనడంకంటే వారి కుటుంబ ప్రవర్తన మమ్మల్ని ఆకర్షించింది. జీవితం మీద కొత్త ఆశల్ని రేపింది. వాళ్ళ శ్రీమతి ఒక్కరోజు కూడా పైకొచ్చి ఇల్లు ఎలా పెట్టుకున్నారు అని అడగకపోయేసరికి నా శ్రీమతే మరీ పైకి పిలుచుకొచ్చి ఒకసారి చూపించింది. చాలా బాగా పెట్టుకున్నారని చెప్పింది. టీ పెట్టిస్తానంటే ఎటువంటి మొహమాటం లేకుండా తాగి మరీ వెళ్ళింది. అసలు రాఘవ శర్మ ఇంట్లో మూడు పోర్షన్లు ఉంటే ఒకదాంట్లో తానుండి, ఒకటి ముస్లిములకు, ఒకటి మాకు ఇచ్చాడు. అది ఆయన మంచితనం, ఆదర్శం.

అటువంటి అనుభవాలను మిగిల్చిన రాఘవశర్మ గారి ఇల్లు మా పిల్లల స్కూలుకోసమని వదలవలసి వచ్చింది. ఇల్లు వెదికే పనిలో ఉద్యోగం తెచ్చుకున్న విధంగా ఎన్నో ఇంటర్వ్యూలు ఎదుర్కోవలసి వస్తుంది. కవి నాగప్పగారి సుందరరాజు మాటల్లో చెప్పాలంటే... నేను పుట్టిన పేట నా జీవితాన్ని నిర్దేశిస్తోంది. అవసరం నాది కాబట్టి ఒక్కో ఇల్లూ వదులుకుంటూ సాగుతున్నాను. నేను పోరాడవలసింది ఒక్కొక్కరితో కాదు, మొత్తం సమాజంతో అన్న విషయం తెలిసినవాడిని కాబట్టి చిరునవ్వుతోనే సాగిపోతున్నాను అద్దె ఇంటి వేటలో. ప్రతి టు లెట్ బోర్డు ఉన్న ఇంటి చిరునామా, పేరు రాసుకుంటూ వస్తున్నాను. ఒక ఇరవై రెండు ఇళ్ళు వారం రోజుల్లో తిరిగి సూటిగా కొన్ని చోట్ల, అస్పష్టంగా కొన్నిచోట్ల కులం, మతం ప్రస్తావనకు వచ్చాయి. ఏదొక కారణం చెప్పి ఇల్లు ఇవ్వలేమని చెప్పేవాళ్లే ఎక్కువ. కానీ, అవసరం బాధల్ని, భావావేశాల్ని అదుపు చేసింది. ఐతే కర్తవ్యాన్ని ఏదీ ఆపలేదు.

అందుకే ముప్ఫై కవర్లు తీసుకొని ఇంటికి పోయాను. నేను పుట్టిన సామాజిక వర్గం వల్ల ఇల్లు అద్దెకు ఇవ్వలేని వారికందరికి ఉత్తరం రాసి దాన్ని ఇరవై ఐదు కాపీలు జిరాక్సు తీయించాను. క్లుప్తంగా దాని సారాంశం ఇది : "అయ్యా, మేము గత నాలుగేళ్ళుగా ఎల్ఐసిలో పనిచేసే రాఘవ శర్మ గారి ఇంట్లో అద్దెకుంటున్నాము. వారితో ఎటువంటి ఇబ్బంది రాలేదు సరికదా ఆయనతో నా స్నేహం పెరిగింది. ఆయన సంస్కారం మమ్మల్ని ముగ్ధుల్ని చేసింది. ఇప్పుడు కూడా పిల్లల స్కూలు విషయమై ఇల్లు మారవలసి వచ్చింది. వాళ్ళపై పోర్షనులో ఉన్నన్ని రోజులు ఎటువంటి సమస్యా వారితో రాలేదు. నాన్ వెజ్ కూడా వండుకునే వాళ్ళం. వారి ఫోను నెంబరు ఇందులో రాశాను. మా గురించిన వివరాలు ఆయనే చెబుతారు. మీరు అద్దెకు ఇస్తే వెజిటేరియన్ వంటకాలే చేసుకుంటాము. మా గురించి ఈ మాటలు ఎదురుగా చెప్పలేక ఉత్తరం రాస్తున్నాను. మీరు ఓకే అనుకుంటే నాకు ఫోన్ చేయగలరు. ఈ కులాల, మతాల అసమానతలు పోయేరోజు కోసం ఎదురుచూసే ... శుభాకర్".

◆◆◆

పది రోజులు అయిపోయాయి. ఎవ్వరి దగ్గరినుంచీ కాల్ రాలేదు. ఒక్క మిస్సుడు కాల్ వచ్చింది కాని తరువాత ఏదీ రాలేదు. అక్కడితో ఆశ వదిలేసి మళ్ళీ ఇళ్ళ వేటలో పడ్డాను, ఈసారి నా శ్రీమతి మేరీతో కలిసి. క్రితంసారి పోయిన లైనులోనే బైకుపై పోతున్నాము అదే దారి కాబట్టి. అందుకే నేను ఏవీ గమనించడం లేదు. బండి తోలుతున్నాను. ఒక్కసారిగా నా శ్రీమతి "ఏమండీ ఆపండి" అంది, తనకు నోబెల్ బహుమతి వచ్చినంత ఆనందంగా. ఆ కేక విని సడెన్‌గా ఆపాను. ఒక టు లెట్ బోర్డు చూపించింది. ఆశ్చర్యం! "ఇల్లు ఏ కులం వారికైనా అద్దెకివ్వబడును'' అన్న బోర్డు దర్శనమిచ్చింది. లోలోన అనుమానంగానే ఉన్నా బండి ఆ ఇంటిముందు పార్కు చేసి గేటు తీశాము. స్టేట్ బ్యాంకులో పనిచేసే వెంకటరావు నన్ను గుర్తుపట్టి "శుభాకర్ గారూ రండి.. మేడం మీరూ రండి" అని సాదరంగా ఆహ్వానించాడు. టీ ఇచ్చి తనే మొదలు పెట్టాడు

"రాఘవ శర్మ నా మిత్రుడే. కాని నేను ఆయనంత ఆదర్శాలు లేనివాణ్ణయినా చెడ్డవాణ్ణి మాత్రం కాదు. ఈ మధ్య మా మిత్రుడు విల్సన్ తన అద్దె ఇంటి వేట గురించి చెప్పాడు. ఇంకో మిత్రుడు సలీం కూడా జత కలిపాడు. అప్పుడు మా పై పోర్షన్ ఖాళీగా లేదు. ఉన్నా ఇచ్చేవాళ్ళమో కాదో తెలియదు. మీరు వచ్చిపోయాక బాగా ఆలోచించాము. ఎదుటి మనిషిని బాధ పెట్టామన్న అపరాధ భావం మమ్మల్ని వెంటాడింది. మిమ్మల్ని కలుద్దామంటే వీలు కాలేదు. అద్దెకిస్తే మీకే ఇవ్వాలని ఈ బోర్డు పెట్టాము. మీకు ఒకసారి ఫోను చేస్తే మీరు తీయలేదు. బోర్డు చూసి ఆశగా చాలామంది అడిగిపోయారు. ఇచ్చేశామని అబద్ధం ఆడాము. ఈ లైనంతా ఆ బోర్డు గురించి చర్చించుకుంటున్నారు. మీ ఉత్తరం మా కళ్ళు తెరిపించింది. మీరు నిరభ్యంతరంగా మా పై పోర్షనులో అద్దెకు చేరవచ్చు. ఇల్లు ఒకసారి చూసుకొండి. మీకిష్టమైన ఆహారం చేసుకొని తినవచ్చు. మీరు, రాఘవ మాకళ్ళు తెరిపించినట్టే మేమూ కొద్దిమందికైనా కనువిప్పు కలిగించించాలని నిర్ణయించుకున్నాము." అంటూ రిలీఫ్‌గా ఫీలయ్యారు.

కొద్దిసేపు అవీ, ఇవీ మాట్లాడి వచ్చే వారమే చేరతామని

కవిత

# ఎదురుచూపు

- కొలిపాక శ్రీనివాస్
9866514972



ఇన్నాళ్లుగా
కరోనా వైరస్‌కు మాస్కుతో
మొహం చాటేసిన బడి
ఇప్పుడు
స్వేచ్ఛగా రెక్కలు విదిలించి
హుషారుగా సిద్ధమవుతోంది!
పిల్లలు లేక మసకబారిన
చదువుల బడి ఇప్పుడు
తనువు నిండా సత్తువను నింపుకొని
బోసి నువ్వులను చిందించేందుకు
తహతహలాడుతుంది!
ఇంతకాలం తరగతి గదుల నిండా
నిశ్శబ్దపు నిశీధులు అలుముకున్నవి
ఇప్పుడు
తొలి వేకువ కిరణాల ఛాయలతో
కొండంత ఆశగా ఎదురు చూస్తున్న
చిన్నారులకు
విజ్ఞానపు కాంతులు పంచడానికి
సుద్దముక్క నల్లబల్ల
కలిసికట్టుగా కలుస్తామంటున్నవి!

సప్పుడు లేని బడిగంట
భావి భారత పౌరులకై
నూతన ఉత్తేజంతో
కాలగమనానికి బాసటై
మార్గనిర్దేశం చేయాలనుకుంటుంది!
బుడిబుడి అడుగుల తాకిడి కోసం
ఆట స్థలం ఆరాటపడుతుంది!

విరాజిల్లే సింగిడి వర్ణ శోభితాలతో
బడి బుడతల కోలాహలం కోసం
విశాలమైన హృదయంతో
కళ్ళను విప్పార్చి ఆశగా
ఎదురుచూస్తోంది చదువుల బడి ..! ■

---

చెప్పి అడ్వాన్సు వద్దంటున్నా ఇచ్చి ఇంటికి బయలుదేరాము.

మాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. ఇల్లు అద్దెకు దొరికినంతనే సమస్య తీరిపోలేదు. కాని మేము చేస్తున్న పోరాటంలో మాకు తోడు దొరికిందన్న ఆనందం కలిగింది. ఈ దృష్టి కోణాన్ని సమాజంలో అందరికీ కలిగించాలన్న కోరిక, ఆశ ఒక్కసారిగా కలిగాయి. మా తరువాతి తరాలకు మంచిరోజులు వచ్చి తీరతాయన్న నమ్మకం కలిగింది. ఆ నమ్మకాన్ని నిజం చేయాలి. అందుకై చేసే పోరాటంలో ఎందరినో కలుపుకొని పోవాలి. సమాజంలో చైతన్యం కలిగిన మనుషులు చాలామందే ఉన్నారు. వారిని సరిగా వాడుకోవాలి అనుకుంటూ ఇంటిదారి పట్టాము నేనూ, మేరీ. ■



# అక్షర ప్రేమికుడు, అందరి స్నేహితుడు దుర్గాప్రసాద్

**ఈ** సంక్రాంతి తెలుగు సాహితీలోకానికి పెద్ద వెలితి మిగిల్చి వెళ్లిపోయింది. తెనాలి కేంద్రంగా తెలుగు సాహితీ వైవిధ్య వైభవాన్ని చాటిచెప్పిన అక్షర ప్రేమికుడు, అందరి స్నేహితుడు నాగళ్ల దుర్గా ప్రసాద్ జనవరి 14న ఆకస్మికంగా కన్నుమూశాడనే వార్త సాహితీలోకాన్ని కుదిపేసింది. ఎందుకంటే ఏదో ఒక సమయంలో ఆయన ప్రజ్వలిత వేదికలో పాలుపంచుకోని, తన స్నేహమాధుర్యం, భావ నైశిత్యం చవిచూడని సాహితీ పాత్రికేయ కళా ప్రముఖులు చాలా తక్కువమంది ఉంటారు. ఆంధ్రా పారిస్‌గా పేరు పొంది, అభ్యుదయ కళాసాహిత్య రంగస్థలిగా రాణించిన తెనాలి విశిష్టతను సజీవంగా కొనసాగించిన దీక్ష, ఆపేక్ష ఆయన స్వంతం. దానికి ఎన్ని ప్రయాసలు పడ్డారో, ఎంత శ్రమపడి వనరులు సమీకరించారో తనకు మాత్రమే తెలుసు. ప్రజ్వలిత కార్యక్రమం మాత్రం సాహితీ జీవులకు కన్నుల పండుగ. మేధకు కసరత్తు. సాహితీ జీవులు కలుసుకునే విశాల సందర్భం. ఎక్కడెక్కడి వారిని తెనాలి రప్పించి, సగౌరవంగా ఆతిథ్యమిచ్చి, సమగ్రంగా చర్చ జరిపి సాదరంగా సాగనంపే సంస్కారం, సమర్థత, సమన్వయం దుర్గా ప్రసాద్‌కే చెల్లాయి.

సామ్యవాద భావజాలం, అస్తిత్వ ఉద్యమాలు, సినీ రంగస్థల కళారూపాలు, పత్రికారంగం.. ఇలా దేన్నీ ఆయన వదలి పెట్టలేదు. ఇవన్నీ ఆరితేరిన వారు, అనుభవంలో పండిపోయిన వారు మళ్లీ మళ్లీ మాట్లాడుకుంటే ఉపయోగం ఏమిటనేది తన ప్రశ్న. అందుకే యువజన, విద్యార్థులను క్రమపద్ధతిలో పాల్గొనేలా చర్యలు తీసుకునేవారు. ఆ సంస్థలతో మాట్లాడి వారిని భాగస్వాములను చేసేవారు. విద్యార్థులకు ముందే సినాప్సిస్ ఇచ్చి, ఉపన్యాసాల తరువాత మళ్లీ రాయించేవారు. ప్రశ్నలు జవాబుల కార్యక్రమం తప్పక ఉండేలా జాగ్రత్త వహించేవారు. లాంఛనంగా సభలు జరిపించడం గాక.. రోజు మొత్తం కొన్ని సెషన్స్‌గా విభజించి నిర్దిష్ట ప్రణాళిక పాటించేవారు. ఆ మధ్యలో ఆత్మీయ సత్కారాలు, అవసరమైన వారికి సహాయాలు ఉండేవి. యువత సాహిత్య సామాజిక కార్యక్రమాలకు రావడం లేదనే అపప్రధను తొలగించేందుకు ఆచరణలో బాట వేసిన, ఫలితం సాధించిన సార్థక ప్రయోగశీలి దుర్గాప్రసాద్. తనకు స్వయంగా సాహిత్యం పట్ల విమర్శనాత్మక అధ్యయనం ఉండేది. భిన్నాభిప్రాయాలు చెప్పగల నిక్కచ్చితనం, వెంటనే ఉదహరించగల పట్టు కూడా ఉండేది. భిన్న కోణాలను తెలుసుకోవాలని తెలియజెప్పాలనే ప్రజాస్వామ్య శీలతా ఉండేది. ఇన్ని కారణాల వల్ల ప్రజ్వలిత కార్యక్రమాలు సాహితీలోకంలో దాదాపు రెండు దశాబ్దాల పాటు జ్వాజ్వల్యమానంగా ప్రకాశించాయి.

సేవను, ప్రతిభను, చరిత్రను గౌరవించడం దుర్గ పెట్టుకున్న మార్గదర్శక సూత్రాలు. ఈ కృషిలో ఆయనకు చేయూతనిచ్చిన, తోడు నిలిచిన మిత్రబృందం, దాతలు మరికొందరు ఉన్నా... సూత్రధారి తనే. ప్రజ్వలిత క్యాలెండర్ ఎప్పుడూ ఖాళీగా ఉండేది కాదు. ఉంటే దుర్గకు నచ్చదు. కొత్త కొత్త ఆలోచనలు, రచయితలు, విమర్శకులు, కళాకారులతో చర్చాగోష్టులు, ఉపన్యాసాలు నిరంతరాయంగా జరిపించాడంటే తన భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె చైతన్యంతో సహకరించడం వల్లనే సాధ్యమైందనేది కూడా చెప్పవనసరం లేని విషయం. ఆయన తండ్రి రామకోటేశ్వరరావు హెచ్‌ఎంటిలో కార్మిక నాయకుడుగా పనిచేసి కన్నుమూశారు. తల్లి జయలక్ష్మమ్మ. గుంటూరు జిల్లా అనంతవరంలో 1965లో పుట్టిన దుర్గకు అభ్యుదయ ఉద్యమాలతోనూ సంబంధం ఉన్నా కళాసాహిత్య రంగాలపై అధిక మక్కువ. విరాళాలకు తోడు భారీగా సొంత వ్యయంతో తెనాలిలో రంగస్థల కళాకారుల భవనం నిర్మించడం అందుకో నిదర్శనం మాత్రమే. ప్రజ్వలిత 2014లో స్థాపించినా అంతకుముందు నుంచీ సాహితీ కార్యక్రమాలు, సైద్ధాంతిక గోష్టులు సాగిస్తూనే వచ్చారు. కొన్ని ప్రచురణలు, చక్కటి చిత్రాలు కూడా వెలువరించారు. విభజన తర్వాతా ఉభయ తెలుగు రాష్ట్రాల బుద్ధిజీవులకు దగ్గరవాడుగా కృషి కొనసాగించిన దుర్గాప్రసాద్ ఒరవడిని అందిపుచ్చుకోవడం, సేవలను కొనసాగించడమే తనకు నిజమైన నివాళి.

**- తెలకపల్లి రవి**

## కవిత

# కొత్త చిగురులు

- శ్రీధర్ చౌడారపు
94400 32211

**మ**ళ్లీ కనిపించని పాత ముఖాలూ
వదిలివెళ్ళిన స్థలాలూ వస్తువులూ
తరలిపోయిన జ్ఞాపకాలను తట్టిలేపుతాయి
కాలం ధాటికి బెదిరి పారిపోయిన
తడారిపోయి పొడారిపోయిన వాటిపై
కాసిన్ని సంఘటనల చన్నీళ్ళు చల్లి పచ్చిగా చేస్తాయి
మనసు అరల్లో దాగి మాగిపోయిన
అనుబంధాలను అనుభవాలనూ అనుభూతులను
బయటకు లాగి మళ్ళీ మనసుపై అద్దుకుంటాయి

కోపాన్ని కొంటెగా పక్కకి నెట్టేసిన
తక్కిన నవరసాల అనుభూతులన్నీ
పెదవుల మీదికి నవ్వునే దిగుమతి చేస్తాయి
కళ్ళల్లోకి ఎంతోకొంత చెమ్మనీ అద్దుతాయి
కొండొకచో కళ్ళు చెలిమలై నీళ్ళు తొణుకుతుంటాయి
నా దారి నీ దారి కాదు, అది రాదారి అంటూ
కోపం కళ్ళెర్ర చేసి శ్వాసను వేడెక్కిస్తే
శృంగారం సిగ్గుతో బుగ్గలను ఎరుపెక్కిస్తుంది

కరచాలనాలూ ఆలింగనాలూ
మనుషుల మధ్య మౌనంగా మార్పిడి అవుతూ
ఆత్మీయతను అటూఇటూ పంపిణీ చేసేస్తే
నదులైనా గదులైనా చెట్లులైనా పుట్టలైనా
తిరిగిన వార్డులైనా చూసేసిన బోర్డులైనా
గతం తాలూకు సుగంధాన్ని పూసేసుకుంటూ
సన్నివేశాల సప్తవర్ణాలు చల్లేసుకుంటూ
అనుభూతుల ఆనందాల హోళీ ఆడుకుంటాయి





అవును ...
జ్ఞాపకం గొప్పదైనా గోరంతదైనా
మనసు మూలల్లో అణువంతగా అణిగిపోయినా
ఎండి మోడువారిపోయినా ...
అనువైన సమయంలో
అందిన మాటల చెమ్మతోనో
అంటిన స్థలాల, వస్తువుల స్పర్శతోనో
అలా అలా కొత్త చిగురులు వేస్తుంది
మెల్లమెల్లగా ఎదిగి మానై నిలిచిపోతుంది
మరింతకాలం మనసులో నిండి ఉండిపోతుంది!

# సంపాదకీయాలు స్వార్థ రాజీ'కీయాలు

- డాక్టర్ బి.లలితా ప్రసాద్
విశ్రాంత ఆచార్యులు
92474 99715

'ప్రభుత్వం లేని మీడియా కావాలా? లేక మీడియా లేని ప్రభుత్వం కావాలా?' అనే ప్రశ్నకు అమెరికా పూర్వ అధ్యక్షుడు థామస్ జెఫర్సన్... ఇందులో మొదటిదే కావాలి అన్నాడు. దీన్నిబట్టి మీడియా ఎంత శక్తివంతమైనదో, ప్రభావశీలమైనదో తెలుస్తుంది. భారతంలో నన్నయ్య 'వార్తయందు జగము వర్ధిల్లు' అంటాడు, అంతకుముందు ఎప్పుడో! వార్త విశిష్టత ఈ నాటిది కాదు. నెపోలియన్ అంతటివాడు పత్రికల ప్రాశస్త్యాన్ని కొనియాడిన సంగతి జగమెరిగినది.

ఇంతటి విశిష్టత గల మీడియాకు, అందునా పత్రికలకు సంబంధించి గుండెకాయ సంపాదకీయం. విలువలు, ప్రమాణాలు పాటించే వారికి ఇది శ్వాస లాంటిది. పత్రిక స్థాయికి గీటురాయి సంపాదకీయం. ఇందులో పాటించే ప్రామాణికతలు, నిష్పాక్షికత, దీర్ఘకాల బహుళ ప్రయోజనాలు, అందునా బడుగులకు సంబంధించినవి, మార్గ నిర్దేశకం. సహేతుకత, మానవీయత, పరిణతి, వివేకము, విజ్ఞత, విచక్షణ లాంటివి కొలబద్దలు. వీటిని బట్టే ఆయా వ్యక్తుల, సంస్థల, వ్యవస్థల విశ్వసనీయత, గౌరవ ప్రతిష్టలు, ఆదరణ అభిమానాలు ఉంటాయి. రాగద్వేషాలకు అతీతంగా ఉండే వారి నుంచి ఉన్నత, ఉత్తమ స్థాయి గల వ్యాఖ్యలూ విశ్లేషణలూ రాగలవు. ఈ కారణంగానే గతంలో మన ఉమ్మడి రాష్ట్రానికి చెందిన ఎందరెందరో ఆంధ్ర ఆంగ్ల పత్రికల్లో ఉత్తమోత్తములుగా లబ్ధప్రతిష్ఠులయ్యారు. తమకు తాము, పనిచేసిన పత్రికలకూ కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించి ప్రజల మన్ననలు పొందారు. ఆయా పత్రికలకు ఒక స్థాయి కల్పించారు.

ఇంతటి ఘన చరిత్ర గల సంపాదకీయాలు 'నానాటికీ తీసికట్టు' అన్నట్లు అంతకంతకూ పతనావస్థకు చేరటం విచారకరం. ఇది కొత్తగా మొదలైంది కాదు. దాదాపు మూడున్నర దశాబ్దాల పూర్వం ప్రారంభమైంది. ఇప్పుడు పరాకాష్టకి చేరింది. 1984లో తణుకులో జరిగిన జర్నలిస్టుల శిక్షణా కార్యక్రమంలో, ఎన్నో పత్రికలకు సంపాదకునిగా పనిచేసిన ఏబీకే ప్రసాద్ అన్నారు : 'మీరు ఎడిటోరియల్స్‌గా చదువుకునేవన్నీ నిజానికి ప్రొప్రైటోరియల్స్' అని. ఇక ఇప్పటి సంగతి తెలియనిది ఎవరికి?

సంపాదకీయం అంటే సమకాలీన తాజా అంశానికి సంబంధించి వస్తున్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని, దానికి సంబంధించిన పూర్వాపరాలను పరామర్శించి ప్రస్తుతానికి సమన్వయపరచాలి. ఆ అంశానికి సంబంధించిన వస్తుగత పార్శ్వాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని బేరీజు వేసి రాయాలి. వీటిలో ఏది, ఎందుకు, ఎవరికి ఉపయుక్తమో, కాదో సకారణంగా విశదపరచాలి. అది రాజ్యాంగ, న్యాయ, చట్టబద్ధంగానే గాక ధర్మబద్ధంగా బాధితుడికి రక్షణగా ఉండాలి. ఎక్కడ ఏ రూపంలో ప్రజల బహుళ ప్రయోజనాలను తాకట్టు పెట్టినా అది తనను తాను వంచన చేసుకోవడమే! సమస్త విలువలను, నైతిక ప్రమాణాలను నిలువు లోతున పాతి పెట్టడమే! సంపాదకీయం అనేది మీడియాకు చెందిన వ్యక్తి, సంస్థ, వ్యవస్థలు తమదైన రీతిలో పాలకులకు/ పాలితులకు మార్గనిర్దేశం చేసేది. ఇంత గురుతరమైన బాధ్యత గల కీలక రాతలు నేడు చాలా పత్రికల్లో ద్వంద్వ ప్రమాణాలతో,

పాక్షిక ప్రయోజనాలకై సంకుచిత సంపుటాలుగా తయారవటం పరమ జుగుప్సాకరం. తమ విశ్వసనీయతతో ప్రజా చైతన్య స్థాయి, ఆలోచనాశక్తి పెంపొందించటం బదులుగా ఎవరెలా ఆలోచించాలో, ఏం ఆలోచించాలో వీరే నిర్దేశించ యత్నించడం పరమ దుర్మార్గం.

బహుశా సమకాలీన మలిన పరిస్థితుల్ని ఏనాడో పసిగట్టడం వల్లనే విఖ్యాత భాషా, తత్వ, ఆర్థిక శాస్త్రవేత్త నామ్ చోమ్స్కీ 'మ్యానుఫ్యాక్చరింగ్ న్యూస్' అనే పదబంధాన్ని వెలుగులోకి తెచ్చాడు. 'వార్త పవిత్రం – వ్యాఖ్య నీ ఇష్టం' అంటూ ఉంటారు. ఇప్పుడు వార్త కూడా ఎవరిష్టం వారిది అయింది. ఈ నేపథ్యంలో వార్త విశ్వసనీయతను కోల్పోయింది. రాజకీయాలకు పర్యాయపదం ఐపోయింది. చదివి/ చూసి ప్రత్యేక/ మీడియాలకు అనుగుణంగా వ్యక్తిని అంచనా వేసే దుస్థితిలో ఉంది సమాజం. ఇది దీర్ఘకాలంలో ఆయా మీడియా అస్తిత్వానికే సవాల్ లాంటిది. ఒకసారి కోల్పోయిన విశ్వసనీయత 'నాన్నా, పులి' కథలో లాగా తర్వాత ఎంత నిజం చెప్పినా నమ్మే స్థితిలో ప్రజలు ఉండరు. ఇప్పటికే తగ్గిపోయారు. 'చేతులు కాదు ఒళ్లంతా కాలిన తర్వాత' ఏమి పట్టుకున్నా నిరుపయోగం. ప్రజల విజ్ఞతను తక్కువగా అంచనా వేసే వారు ఎంతటి మహామహులైనా వారి అంచనాలు తలకిందులు కాక తప్పదు. ఇది ఇప్పటికే అనేకసార్లు నిరూపితమైంది.

ఇటీవల జాతీయ మీడియా పేరుతో సంపాదకీయాలను కొన్ని పత్రికలు ప్రస్తావించాయి. వాటిలో ఒకటి 'వ్యాపార' పత్రిక. అది ఎవరి కొరకు, ఎందుకోసం అనేది దాని పేరులోనే ఉంది. అది ఏమి రాస్తుందో సహజంగానే తెలుస్తుంది. ఈ వ్యాపార పత్రికతో పాటు మరో పత్రిక సంపాదకీయాలు కూడా పైన ప్రస్తావించని ప్రమాణాల దరిదాపుల్లోకి రావు. వాటికి గతంలో ఏమైనా గౌరవం ఉంటే ఇప్పుడు అది పూర్తిగా కుదించుకుపోవడం అవుతుంది. అవి ఏమాత్రం స్థానిక వాస్తవాలను, ఇక్కడ ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకపోవటం శోచనీయం. వీటి వెనుక ఎలాంటి ప్రలోభాలు ఉన్నాయో వారికే తెలియాలి. వాస్తవాలు ఎప్పటికీ వాస్తవాలే. కానివి కానివే. ఎంత గుండెలు బాదుకున్నా సత్యాలు అసత్యాలు కావు. ఎలాగూ తెలుస్తుంది 'నిజం నిలకడ మీద'.

ఏదైనా, ఎప్పుడైనా విజ్ఞత గల వారు ఏ విషయంలోనైనా స్పష్టతకు, సదవగాహన కొరకు సంపాదకీయాలను పరిగణనలోకి తీసుకుంటారు, స్థల కాలాలకు అతీతంగా. విషయం ఏదైనా, పరిధి ఎంతటిదైనా సంపాదకీయాలకు మనిషి కేంద్రం. మానవీయత సూత్రం కావాలి. అందుకు బుద్ధుడు ప్రవచించిన 'కరుణ' ముఖ్యం అవ్వాలి. గాంధీ తొలుత తలచిన 'దైవమే సత్యం నుంచి చివరకు చేరిన' సత్యమే దైవం' లాంటి 'సత్యం' ఒక్కటే అన్నింటా, అన్ని వేళలా ప్రజాహితం రీత్యా పరమావధి కావాలి. ఈ విషయంలో తెలుగువారైన ఎం.చలపతిరావు, సి.వై.చింతామణి, కాటమరాజు సోదరులు లాంటి వారు అనేకులు జాతీయ పత్రికల్లోనూ ఉత్తమ ప్రమాణాలు పాటించి జాతికి గర్వకారణంగా నిలిచారు. ముట్నూరి కృష్ణారావు గారు తన, పర తేడాలు లేకుండా విషయ ప్రాధాన్యతతో రాయటం చిరస్మరణీయం. నూతన పద సృష్టికర్తగా, మేధాసంపన్నునిగా, హేతువాదిగా ఎంతో విశిష్టతను కలిగి ఉన్నారు 'నార్ల'. తమిళంలో తుగ్లక్ పత్రిక ప్రారంభం నుంచి వినూత్నంగా నడిపిన 'చొ' రామస్వామి 'పత్రికలది ఎల్లప్పుడూ ప్రతిపక్షమే' అని కర్తవ్యం బోధించేవారు.

విశ్వాసాల ప్రాతిపదికన ఏర్పడిన పత్రికల పరమార్థం, లక్ష్యాలు స్పష్టంగా ఉంటాయి. వాటికి వనరులు, ప్రోత్సాహకాలు పరిమితంగా ఉంటాయి. అంత ఒత్తిడిలోనూ వాటిలో కొన్ని విలువలకు కట్టుబడి ఉంటాయి. మరికొన్ని అగ్ర పత్రికలుగా చలామణి అవుతూ నిత్యం 'సూక్తి ముక్తావళి' ప్రబోధిస్తూ ద్వంద్వ ప్రమాణాలు పాటించటం అభ్యంతరకరం. వీరికి ఒకే పని ఒకరు చేస్తే 'ఒప్పు'. మరొకరు చేస్తే 'తప్పు'. ఇది విజ్ఞులకే కాదు సామాన్యులకీ రోత పుట్టిస్తోంది.

మద్యపాన నిషేధం, నేతల మాటలపై స్పందనలు, అధికార మార్పిడి, మండలి రద్దు, పాలన తీరు, ప్రజాభిప్రాయం వగైరాలు అనేకం మీడియా తీరుకు 'ముంజేతి కంకణంలా' ప్రబల నిదర్శనాలు. వీరు ఎవరి మేలుకై ఇవి, ఇలాంటివి చేస్తున్నారో, అవి ఎంతవరకు సఫలం అవుతాయో కానీ వీరి పట్ల విశ్వసనీయత పూర్తిగా మంట కలిసి పోయింది. పైగా వీడియోల పుణ్యమా అని ఎవరు ఎవరిని అదరగండంగా బుకాయించడం కుదరదు ఇక. 'అరటిపండు వలిచి పెట్టినట్లు' ఎంతో తేలికగా ప్రతి దానిలో 'అప్పుడలా– ఇప్పుడిలా' అని కళ్ళకు కట్టిస్తుంది వీడియో.

ఇంగిత జ్ఞానం వల్ల ఎవరైనా వీటిని బేరీజు వేసుకుని తగిన అంచనాకు వస్తారు.

పత్రికల తలమానికమైన సంపాదకీయం రాయడం అంత సులువు కాదు. సంబంధిత అంశానికి తగిన సమాచారం లభ్యం అవ్వాలి. సంపాదకవర్గంలో దానికి న్యాయం చేయగల సమర్థులు ఉండాలి. న్యాయం, చట్టం, ప్రజా ప్రయోజనాలనీ, పర్యవసానాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. అన్నింటా జనహితంతో పాటు పత్రిక ప్రమాణాలను, నైతికతను, ప్రతిష్టను కాపాడగలగాలి. మానవ, సామాజిక, నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వరాదు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా గతంలో ఇదే అంశంపై పత్రిక నిబద్ధతకు, విశ్వ మానవ శ్రేయస్సుకు అనుగుణంగా ఉండాలి. అపార సంయమనంతో, ఉద్విగ్న రహిత సమన్వయంతో ఎల్లప్పుడూ విశ్లేషణ చేయగల స్థితప్రజ్ఞత అవసరం. అక్షరాల్లో దీనికి సునిశిత మేధాశక్తితో పాటు రాగద్వేషాలకు అతీతమైన స్పందన ఉంటేనే మనిషి హృదయాన్ని అర్థం చేసుకోగలిగేది. అక్షరాల్లో వారి ఆర్తిని ప్రతిబింబించ గలిగేది.

సంపాదకీయానికి సంక్షిప్తత ప్రధానం. ఇది పెరిగే కొలదీ సాంద్రత పెరుగుతుంది. రెండూ పెరగడంతో చదువరికి సంక్లిష్టత తప్పదు. సంపాదకునికి ఎంచుకున్న అంశంపై సమగ్ర విషయ పరిజ్ఞానంతో పాటు భాష పైన, పారిభాషిక పదాలపైనా పట్టు ఉండాలి. ఈ రెండింటికి నిరంతర అధ్యయనం తప్పనిసరి. వీటితో వారు నిజంగానే వృత్తిపర ప్రతిభా సామర్థ్యంతో పాటు సమున్నత వ్యక్తిత్వం కలిగి ఉంటారు. వీటి ప్రాధాన్యత గల చోట్ల గుర్తింపుతో రాణిస్తారు. తమతో పాటు పత్రిక స్థాయిని పెంచుతారు. అందుకు విరుద్ధమైనచోట నిత్యం ఘర్షణకు లోనై నలిగిపోతారు. ఇవి చాలవన్నట్లు పత్రికల మంచిచెడ్డలు సంపాదకునికి ఆపాదిస్తారు. కాబట్టి దానికి సంబంధించిన బాధ్యతలు నిర్వహించక తప్పదు. పలు విధాల పరిధులు, పరిమితులు, ఒత్తిళ్లకు లోబడి విద్యుక్త ధర్మం నిర్వహించటం 'హెర్క్యులస్' పని లాంటిది.

సమాజంలో ఏకకాలంలో నాలుగైదు తరాలు కలిసి జీవిస్తూ ఉంటాయి. తరం తరం నడుమ అంతరం ఉంటుంది. ఏ తరానికి ఆ తరం తనదైన తీరులో మారుతుంటుంది. ప్రవర్తిస్తుంటుంది. వీటిలో సానుకూలతలు, ప్రతికూలతలు ఉంటాయి. వీటన్నిటినీ మీడియాలో తగు రీతిలో ప్రతిబింబించగలగాలి. ఇప్పుడు వ్యాపార మీడియా రాజకీయాల్లో ప్రవేశించి శాసిస్తోంది. పరస్పర ప్రయోజనాలు కాపాడుకోవడంలో ప్రజల శ్రేయస్సును ఫణంగా పెడుతుంది. వీటిని వెలికితీసి బహిరంగ పరచగలిగిన వికీలీక్స్' స్నోడెన్', తెహెల్కా లాంటివారికి ప్రజల ప్రోత్సాహం ఎంతవరకూ అందుతున్నదీ ప్రశ్నార్థకమే!

అంతటా ఉన్నట్లే పత్రికల్లోనూ కొన్ని విలువలకు, ప్రజాప్రయోజనాలకు కృషి సల్పేవి ఉంటాయి. అమెరికాలో' న్యూయార్క్ టైమ్స్' చదువరుల కోసం ఇటీవల ఒక చిరు పొత్తం విడుదల చేసింది. దాని పేరు 'ఉండర్స్టాండింగ్ ది టైమ్స్'. ఇందులో ఆయా అంశాలపై వారు పాటించే ప్రమాణాలు ఏ రీతిలో ఉంటాయో సోదాహరణగా ఇచ్చారు. ఇందులో తొలి వాక్యం 'న్యూయార్క్ టైమ్స్ పొరపాటు చేసినట్లు నిర్ధారణ అయితే వెంటనే సరిదిద్దుకోగలదు'. ఈ ధోరణి మీడియా మొత్తానికి ఆదర్శప్రాయం. మన దేశంలో 'ది హిందూ' పత్రిక 'రీడర్స్ ఎడిటర్' పేరుతో కొంత కాలంగా సమర్థమైన వారితో కాలమ్ నిర్వహిస్తోంది. ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంది. సంపాదకీయాలు, వ్యాసాలతో పాటు వార్తల ప్రచురణ తీరును ఎవరైనా ప్రశ్నించవచ్చు. సందేహ నివృత్తికి ఇది మంచి వేదికగా రూపొందింది. ఈ నమూనా మిగతా పత్రికలకీ మార్గదర్శకం కావాలి. ఇందుకు సంపాదకుల సమర్థతతో పాటు యజమాని చిత్తశుద్ధి, వారికి ప్రమాణాలు, విలువలు, నైతికత, సమాజ పురోగతి పట్ల, భావితరాల పట్ల అంకితభావం ఉండటం ముఖ్యం.

కొన్ని పత్రికలు 'తా పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు' అన్నట్లు కొందరికి కొమ్ము కాచి నెత్తిన పెట్టుకొని కొలవటం, మరికొందరిని అయిన దానికి కాని దానికి దుమ్మెత్తి పోయటం పరిపాటి అయింది. లాభార్జనే ఏకైక లక్ష్యంగా పత్రిక ప్రమాణాలను పాతాళానికి తొక్కేస్తున్నారు. 'నల్లమేక – నలుగురు దొంగలు' కథలో దొంగలు నడిపిన కుట్రకు ఇది కొనసాగింపన్నమాట! ప్రజలు ఎంతో జాగరూకతతో ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. తమ అపార విజ్ఞతతో ఎప్పటికప్పుడు ఎన్నికల్లో గుణపాఠాలు నేర్పుతూనే ఉన్నారు. సంపాదకీయాల పేరుతో వస్తున్న సంపద'కీయాలనీ, 'సం' పదకీయాలని నిశితంగా గమనిస్తున్నట్లు రుజువు చేశారు. ఇక ముందు చేస్తూనే ఉంటారు. అక్షర దీపాలతో జనజీవనంలో చైతన్య కాంతులు వెదజల్లి చీకట్లను పటాపంచలు చేయాల్సిన సంపాదకీయం ఇలా దిగజారిపోవడం బాధాకరం. ముమ్ముందు అయినా గతంలో మన పెద్దలు నెలకొల్పిన విలువల బాటలో నడపాలని ఆశిద్దాం! ■

## కవిత

## అరుగు

- చొక్కర తాతారావు
63011 92215



ఆ అరుగు నాకు బోధివృక్షం కన్న గొప్పది
ఎందుకంటే ఆ అరుగు మా అమ్మ కూర్చునే చోటు
ఆ అరుగు మీంచే అమ్మ నాకు జీవిత పాఠాలు నేర్పింది
ఉన్నంతలో లేనివాళ్ళకు సాయం చేయమని
అమ్మ నాకు అక్కడే చెప్పింది
ఆ అరుగు నా బాల్యానికి ఆనవాలు
ఆ అరుగు మీదే నా బాల్యం చిగురించింది
అక్కడే అమ్మ నాకు పాలిచ్చేది
అన్నం తినిపించేది కథలు చెప్పేది
లోకమంటే ఏమిటో తెలిసేట్టు చేసింది
అల్లరి చేస్తే రెండు కొట్టి అదే అరుగు మీద పడుకోబెట్టేది
రోజంతా ఇంటి పని చేసి అలసిపోయినప్పుడు
అదే అరుగుమీద అమ్మ మౌనంగా కూర్చునేది
శ్రీశ్రీ కవిత్వం రావిశాస్త్రి కథలు ఆ అరుగు మీదే చదివాను
ఆసుపత్రిలో నాన్న చనిపోయాడని తెలిసిన రోజున
అమ్మ నన్ను దగ్గరకు తీసుకుని మీ నాన్న ఇక లేడురా అని
గుండెలవిసేలా ఏడవడం నాకు బాగా గుర్తు
అంత తొందరగా ఓ జ్ఞాపకంలా
నాన్న మిగిలిపోతాడని అమ్మ అనుకోలేదు!

ఆరోజునుండి అమ్మ మాకోసం
అదే అరుగు మీద ప్రణాళికలు వేసింది
మమ్మల్ని ప్రయోజకుల్ని చేసింది
కాలం అప్పుడే నా కంట్లో మన్ను పోస్తుందనుకోలేదు
ఆరోజు ఉదయం అమ్మ నావైపు జాలిగా చూస్తూ
అదే అరుగుమీద నా చేతుల్లో తుది శ్వాస విడిచింది!
ఎందరు ఓదార్చినా అమ్మలేని లోటు తీరేది కాదు
అక్కడ ఎంతమంది కూర్చున్నా
అమ్మలేని ఆ అరుగు నాకు శూన్యంగా కనబడేది
జీవితాలు విశాలమయ్యే కొద్ది ప్రదేశాలు ఇరుకవుతాయి
ఇప్పుడు అక్కడ అరుగు లేదు
ఆ స్థానంలో డైనింగ్ టేబుల్ వచ్చింది
నేను భోజనానికి కూర్చున్నప్పుడు
అమ్మ నాకు అన్నం తినిపించినట్టే ఉంటుంది
ఇంట్లో సోఫాలో కూర్చుని ఉన్నప్పుడు
అమ్మతో కలిసి అరుగుమీద కూర్చున్నట్టుంటుంది
అరుగు ఇంటికి సింహాసనం
నాకంటికి ఆ అరుగు బోధివృక్షం!


## ఖాళీ అధ్యాయాలు

మనసుకి మనసుకి ముడి పడే ఓ అధ్యాయం
తనువుకి తపనకి నలుగుతూ అనువదించలేని అక్షరాలు
గొంతు పొరల్లో చిక్కుకున్న మనసు భాష్యాలు
హృదయపు గోడల మధ్య
అవగతంకాని అంతరంగపు ఆలోచనలు
కన్నీటి చుక్కలై రాలిపడే భావాలు
ఏ కంటికి కనిపించని వినిపించని
నిర్జీవమైన భారాలు
అక్షరాలతో విప్పి చెప్పలేని ఆశయాలు
కన్నీటి చుక్కలుగా రాలిపడే హృదయ గాయాలు

సతమతమైన జ్ఞాపకాలతో
పూరించలేని ఖాళీ అధ్యాయపు పుటల్లో
అక్షరంగా మలచలేని మౌన భావాలు
మనసు అధ్యయనం చేయలేనివే..
ఈ ఖాళీ అధ్యాయాలు!

- స్వప్న మేకల
90522 21870

## సమీక్ష




# కరోనా కాలాన్ని రికార్డు చేసిన కవిత్వం

**- పుట్టి గిరిధర్**
94914 93170

**"ఇయ్యాల**
**తుమ్ములు దగ్గులు**
**మానవాళిని మట్టుబెట్టే శతఘ్నులు**
**అపరిశుభ్రత అంటుకోవడం**
**దేశదేశాల్ని బూడ్డి చేస్తున్న అణుబాంబులు**
**ప్రకృతిని కాలదన్నితే**
**వికృతి ఇచ్చిన కానుకనే ఈ కరోనా!" – వనపట్ల**

కనబడని కరోనాతో మనిషి చేసే యుద్ధంలో మనం ఎలా నాశనం అయ్యామనే విషయం నేడు అందరికీ అవగతం అయ్యింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ధైర్యం నూరిపోసేవాళ్ళు కావాలి. అటువంటి ధైర్యాన్ని కవిత్వ రూపంలో అందిస్తూ కవులు తమ బాధ్యతను తీసుకున్నారు. తమ అక్షరాలకు పదునుపెట్టి ఎన్నో కవితలను రాశారు. కొందరు కవితా సంపుటాలను కూడా తీసుకువచ్చారు. వారి బాధను, ఆవేదనను, ఆలోచనలను అక్షరబద్ధం చేశారు. అందులో భాగంగా తోట సుభాషిణి 'క్రిమిసంహారిణి' సంకలనం, బిల్లా మహేందర్ "వలసదుఃఖం" సంకలనం, డా. పత్తిపాక మోహన్ "లాక్ డౌన్" నానీలు, ఎన్.గోపీ "ప్రపంచీకరోనా" కవిత్వం, కోట్ల వెంకటేశ్వర రెడ్డి "గడప దాటని యుద్ధం" నానీలు, నల్లెల్ల రాజయ్య "దుఃఖ పాదం" సంకలనం, నందిని సిధారెడ్డి "అనిమేష" కవిత్వం మొదలైనవి. ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య గారి నుంచి వచ్చిన "సెల్ఫ్ లాక్ డౌన్" కవిత్వం కూడా అందులో ఒకటి. వొల్లెడ, మశాల్, ఊర చెరువు, కుర్చీ, జనశంకరుడు, తడి, తెలంగాణ తేనె పలుకు వంటి కవితా సంపుటాలను అందించిన కవి ఇప్పుడు "సెల్ఫ్ లాక్ డౌన్"తో ముందుకొచ్చారు.

**"గొంగడి / నీ పాటల్ని భుజానేసుకొని బయలుదేరింది ప్రజా గీతాలుగా ఉదయించడానికి!"**

**"పారే ఏరులో నీ పాటుంది/ మండే ఉద్యమంలో నీ మాటుంది/ నీ అడుగులో అడుగును ఎత్తుకోవటమే/ నిజమైన నివాళి!"**

ఈ కరోనా చిన్నా పెద్దా, పేద ధనిక తేడా లేకుండా ఎందరినో బలి తీసుకుంది. అనుకోని మరణాలకు మనం ఎంతో బాధపడ్డాం. ఈ సంపుటిలో మొదటనే ప్రజా గాయకుడు నిసార్, ఉద్యమాల ఉపాధ్యాయుడు ఉ .సాంబశివరావు, ఫొటోగ్రాఫర్ గోవిందు గార్లకు నివాళిగా కవితలు ఉన్నాయి. ప్రజలకు ఆపదలు ఏమీ కొత్త కావు. కానీ ఈ ఆధునిక కాలంలో కూడా ఇంతటి విషాద పరిస్థితులకు గురౌతామని ఎవరమూ ఊహించలేదు. ఎన్ని ఇబ్బందులెదురైనా వాటిని దాటే శక్తి మనకుందని అనుకునేవాళ్ళం. అది నిజం కాదని ఇప్పుడు అర్థమయ్యింది. అందుకే ఇప్పుడు "క్రీస్తు పూర్వం క్రీస్తు శకం కాదు; కరోనా పూర్వం కరోనా శకం!" అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మనుషులే కాదు దేశ దేశాలన్నీ ఆర్థికంగా కృంగిపోయాయి.

జనతా కర్ఫ్యూ మొదలుకొని లాక్ డౌన్ నుంచి లాక్ డౌన్ ఎత్తేశాక నేటి ప్రస్తుత పరిస్థితుల దాకా ఒక్కో దశలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను, అనుభవాలను ఒక దగ్గర చేర్చి, మనసు పడే వేదనను ప్రజలకు, నాయకులకు చెప్పాలనే తపనతో అందరి బాధ్యతను గుర్తుచేస్తూ ఈ కవిత్వం వెలువరించారు. ఇందులో

మొత్తం 56 కవితలు ఉన్నాయి. ఈ కవితలకు శీర్షికలు లేకుంటే మరో దీర్ఘ కావ్యమయ్యేది.

జనతా కర్ఫ్యూతో కరోనాను ఎదుర్కొనే బాధ్యతతో మొదలవుతుంది కవిత్వం. లాక్ డౌన్ కాలంలో పిల్లలతో, ఆటలతో, పుస్తకాలతో, టీవీతో కాలాన్ని వెళ్లదీయడం బాగానే ఉంది కానీ పక్కింట్లోనో, ఎదురింట్లోనో కరోనా సోకితే ఎలా ఆందోళన పొందామో అలాంటి మానసిక స్థితులను "స్వీయ నియంత్రణ" కవితలో వివరించారు. పని చేసుకుని బతికేటోళ్లకు రోజు వచ్చే సంపాదనే ఆధారం. లేదంటే పస్తులే ఉండాల్సి వస్తుంది. కవి స్వయంగా క్షురకుడు కాబట్టి క్షౌరశాల తెరవకపోతే ఇంట్లో పరిస్థితి ఎలా ఉంటుందో తెరిస్తే బయట పరిస్థితి ఎలా ఉంటుందో అనుభవంతో చెపుతారు.

**"చిలుకొయ్యకు తగిలిచ్చిన తాళాలడుగుతున్నవి**
**నన్ను మర్చిపోయినవా ఏందని**
**తాళాలకు కూడా యాష్టకొచ్చిందేమో!"** అంటూ ఎప్పుడు దుకాణం తెరవాలి, ఎప్పుడు మళ్లీ మామూలు జీవితాన్ని గడపాలో అనే సంవేదనను ఎరుకపరుస్తారు.

లాక్‌డౌన్‌తో నష్టం ఎక్కువగా జరిగింది మాత్రం పేదవారికే. అలా కూలబడిన బడుగు జీవుల బతుకు దుఃఖగీతాన్ని "ఆకలి గీతం" కవితలో ఎంతో ఆవేదనతో వర్ణిస్తారు. ఈ కవిత ఈ సంపుటికి మకుటంగా నిలుస్తుంది. ఇందులో అన్ని రకాల వృత్తులను, వారి బాధలను చూపిస్తారు. సకల వృత్తుల సమాహార దుఃఖమే ఈ ఆకలి గీతం.

**"పనే జీవనాధారం తిరిగమ్మే కాలి కడుపులు**
**నలభై దినాలు కూలీలేక వొట్టి చాపల్లా నిర్జీవాలు**
**స్వీయ నిర్బంధంలో స్వీయ దుఃఖాలు**
**పేదల బతుకులపై కమ్ముకున్న మేఘాలు"**

కూలీల ఆకలిగీతం లాక్ డౌన్‌తో బతుకు దుఃఖగీతమైనట్లు అభివర్ణిస్తారు.

**"ఇదుపున ఇల్లు లేనోళ్లు/ పని సాగుతేనే బతుకు సాగుతది**
**పనాగుతే గుండెలాగుతవి"**

చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారుల దీనగాథను కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు. కరోనా కాలంలో వచ్చిన పండుగలన్నీ గుర్తుచేస్తూ, అన్నీ కరోనా వెళ్ళాక చేసుకుందామని,

**"చెల్లెమ్మా!/ ఈసారి ఉగాది పండుగ లేదు**
**అనంత దుఃఖంలో ఊరు.../ మళ్లొచ్చే ఉగాది బొబ్రాయి కాదనే సకల వంటలతో/ సామూహికంగా చేసుకుందాం"** అంటూ తోబుట్టువులను పండుగలకు కూడా పిలుచుకునే అవకాశం లేదని వాపోతారు. ఎన్నడూ ఎరగని పరిస్థితులు కరోనా కాలంలో ఇంట్లో మగవాళ్లకు కూడా ఎదురయ్యాయి. ఇంటి పని, వంట పని చేసే అవకాశం లభించింది.

**"పొరుకాట చేతబడితే/ నలభై ఏళ్ల నొప్పి తెలిసింది"**
**"వంట చెయ్యటమంటే/ టపటప కవిత్వం రాసినట్లు కాదు**
**సరిహద్దులో సిపాయి నిఘాలా/ కళ్ళన్నీ పొయ్యికాడనే"** ఉండాలనే అనుభవాన్ని కవిత్వీకరిస్తారు. ఇల్లాలి పని ఎంత కష్టమో తెలిసొచ్చిందని చెబుతారు.

కరోనా కాలంలో వైద్యులు, నర్సులు, పోలీసులు, కార్మికులు, జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమైంది.

**"భూగోళమంతా ఆకులా ముడుసుకొని/ తలుపులకు తాళాలేసుకుంటే/ గుండెల గుండీలిప్పి చేతులు చాచి/ చికిత్సలం దిస్తున్న మహనీయులు వైద్యులు"** అంటూ దేవుళ్లకన్నా ఇప్పుడు వైద్యులే ముఖ్యమని చెబుతారు.

కార్మికుల సేవను గుర్తుచేసుకుంటూ

**"వాళ్ళు/ ఈ దేశానికి గుండెకాయలు**
**మనం సుఖిస్తున్నదంతా/ వాళ్ళ చెమట సౌందర్యమే**
**మన పన్నీరంతా వాళ్ళ కన్నీరే/ వాళ్ళు లేని అభివృద్ధి నీటు లేని నది/ వాళ్ళు జాతీయ పతాకం"**గా చెబుతారు.

అలాగే రైతుల బాధను చెబుతూ – **"ఏ యుద్ధం జరిగినా/ మొదటి దుఃఖం వాళ్లదే/ ఏ విపత్తు కళ్ళు తెరిచినా/ మునిగిపోయేది తొల్త రైతులే"** అంటారు.

లాక్ డౌన్ కాలంలో సంతోషించదగ్గ ఒకే ఒక విషయం ఏమిటంటే కాలుష్యం తగ్గడం. పక్షులు, జంతువులకు కావలసినంత స్వేచ్ఛ, స్వచ్ఛత దొరకడంలాంటి విషయాలను "అడవి పక్షుల దర్బార్"లో అడవి జంతువుల జీవితాన్ని వర్ణిస్తారు.

కరోనా కాలంలో సగటు మనిషి ప్రతిస్పందనే ఈ కవిత్వం. భాషలో, యాసలో అదే ప్రతిబింబిస్తుంది. ఒక్కోసారి కవిత్వం పాళ్లు తగ్గినట్లు అనిపించినా చెప్పే విషయాన్ని బట్టి, నడక తీరును బట్టి అది బయటకు కనిపించదు. ఒకే వస్తువు కావడం వల్ల పునరుక్తులు దొర్లినా నేటి సమాజాన్ని, ప్రజల మానసిక రూపాన్ని ఎన్నిసార్లు చెప్పినా సరిపోదు.

**'ప్రభువులారా!/ ఇకనైనా మేల్కోండి**
**మతాల పంతాలనొదిలి/ ఆరోగ్య విత్తనాలు నాటండి**
**అన్నిటికీ దేశభక్తే జండూబామ్ కాదు'** మనుషులుగా మిగలాలంటే ఆరోగ్యమే మహాభాగ్యమని" కవి నినదించారు. ■

# పొలాల్లోంచి ...

- రవి నన్నపనేని
91821 81390

బయటకి వస్తారు
ఇలానే
బైటాయిస్తారు

పొలాల్లో మనుషులు
పీఠాలు  కదిలి పోయేట్టు
మహా ప్రవాహాలౌతారు

గుప్పెడు మట్టిలోంచి
మృదువైన మెతుకులే కాదు
దృఢమైన పిడికిళ్లు పూయిస్తారు

వానకు నాని
ఎండకు ఎండి
కడుపు మండి
అగ్గి జ్వలిస్తారు
అంతటా అంటుకుంటారు

పొలాల్లో మనుషులే !
హోరు గాలై వీర యోధులై
దారి పొడుగునా కదం తొక్కుతారు
బయటకు వస్తారు
బహిరంగ సభ నిర్వహిస్తారు



దేశం చాకిరి పిట్టలది
దేశం శ్రమ జీవులైన ప్రజలది
పరాన్నజీవి కాని ప్రతి మనిషిది !

పొలాల్లో మనుషులు
జీవితం కోసం
పట్టణ వీధుల్లో రెపరెపలాడతారు
రాజధానిలో ఎలుగెత్తుతారు
ఇలానే
చట్టం వెనుక క్షుద్ర చర్యని ప్రశ్నిస్తారు
వాళ్లకు వాళ్లే  తెలుసుకుంటారు
రేపో మాపో తేల్చుకుంటారు ■

---

## అఖిలాశ పురస్కారానికి కవితా సంపుటాల ఆహ్వానం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కవులు తమ కవితా సంపుటాలను అఖిలాశ జాతీయ పురస్కారం-2021 కోసం ఆహ్వానిస్తున్నాం. ఈ ఏడాది నుంచే ఈ పురస్కారం ఇవ్వడానికి నిర్ణయించాం కనుక 2020 డిసెంబర్ వరకూ ముద్రించబడిన కవితా సంపుటాలు పోటీకి పంపవచ్చు. వచన కవితా సంపుటాలు మాత్రమే పంపాలి. అనువాద కవితా సంపుటాలు కూడా పంపవచ్చు. నాలుగు ప్రతులను పంపాల్సి ఉంటుంది. కవులు తాము ముద్రించిన అన్ని కవితా సంపుటాలూ పంపవచ్చు. విజేతకు రూ.10,000ల నగదు బహుమతి, జ్ఞాపిక అందజేయడం జరుగుతుంది. పుస్తకాలు పంపపటానికి చివరి తేదీ : ఏప్రిల్ 15, 2021. **పుస్తకాలు పంపాల్సిన చిరునామా :** TAKKEDASILA JOHNY, NO: 9, CHENNA KESHAVA NILAYA, VENKATAPURA 6TH CROSS, KORAMANGALA 1ST BLOCK, OPPOSITE ARYAS BAKERY, BENGALURU-560034, KARNATAKA, INDIA. **ఫోన్లు:** 72595 11956, 94919 77190. akhilaasha.writer@gmail.com

**– జాని తక్కెడశిల**
**ప్రతిలిపి తెలుగు వెబ్సైట్ మేనేజర్**



# కోడలు కాదు; కూతురు

- ఆర్‌సి కృష్ణస్వామి రాజు
93936 62821

'మేము ఏ పాపం చేసినామని భగవంతుడా.. మాకు ఇన్ని కష్టాలు పెట్టావు. బంగారంలాంటి సంబంధమని అయినవాళ్లు అందరూ చెబితే ఆశ పడి చేసుకున్నాము. మా నోటిన మట్టి కొట్టినావు భగవంతుడా.. పగవాడికి కూడా వద్దు, ఈ కష్టాలు" అని వాపోతున్నారు నీరజ అమ్మనాన్న. నీరజ మూలగా కూర్చుని గోడ మూలన ఉన్న సాలెగూడుకేసి చూస్తూ ఉంది. ఆమెకు తెలియకనే కన్నీళ్లు జలజలా రాలుతున్నాయి.

ఆటో ఆగిన శబ్దం వినిపిస్తే కిటికీ తెరిచి చూశారు. రామకృష్ణ అమ్మనాన్నలు ఆటో దిగి ఇంటి గేటు తీస్తున్నారు. నీరజ అమ్మనాన్నల మదిలో వందల ఆలోచనలు.. "ఎందుకు వస్తున్నారు వీళ్ళు? జరిగింది చాలదా? వారి నీడను చూడాలన్నా భయమేస్తోంది. గతాన్ని గుర్తు తెచ్చుకోవాలని లేదు. వచ్చిన వాళ్ళు వచ్చినట్లే వెళ్ళిపోతే బాగుణ్ణు. జరిగింది పీడ కల అనుకుని ఇప్పుడిప్పుడే కొత్త అడుగులు వేద్దామని ఉన్నాము. జరిగింది గుర్తు చేసి మళ్ళీ మనల్ని ఏడిపించడం ఎందుకు? తలుపు కొట్టినా తీయకూడదు. ఏమీ మాట్లాడకూడదు. వచ్చిన వాళ్ళను వచ్చినట్లే పంపించేద్దాం"

♦ ♦ ♦

నాలుగు నెలల క్రితం ...

ముచ్చటగా ముప్పై మంది సమక్షంలో కాణిపాకం గుడిలో పచ్చటి పందిరి కింద కళ్యాణం జరిగింది. పెళ్లికూతురు నీరజ పాల మీగడ చీరలో మిలమిలా మెరిసిపోతోంది. పెండ్లికొడుకు రామకృష్ణ పండువెన్నెల పంచె కట్టి ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు. చూసినోళ్లంతా 'భలే ఉంది ఈడు, జోడు' అని చెవులు కొరుక్కున్నారు. 'అమ్మాయి బిఎస్సీ, బీఈడీ చేసిందట. అబ్బాయి ఎంఏ, బీఈడీ చేసినాడు. ఎక్కడో ఒక చోట ఏదో ఒక బడిలో ఉద్యోగంలో చేరుతారు. వారి కాళ్ళ మీద వారు నిలబడతారు' అని చెప్పుకున్నారు. 'వీరి అమ్మనాన్నలు చేసేవి చిన్నచిన్న ఉద్యోగాలైనా పిల్లల్ని కష్టపడి బాగా చదివించారు' అని గుసగుసలాడారు.

'ఇక్కడి వినాయకుడి విగ్రహం రోజురోజుకీ పెరుగుతుందట కదా' అని ఆశ్చర్యంగా చెప్పుకుంటూ గుడికెళ్ళి దర్శనం చేసుకుని వచ్చారు. కొబ్బరి చెట్ల కింద గుండ్రంగా కూర్చుని గుడి ప్రసాదం తిన్నారు. కాణిపాకంలో పెండ్లి, ఊర్లో విందు కదా,గబగబా వెళ్లి ఊర్లోవాళ్ళకి భోజనాలు పెట్టాలి కదా అని అందరూ బస్సెక్కి రాయకృష్ణ ఊరికి బయలుదేరారు. బస్సు లో కూర్చున్న నీరజ నాన్న మొత్తం పెండ్లికి ఖర్చు ఎంతయ్యిందో లెక్క వేశాడు. అయిదు వేలు దాటనందుకు సంతోష పడ్డాడు.

ఊర్లో అమ్మలక్కలు పెండ్లికూతురు ఎలా ఉందో నని తొంగితొంగి చూసినారు. అభిమానంగా చూసే కళ్ళకు వారు హీరో హీరోయిన్లుగా అగుపించారు. కుళ్ళుబోతు కళ్లకు వారే విలన్లుగా అగుపించడంతో మూతులు మూడు వంకర్లు

తిప్పినారు. మొత్తం మీద ఊర్లో వారి చూపులకు వెంటనే దిష్టి తీయాలనుకుంది రామకృష్ణ అమ్మ.

చనువు కొద్దీ కొందరు ఆడపిలకాయలు పెండ్లికూతురు పట్టు చీర చిన్నగా తాకినారు. పెండ్లికూతురు నవ్విందని మరికొందరు పిలకాయలు దగ్గరిగా చేరి వేలు పట్టుకుని తీసుకెళ్లారు. ఇంటికి చేరిందే ఎర్రనీళ్ళ దిష్టి తీసి ఇంట్లో దేవుడి గదిలో కూర్చోబెట్టారు. అరటి పండు తినిపించి వేడి పాలు తాగించారు. వంట పనులు ఎలా జరుగుతున్నాయోనని రామకృష్ణ బయటికి వచ్చాడు.

ఇంటి పెరట్లో బియ్యం ఉడుకుతోంది. బియ్యం ఉడికే చోట రెండు షామియానాలు వేసినారు. నాలుగు మంచాలు,ఇరవై ప్లాస్టిక్ కుర్చీలు వేసినారు. సందిట్లో సడేమియాగా ఊరి కుక్కలు తోకలాడిస్తూ అల్లిబిల్లి తిరుగుతున్నాయి. మేమేమి తక్కువా అన్నట్లుగా పెంపుడు కోళ్లు ఒకచోటినుంచి మరొక చోటికి పరుగులు తీస్తున్నాయి.

'వండుతున్న అన్నం సరిపోతుందా' అని ఎవరో అడిగారు. వంటాయన నవ్వుతూ "వచ్చినోళ్ళకి భోజనం, వచ్చేవాళ్ళకి ఎసురు" అన్నాడు. అందరూ ఎగిరెగిరి నవ్వారు.

మునక్కాయ సాంబారు పొయ్యి మీద సెగలు కక్కుతోంది. మసాలా వడలు సలసల కాగే నూనెలో కుతకుతమని ఉడుకుతున్నాయి. ఉర్లగడ్డ తాళింపు వాసనలు ఆ చుట్టుపక్కల గుమాళిస్తున్నాయి. పలచటి మజ్జిగ పెద్ద చెంబులో పోసి ఉన్నారు. పక్కనే సత్తు చెంబులో జీడిపప్పు సేమియా పాయసం 'నన్నెప్పుడు తింటారు' అని అడుగుతున్నట్లుగా ఉంది. పచ్చటి పేపర్ ప్లేట్లు మిలమిలా మెరుస్తున్నాయి. పెద్ద వెదురు బుట్టలో పచ్చటి అరటి పండ్లు కళకళలాడుతున్నాయి. ఆకు, వక్క, సున్నం పక్కనే పెట్టి ఉన్నారు. ఊర్లోని జనం వచ్చి షామియానా కింద చేరినారు. సినిమా ముచ్చట్లు మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో వంటాయన "నీళ్లు సరిగా రావడం లేదు, కరెంటు మోటరు సరిగా పని చేస్తున్నట్లు లేదు. కొంచెం చూడకూడదా ఎవరైనా" అని గట్టిగా అరిచాడు.

వంటాయన అరుపులు విన్న రామకృష్ణ ముందూ వెనుకా చూడలేదు. పంచె ఎగ గట్టి పరుగులు తీసినాడు.

"పెండ్లి కొడకా, నువ్వెందుకు పరుగెత్తుతావు. మేము చూస్తాము కదా" అని మీసాలు అప్పుడప్పుడే మొలుస్తున్న పిలకాయలు వెనకనే పరుగులు తీసినారు. అరటి చెట్ల మధ్యన కొంచెం ఎత్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌కు మోటార్‌ను అమర్చి ఉన్నారు. రామకృష్ణ మోటర్‌ని రిపేరు చేద్దామని చూశాడు. ఉన్న అన్ని వైర్లూ సర్దినాడు. చివరిగా మోటార్‌ను ఆన్ చేసి పైపును పట్టుకున్నాడు. దానికి విద్యుత్తు సరఫరా కావడంతో షాక్ కొట్టింది.

'అమ్మా' అంటూ అరిచి గిలగిలా కొట్టుకుంటూ అరటి చెట్ల మీద పడినాడు. ఊర్లోని పిలకాయలు పరుగులు తీసి వీధి మొదట్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ని ఆఫ్ చేసినారు. అప్పటికే జరగరాని ఘోరం జరిగిపోయింది. ఊరి జనాల ముఖాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కోటి ఆశలు, కొంగొత్త కోరికలు, పెళ్లికూతురు మెట్టినింట అడుగు పెట్టే సమయం... ఆమె రోదన అంతా ఇంతా కాదు. అరచి అరచి కళ్ళు తిరిగి పడిపోయింది.

"నుదిటిన పెట్టిన బాసికం ఇంకా తీయనే లేదు, పసుపు పట్టువస్త్రాల తళతళ తగ్గలేదు. ఇంకా కాళ్ల పారాణి ఆరలేదు. కొబ్బరి కీతు పందిళ్ళ పచ్చదనం వాడలేదు. ద్వారాల దగ్గర కట్టిన అరటి గెలల అందం తగ్గలేదు. రంగురంగు దీపాల విద్యుత్తు దీపాల వెలుగులు ఇంకా ఆరలేదు. విధి చిన్న చూపు చూసింది. "అయ్యో, ఆడబిడ్డకు అన్యాయం జరిగిందే" అని బంధువులు 'ఓ' అని ఏడ్చినారు. తరలి వచ్చిన పక్క ఊరి వాళ్ళ మనస్సులో తీవ్ర విషాదం నెలకొంది. "లేవమంటే లేవడమ్మా రామకృష్ణ.. చెప్పకుండా పోయినాడు రామకృష్ణ" అంటూ బిడ్డ వైపు కాసేపు, ఆకాశం వైపు కాసేపు చూసి తల కొట్టుకుంటూ ఏడ్చింది రామకృష్ణ అమ్మ.

"నువ్వు లేని ఈ బతుకు నాకేల రామకృష్ణ. ఆ దేముడు, నీ బదులు నన్ను తీసుకెళ్ల రాదా .. రామకృష్ణ" అంటూ నెత్తీ నోరూ కొట్టుకుంది. "ఎవరి దృష్టానికి ఎవరు బాధ్యులు? తల కింద పెట్టి తపస్సు చేసినా పోయిన ప్రాణాలు తిరిగిరావు" అని అమ్మలక్కలు ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించినారు. అయినా ఆమె ఏడుపును నిలపడం ఎవరి తరమూ కాలేదు.

నీరజ అమ్మనాన్నలు గుమ్మడికాయల లెక్కన గుంభనంగా కూర్చున్నారు. కానీ, పొయ్యి మీద ఉడికే గుమ్మడి దబ్బల లెక్కన లోపల్లోపల ఉడికిపోయారు.

'అమ్మా, ఇంత దురదృష్టకరమైన సంఘటనను మీరు కానీ, పెండ్లికూతురు కానీ భరించడం చాలా కష్టం, తిన్నగా ఇంటికి వెళ్ళండి. మంచిచెడ్డలు నిదానంగా మాట్లాడుకోవచ్చు' అని వారి శ్రేయోభిలాషులు చెప్పడంతో నీరజ అమ్మనాన్నలు తిన్నగా నీరజను అక్కడినుంచి తీసుకుని వచ్చేసారు.

◆ ◆ ◆

రామకృష్ణ అమ్మనాన్నలు టక్‌టక్ మని తలుపు పైన కొడుతున్నారు. తీయకుంటే మర్యాదగా ఉండదని చిన్నగా తలుపు తీశారు.


వారిని చూసి వీరు, వీరిని చూసి వారు కన్నీళ్లు పెట్టుకున్నారు. సూది పడితే పెద్ద శబ్దంలా వినపడేంత నిశ్శబ్దం.

చిన్నగా గొంతు సవరించుకుని రామకృష్ణ నాన్న "జరిగిన దానికి మీరు కానీ మేము కానీ బాధ్యులము కాదు. అలా జరగాలని ఉంది కాబట్టి జరిగిందేమో. మేము మీ స్థానంలో ఉన్నా అంతే. మాకు ఉన్నది ఒక్కగానొక్క కొడుకు. వాడు బాగుండాలని వాడి వంశం అభివృద్ధిలోకి రావాలని వంద దేముళ్ళకు మొక్కిన వాళ్ళం. తినీ తినక వాడిని చదివించినాము. వాడు సుఖపడి మమ్మల్ని సుఖపెడతాడని అనుకున్నాము. కానీ జరగరానిది జరిగిపోయింది. ఇప్పటికైనా మించి పోయింది ఏమీ లేదు. చక్కగా అమ్మాయికి పెండ్లి చెయ్యండి. మీ వద్ద వున్నదంతా మొన్న జరిగిన పెండ్లికి ఖర్చు పెట్టి ఉంటారు. అది మేము గ్రహించగలము. మా రామకృష్ణ అయిదేళ్ల క్రితం టర్మ్ ఇన్సూరెన్సు పాలసీ పది లక్షలకు తీసుకున్నాడు. ఎన్ని ఇబ్బందులున్నా ప్రీమియంని టైమ్ కి కట్టేవాడు. ఇన్సూరెన్సు వారి ఫార్మాలిటీస్ పూర్తి అయ్యాక క్లెయిమ్ డబ్బులు మాకు నిన్ననే ముట్టాయి. మా అబ్బాయి చెమట చుక్కల చెక్కు ఇది. అది ఇద్దామనే వచ్చాము. సిరిసంపదలు ఉన్న వాళ్ళం కాదు కదా, ఈ పది లక్షల మొత్తం తప్పితే, మా కోడలికి మేము ఇంకేమి ఇచ్చుకోగలము? ఈ డబ్బు పూర్తిగా మీ అమ్మాయికే చెందాలి. దీనిలో పైసా కూడా మేము తీసుకోకూడదనుకున్నాము. దయచేసి తీసుకోండి. అమ్మాయికి సరైన జోడు చూసి పెండ్లి చేయండి. జరిగింది మరిచిపొండి. గతం గత: అని తెలిసిందే కదా. మాకు కూతురు ఉండి ఉంటే కూతురు ఎంతనో, కోడలు కూడా అంతే. మీ.. కాదు కాదు, మన కూతురి ఎడారి జీవితం నందనవనం కావాలి. మేము ఇంకెప్పుడూ మీ ఇంటి ఛాయలకు కూడా రాము" అంటూ చెక్కు తో పాటు పూలు పండ్లు పళ్లెంలో పెట్టి చేతికిచ్చారు.

నీరజ అమ్మానాన్నలకు కాళ్ళు చేతులు ఆడలేదు, నోట మాట రాలేదు. వారినే చూస్తూ ఉండిపోయారు. ఇక చేసేదేమీ లేక రామకృష్ణ అమ్మనాన్నలు పళ్లెం ను టేబిల్ పైన పెట్టి కళ్ళు తుడుచుకుంటూ చేతులెత్తి నమస్కరించినారు. ఇంటి బయట తాము నిలిపి ఉంచిన ఆటోలో ఎక్కి బయలుదేరారు. వారు వెళ్తున్న వైపే నీరజ అమ్మనాన్నలు కన్నార్పకుండా చూస్తున్నారు.

"అత్తమామలు వచ్చిన కోడళ్లను కూతుళ్లుగా భావించి కష్టసుఖాలు పంచుకుంటే సమస్యలే ఉండవు కదా" అని అనుకుంటూ కూతురి వైపు చూశారు. సాలెగూడు వైపే కన్నార్పకుండా చూస్తోంది నీరజ. ఆమె మనసు గడియారం లాగా టెక్ టెక్‌మని కొట్టుకుంటోంది.

■




అన్నవరపు రామస్వామి ఆశావాది ప్రకాశరావు




నిడమోలు సమతి కనకరాజు

## నలుగురు తెలుగు వారికి పద్మశ్రీలు

**ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం నలుగురికి పద్మ పురస్కారాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అన్నవరపు రామస్వామి, ఆశావాది ప్రకాశరావు, నిడుమోలు సుమతి; తెలంగాణకు చెందిన కనకరాజు ఈ పురస్కారాలను పొందారు. ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యానికి మరణానంతరం పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించారు.**

# నానీలు

- గాదిరాజు రంగరాజు

87901 22275

1

ఆత్మ విశ్వాసం
ఆమెకు ఊపిరైంది
అంధత్వాన్ని
జయించింది

2

మృణ్మయం పగిలింది
మరో రూపంలో
రూపాంతరం
చెందింది

3

పోరు సలిపే
నేత భరతం పట్టే
ప్రజల అండ తోడై
రైతు ఆశ తీరే

4

అత్తలో అమ్మ
అనురాగపు బొమ్మ
బంధాల కొమ్మ
అగుపించె ఆమెలో అమ్మ

5

కోడలే అత్తయింది
అవకాశం చిక్కింది
అత్త అమ్మయింది
ఎంత బాగుంది!

6

అత్తలో అమ్మను
నేను చూసాను
ఆమె కూతురుగా
నేను ప్రేమను పొందాను

7

ఇంటి విలువ తెలిసే
మనిషి సేవ దొరికే
కరోనా
మజాకానా...



8

అన్నం పెట్టే రైతుకు
సున్నం పెట్టారంటే...
గడ్డి పూసలు
నేతకు ఉరితాడే... ■

---

# అగ్గై రగులుతూ...

కోగిల చంద్రమౌళి


9573187218

అవును వాళ్లు
నెర్రెలు బారిన నేలకు
తలంటి తాపం తీర్చేటోల్లు
హలాలతో పాపిల్లు తీసి
పచ్చటి సింగారాలద్దేటోల్లు
పసిడి సిరులు పండించడం కోసం
తనువున స్వేదాన్ని మరిగించి
బతుకు బతుకంతా అరిగోస పడేటోల్లు..!
ఓ యేడు అతివృష్టి
మరో యేడు అనావృష్టి
పునాస గులాబి పురుగు
రబి నకిలీ ఎరువులు
ఏటికేడు ఆశల్ని చిత్తు చేసినా
దేశానికి అన్నం పెట్టడం కోసం
ప్రాణాల్నే పణంగా పెట్టేటోళ్ళు!
ఎండకు ఎండుతూ
వానకు తడుస్తూ
కాలాన్ని పసిగట్టి
పంటల అనుకూలతలను
వ్యూహ రచన చేసేటోల్లు!
ఏలినోడి నల్ల చట్టాల
కుట్రలెరుగకుంటరా..!
కమతాలను కాంట్రాక్టీకరించి
కల్లాలను దళారుల పాలుజేస్తే
అగ్గై రగులుతూ...
కవాతై కదలరా...?
అధికార పీఠాల్ని
దుక్కి చేయకుండా ఉంటారా? ■

## కవిత

# సబర్ కా ఫల్ మీఠా హోతా హై

- జె.బి
72595 11956



ఒంటరిగా మాట్లాడుకోవడం
కదులుతున్న దృశ్యాల ముందు

నన్ను నేను ఆవిష్కరించుకోవడం
మౌనచెట్టుపై మాటల రెక్కలు అల్లాడిస్తూ
ఒక సన్నని తీగ నుంచి
మాట రూపాంతరం చెందడానికి
గట్టు తెగిన మాట
నిర్మలంగా నాలో ఇంకిపోడానికి
ఇంకిపోయిన మాటను
పదే పదే నములుకుంటూ మురిసిపోవడానికి
మాట కట్టుకున్న పక్షి నోట్లోకి
ఒక గింజను విసరడానికి
నవ్వినప్పుడు ఏర్పడిన బుగ్గల లోయల్లో నుంచి
కాంతి కిరణాన్ని గుంజడానికి
బతుకులోకి రంగులను పులుముకోడానికి
ఒక చూపును
అటువైపు ప్రవహింప చేసి
ఇంకో చూపును
ఒంటరి గదిలో మొక్కలు మొక్కలుగా నాటి
వికసించిన పువ్వులపై
నవ్వులను ఏరుకోడానికి
మాట నుంచి మాటలోకి ప్రయాణించడానికి
అడుగుల కింద పోగైన
నాటి ఆకలి గీతాలను
విరహ వేదనలను, సలిపిన సందర్భాలను
విరిగిన సంఘటనలను, అమాయకపు ఆలోచనలను
మనసులో దాచుకోవడానికి
దాచుకున్న చీకటి మూటలను
మాటలు మాటలుగా బహిర్గతం చేయడానికి
విశాలమైన, నిగూఢమైన
ఎలాంటి పరిధులూ లేని ఓపిక కావాలి!

తప్పకుండా
ఆ వెన్నెల మాటల నడకలతో
ఆ గుమ్మం నుంచి ఈ గుమ్మంలోకి
వెలుగును మోసుకుంటూ

నా చూపుల దారుల్లో
చిరుదివ్వెలు వెలిగిస్తుంది
ఒంటరి అక్షరానికి జతై
పద పరిమళాన్ని సృష్టిస్తుంది

ఎవరికైనా ఏం కావాలి?
అక్షరానికి అక్షరం తోడైనట్లు
మనషికి మనిషి తోడవ్వాలి
కొన్ని మాటలు పోగు చేసి
పొయ్యిని అంటించాలి

ఇంతకూ అక్కడ ఉడుకుతున్నది
అన్నమా మాటలా? ఏదైతే ఏంటి?
రెండూ
శూన్యమైన నా కడుపును నింపేవే
కొండలపై నుంచి
జారే నీరు వృథా కాదు
అదొక సంగీతం
సంగీతానికి మాట కలపండి
కాకపోతే కాస్త ఓపిక పట్టండి
ఒకనాడు బతుకు మారు మ్రోగుతుంది

విశ్వం
తల వంచి నమస్కరిస్తుంది
అరే మేరే జాన్
ఫికిర్ మత్ కర్
సబర్ కా ఫల్ తేరే లియే బనా హువా హై! ■



# చాలా ప్రమాదకర ధోరణి ఇది!

**- ప్రొ॥ ప్రభాత్ పట్నాయక్**

**దే**శంలో రైతుల వ్యవసాయాన్ని తీసుకుపోయి కార్పొరేట్లకు సమర్పించడానికి తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాల రద్దు కోసం రైతులంతా పోరాడుతున్నారు. ఈ పోరాటంపై మోడీ ప్రభుత్వం తప్పుడు ప్రచారానికి పూనుకుంది. ఈ వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తున్నది కేవలం ఒక రెండు రాష్ట్రాల రైతులు మాత్రమేనని, తక్కిన రాష్ట్రాలలోని రైతులంతా ఈ చట్టాలను స్వాగతిస్తున్నారని ప్రచారం చేస్తోంది. దేశానికి ఓ మూలనున్న కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఒక ప్రత్యేక సమావేశం జరిపి ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ తీర్మానించడం కేంద్ర ప్రభుత్వ వాదన ఎంత బూటకమో తేల్చిచెప్పింది. తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి రైతులు ఇప్పటికే దేశ రాజధానిలో పోరాడుతున్న రైతులతో భుజం భుజం కలిపి ముందుకు నడుస్తున్నారు. ప్రభుత్వ వాదన మోసపూరితమని చాటి చెప్తున్నారు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఒకవేళ ప్రభుత్వం చెప్తున్నట్టు ఒకటో, రెండో రాష్ట్రాల రైతులు మాత్రమే ఈ చట్టాలను వ్యతిరేకిస్తే అప్పుడు ఈ చట్టాలను కేంద్ర ప్రభుత్వం జారీ చేయడం సరైనది అవుతుందా? మైనారిటీ రాష్ట్రాల రైతులు వ్యతిరేకిస్తున్నారు గనుక తాము చట్టాలను చేయడం సరైన చర్యే అన్నది కేంద్రం వాదన. ఇది చాలా ప్రమాదకరమైన వాదన. మన భారత రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని ఏ రాష్ట్రంలోని రైతుల పైన అయినా సరే రుద్దకూడదు. ఒక రాష్ట్రంలోని రైతులే వ్యతిరేకించినా ఆ రాష్ట్రపు రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా కేంద్రం చట్టం చేయకూడదు. అలా చేసే అధికారం కేంద్రానికి లేదు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో రైతుల పరిస్థితులు, వ్యవసాయం పరిస్థితులు వేరువేరుగా ఉంటాయి. ఆ రాష్ట్రం లోని ప్రభుత్వం మాత్రమే అక్కడి ప్రజలకు నేరుగా జవాబుదారీగా ఉంటుంది. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే అక్కడి నిర్దిష్ట పరిస్థితుల పట్ల స్పష్టమైన అవగాహన ఉంటుంది. అందుకే రాజ్యాంగం వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ప్రత్యేకంగా ఉంచింది.

వ్యవసాయిక సంబంధ విషయాలపై చట్టాలు చేయడం కేంద్రం పని కానే కాదు. ఒకవేళ కార్పొరేట్లు వ్యవసాయ రంగంలో ప్రవేశించడం చాలా మంచిదని కేంద్రం తనకున్న విజ్ఞతతో భావిస్తే ... ముందు తాను జారీ చేసిన మూడు చట్టాలనూ రద్దు చేసి ఆ తర్వాత కార్పొరేట్లను వ్యవసాయం లోకి అనుమతిస్తూ చట్టాలను చేయవలసిందిగా రాష్ట్రాలకు సలహా ఇవ్వవచ్చు. కేంద్రం చెప్పినట్టు రాష్ట్రాలలో రైతులు ఇందుకు అనుకూలంగా ఉండడమే వాస్తవం అయితే ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలే అందుకు అనుగుణంగా చట్టాలను చేసుకుంటాయి. ఏ రాష్ట్రాల్లోనైతే రైతులు కార్పొరేట్ల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్నారో ఆ రాష్ట్రాల ప్రభుత్వాలు అటువంటి చట్టాలను చేయవు. వ్యవసాయ చట్టాలు ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా ఉండాలనేది రాజ్యాంగం నిర్దేశిస్తున్న విషయం. పరిస్థితులు రాష్ట్రానికో తీరున ఉన్నట్టే చట్టాలూ వేరువేరుగా ఉండాలి. అంతే తప్ప తానేది సరైన చట్టం అని కేంద్రం భావిస్తున్నదో దానినే రాష్ట్రాలపై రుద్దే అధికారం కేంద్రానికి లేదు.

మరి రాజ్యాంగం ఇంత స్పష్టంగా నిర్దేశించినా కేంద్రం

తానే పూనుకుని చట్టాలను ఎందుకు తెచ్చింది? ఎందుకు రాష్ట్రాలకు వదిలిపెట్టలేదు? రాజ్యాంగం చెప్పినట్టు గనుక రాష్ట్రాలకు వదిలిపెడితే ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమూ– ఆఖరుకి బిజెపి పాలనలోని రాష్ట్రాలు కూడా– ఈ విధంగా కార్పొరేట్ల పెత్తనానికి బాటలు వేసే చట్టాలను చేసేందుకు సాహసించలేవు. ఆ చట్టాలు రైతులకు అంత వ్యతిరేకంగా ఉన్నాయి. ఇక కేంద్రమే ఈ చట్టాలను చేయడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది– కొన్ని రాష్ట్రాల్లో రైతులు మెజారిటీగా ఉన్నప్పటికీ దేశం మొత్తంగా చూసుకుంటే రైతులు మెజారిటీ కాదు. రెండవది– కేంద్రం తీసుకున్న రైతు వ్యతిరేక వైఖరి వలన బిజెపి పట్ల ప్రజల్లో ఏర్పడే ప్రతికూలతను ఎన్నికల సమయంలో వెనక్కి నెట్టడానికి తగిన వ్యూహం ఆ పార్టీ వద్ద ఉండనే ఉంది. సరైన సమయం చూసి ఏదో ఒక సంఘటనను సృష్టించి భావోద్వేగాలను రెచ్చగొట్టి ఆ క్రమంలో ఈ వ్యవసాయ చట్టాల వలన ఏర్పడిన ఆగ్రహాన్ని వెనక్కి నెట్టవచ్చునన్నదే ఆ వ్యూహం. అటువంటి సంఘటనలను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో సృష్టించడం చాలా కష్టమే గాక అవి ఎటు దారితీస్తాయో తెలియదు. విదేశీ వ్యవహారాలు, రక్షణ రంగం కేంద్రం పరిధిలో ఉండే అంశాలు గనుక అటువంటి ఉద్వేగ సంఘటనలను సృష్టించే అవకాశాలు కేంద్రానికి కావలసినన్ని ఉంటాయి.

మన దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తి వైపు నుండి ఇతర ఉత్పత్తుల వైపు దృష్టి మళ్ళించాలని, తమ దేశాల నుంచి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునేటట్టుగా భారతదేశం మార్పు చెందాలని అమెరికా, యూరోపియన్ యూనియన్ చాలా కాలం నుంచీ ఒత్తిడి చేస్తున్నాయి. ఇక మన దేశ వ్యవసాయ మార్కెట్‌లో, వంట సరుకుల చిల్లర వ్యాపారంలో మొత్తంగా ప్రవేశించాలని మన దేశ కార్పొరేట్లు కోరుతున్నారు. ఈ రెండు శక్తుల ఎజెండానూ అమలు చేసేందుకు పూనుకున్న మోడీ ప్రభుత్వం ఆ క్రమంలో అధికారాలను కేంద్రీకృతం చేయడానికి పూనుకుంది. అలా చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేకమేగాక రాజ్యాంగ వ్యతిరేకం కూడా. ఇంతకు ముందే ఆర్థిక వనరులను కేంద్రీకృతం చేయడంలో భాగంగా జిఎస్‌టి వ్యవస్థను తెచ్చింది. ఆ సందర్భంలో రాష్ట్రాలు కోల్పోయే ఆదాయాన్ని కేంద్రం భర్తీ చేస్తుందని ఇచ్చిన హామీ వొట్టి బూటకం అని తేలిపోయింది. ఆ తర్వాత ఏకపక్షంగా నూతన విద్యా విధానం ప్రకటించింది. వాస్తవానికి విద్య అనేది రాజ్యాంగం లోని 7వ షెడ్యూలు ప్రకారం కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్న అంశం. ఐనా రాష్ట్రాలను సంప్రదించలేదు. జమ్ము కాశ్మీర్‌కు సంబంధించి 370, 35–ఎ అధికరణాలను రద్దు చేసినప్పుడూ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం కోరలేదు. నిజానికి ఈ అధికరణాలను రద్దు చేయడానికి ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం ఇచ్చినంత మాత్రాన ఆ రద్దు సమర్థనీయం అయిపోదు. ఇప్పుడు ఏకంగా ఉమ్మడి జాబితాలో కూడా లేని, కేవలం రాష్ట్రాల పరిధిలో మాత్రమే ఉన్న వ్యవసాయం జోలికొచ్చింది. దేశవ్యాప్తంగా వ్యవసాయంలో తీవ్ర మార్పులకు దారి తీసే చట్టాలను తెచ్చింది. ఈ విధంగా అటు ఆర్థిక వనరులను, ఇటు అధికారాలను కేంద్రీకృతం చేయడం ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను ముప్పుగా మారుతుంది.

పైగా ఈ కేంద్రీకరణ కూడా పుట్టెడు అబద్ధాల మాటున సాగించుతోంది. జిఎస్‌టిలో కేంద్రం రాష్ట్రాలకు కలిగే రెవెన్యూ నష్టాన్ని భర్తీ చేసే విషయమై ఇచ్చిన హామీ వెనుక ఏ విధంగా అబద్ధం దాగుందో మనం చూశాం. ఇప్పుడు ఈ వ్యవసాయ చట్టాల విషయంలోనూ అటువంటి అబద్ధాలు దాగున్నాయి. సాక్షాత్తూ పార్లమెంటు వేదికగా ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. నీతి ఆయోగ్ పాలక మండలి ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉండే ఆహార ధాన్యాల నిల్వలపై ఎటువంటి ఆంక్షలూ ఉండరాదని సిఫార్సు చేసిందన్నది ఆ ప్రకటన సారాంశం. నీతి ఆయోగ్ పాలక మండలిలో రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఉంటారు. ఐతే, సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా తమ పాలక మండలిలో అటువంటి చర్చ ఏదీ జరగనేలేదని నీతి ఆయోగ్ తెలిపింది. అసలు ఆహార ధాన్యాల నిల్వలపై ఆంక్షలు ఎత్తివేయాలన్న సిఫారసుతో ఒక నివేదిక ఉందన్నది కూడా బూటకమే. వాస్తవానికి ఆహార ధాన్యాల నిల్వలపై ఆంక్షలు ఉండాలా వద్దా అన్నది కూడా రాష్ట్రాల పరిధిలో నిర్ణయించే అంశమే. ఇప్పుడు ఆ అధికారాన్ని చాలా అబద్ధాలు చెప్పి రాష్ట్రాల నుంచి ఊడలాక్కున్నారు. అంతేగాక, చట్టా వ్యాపారులకూ, బ్లాక్‌మార్కెట్ వ్యాపారులకూ ఆహార ధాన్యాల కొరత సృష్టించేందుకు పుష్కలంగా అవకాశాలు కల్పించారు.

రాష్ట్రాల పరిధిలో ఉండే అంశాలపై కేంద్రమే నేరుగా చట్టాలను జారీ చేయబూనుకోవడమే కాదు. ఇక్కడ మరో ప్రమాదకర ధోరణి ఏమంటే ... రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా

కవిత

# వాళ్లు

- వైష్ణవి శ్రీ
80742 10263



**ఆ**కుమళ్లల్లో రేపటి ఆనందాన్ని
వెతుక్కునే వాళ్లు
పంట చేలల్లో పండిన సంతోషం వాళ్లది
చెమట చుక్కల్ని
పిడికెడు మెతుకులుగా మార్చిన వాళ్లకు
ఎగుడు దిగుళ్లను
దున్నుకుంటూ పోవడం
కొత్తకాదు

నీటి మడుగుల్ని మోసుకొచ్చే
వాగులూ వంకలకు నడక నేర్పినవాళ్లు
ముళ్ల కంచెలను మట్టి పాన్పు చేసి
ధాన్యం కంకుల మోరల్ని పైకెత్తిన వాళ్లు
పొంగుకొస్తున్న ఏరువాకలపై
నిండు జీవితాల్ని పరిచిన వాళ్లు
నాగేటి చాళ్లను కన్నీటితో తడిపిన వాళ్లు
నాగలి బరువుని నెత్తిన మోసేవాళ్లు
గాలి భుజాలపై ఆలోచనలను ఆరబోసుకునేవాళ్లు..
నేలపై నడుస్తున్న
పగిలిన వర్తమానం పాదాలు వాళ్లు..

వాళ్లది
విసుర్రాయికి.. గింజలకీ మధ్య
తరాలుగా జరుగుతున్న పోరు
జొన్నకంకులకి పిట్టలకీ మధ్య
నలుగుతున్న ఆకలి హోరు వాళ్లది
చరిత్రలో ఎన్నడూ ఎవరూ లిఖించని
యుద్ధ పేజీలు వాళ్లు
ఇప్పుడా ఖాళీ పేజీలన్నీ
నువ్వా నేను చెయ్యలేని
సాహసమేదో చేస్తున్నాయి
మట్టిని మట్టిగా చూడాలనుకుంటున్నాయి
గింజ గింజపై భవిష్యత్ తరాల
పేరుండాలని ఆశ పడుతున్నాయి! ■

---

వాటి అభీష్టాలకు విరుద్ధంగా కేంద్రం చట్టాలు తేవడం. పైగా కొన్ని రాష్ట్రాలు మాత్రమే వ్యతిరేకిస్తున్నాయంటూ తాము ఘనకార్యం చేసినట్టు ప్రచారం సైతం చేసుకుంటోంది కేంద్రం.

రాష్ట్రాల అధికారాలను తోసిరాజని తానే చట్టాలు చేయాలనుకున్నప్పుడు కనీసం అందుకోసం రాజ్యాంగాన్ని ముందు సవరించాలన్న ఆలోచన కూడా బిజెపి కి లేదు. తన ఇష్టం వచ్చినట్టు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. మన న్యాయ వ్యవస్థకు ఈ ప్రభుత్వాన్ని సవాలు చేసేటంత ధైర్యం లేదు. దాంతో మరింత బరితెగించి బిజెపి వ్యవహరిస్తోంది. ఈ దేశంలో మొత్తంగానే రాజ్యాంగానికి ద్రోహం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న రైతుల పోరాటం మన భవిష్యత్తు దృష్ట్యా చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ■

## కవిత



**మ**ట్టిలో తారాడే చేతులు
మట్టి అంటక పోతే మారాం చేసే చేతులు
బురద మళ్ళల్లో నాట్యమాడే కాళ్ళు
కల్లాల్లో కలియదున్నే కాళ్ళు
బస్తాలు తొక్కే కాళ్ళు
కాటిలోకి పోయేదాకా విశ్రమించని కాళ్ళు

గింజతో పాటు మట్టిలోకి వేళ్ళు
గింజ వేళ్ళానుకుని మట్టిపెళ్ళల తన్నుకుని
బైట పడుతుంటే మెరిసే కళ్ళు
మట్టి సారం ఎరుకయ్యే అనుభవం
తరతరాల విద్య
దృశ్య శ్రవణ యంత్ర వీక్షణతో ఎవుసం సాగదు
పుస్తకాలు రాక మునుపే ఎవుసం
ఎవ్వడు జెప్పలే గాయాల
నా నేర్పే నా మొక్కకి ఊపిరి

ఇంటిముందో వెనుకో
బర్రో గొడ్డో మేకో గొర్రో నాకు తోడుగా
మలమూత్రవిసర్జన కసుపుతో సహా ఊడ్చి ఎత్తి
ఊరి చివర దిబ్బ పోగు ఏడాదంతా
ఎండాకాలం దిబ్బెరువు తోలి
చెరువు మట్టి కలిపి చల్లి
సారం పెంచే జ్ఞానం నా సొంతం

ఊరంతా దేశవాళి పంటల హొయలతో ఊగుతుంటే

# అరిగోస

- గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201

ఇచ్చిపుచ్చుకునే ధాన్య మార్పిడితో
తిండికి లోటే లేక విరాజిల్లిన ఊరూరా సంక్రాంతి

మొలకెత్తే గింజ పరిజ్ఞానం
నానుంచి దూరం జేసి
బిటి బోటి అంటూ బహుళ జాతులకు అంటగట్టి
నా ఉరితాళ్ళ పేన పేటెంట్ అప్ప జెప్పి
నా ఉనికినే ప్రశ్నార్థకం జేసిన నిర్వాకం ఎవ్వడిది?

వాణిజ్య పంటల ఉసి గొల్పి
రసాయనిక ఎరువులనెగదోసి సారాన్ని పిప్పి చేసి
నిష్ఫల ఎవుసం నేడు ...!

కురిసిన మబ్బు కురిసిన కార్తె
కురిసిన చినుకు పరిణామం
చినుకు రాలిన నేల
నల్లదో ఎర్రదో దుబ్బదో ఇసుకదో రాతిదో
ఇన్ని జూసి బేరీజు వేసి
ఏ గింజ ఎన్నాళ్ళకు పండుతదో పరీక్షించి
వేసే నేను మొగులు రాకమునుపే
రాత పత్రాల ఖరారెలా జేసుకోవాలే సన్నాసి?

పండిన పంట
అమ్మబోతే ఆంక్షల వెల్లువ
బండి నిండని పంట
బొంబాయి బొమ్మంటే బోయేదెట్ల నరుడా!
ఊరిపక్కన తెచ్చిన
గింజ ఎరువు మందు అరువు అరిగోస తీరేదెలా?!

పొట్ట గోస్తే ఎవుసక్షరం ఎరగనోడు
ఎగాదిగా నాపైకి దూసుకొస్తుంటే
ఆంబోతుల్లా కుమ్మటమే నాకు తెల్సు! ■



# రాయడం కంటే చదవడం చాలా ముఖ్యం

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

**"ఇష్టపడ్డ రంగంలో పనిచేసే అవకాశం చాలా కొద్దిమందికే దక్కుతుంది. నేను అలాంటి అవకాశాన్ని పొందాను. నేను పొందిన పురస్కారాలు, బహుమతుల కంటే నా వృత్తిలో కలిగిన సంతృప్తే నాకు ఎక్కువ సంతోషాన్నిచ్చింది." అన్నారు వేణుగోపాల్.** సుదీర్ఘ కాలం ఆకాశవాణిలో పనిచేయడం ద్వారా జర్నలిజంతో పాటు సాహిత్యం మీద తనకున్న మమకారాన్ని తీర్చుకోవడానికి అవకాశం కలిగిందని చెప్పారు. రాయడం కన్నా చదవడం చాలా ముఖ్యమని తాను భావిస్తానని చెప్పారు. దేశంలోని వివిధ ఆకాశవాణి కేంద్రాల్లో పనిచేసిన డాక్టర్ వేణుగోపాల్ జనవరి 31న హైదరాబాదు ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టరుగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా రచయిత్రి ప్రగతి ఆయనతో జరిపిన సంభాషణ ఇది :

**మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి చెప్పండి.**

అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం హిందూపురానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే కొనతట్టుపల్లి నేను పుట్టిన ఊరు. సంజీవయ్య, గౌరమ్మల 11 మంది సంతానంలో ఎనిమిదవ బిడ్డను. ఈ రోజుకూడా మా ఊర్లోకి బస్సు వెళ్ళదు. కొండదాపున ఉన్న మా ఊళ్ళో పొద్దెక్కేదాకా సూర్యుడు కనిపించడు. భజన మందిరం, పీర్ల చావడి, అశ్వర్థం కట్ట తప్పిస్తే ఏ రకమైన గుడీ ఉండేది కాదు. బొడ్రాయి వంటి గ్రామదేవత ఉండేది. నీళ్ళ కోసం తెల్లవారుజామున లేచి ఒకటిన్నర కిలోమీటరు వెళ్ళాల్సిన పరిస్థితి. కొనతట్టుపల్లి, పాలసముద్రం, హిందూపురం ప్రాంతాల్లో పాఠశాల విద్యాభ్యాసం, ఇంటర్మీడియట్ చదువు, పుట్టపర్తి సత్యసాయి విద్యాసంస్థల్లో డిగ్రీ చదివాను. ఎనిమిదో తరగతిలోనే పత్రికల్లో రాయాలనే ఆకాంక్ష మొదలైంది. టీచర్ల ప్రోత్సాహంతో ఆంగ్ల, తెలుగు పత్రికలు చదవడం మొదలైంది. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో ఎమ్మెస్సీ, ఆపైన సోలార్ ఎనర్జీలో ఎం.ఫిల్ పూర్తి చేశాను. 2002లో మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజంలో ఎంఎ పూర్తి చేసి, 2010లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి తెలుగు న్యూస్ చానళ్ళ గురించి పరిశోధన చేసి పిహెచ్‌డి పొందాను.

**ఆకాశవాణిలో సుదీర్ఘ కాలం అనేక ప్రాంతాల్లో పనిచేశారు. అనేక ప్రయోగాలు చేశారు. వాటి గురించి చెప్పండి.**

గోవాతో మొదలై, అనంతపురం వంటి చిన్న ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రధాన నిర్ణాయక కేంద్రమైన డైరెక్టరేటు ఢిల్లీ దాకా పనిచేసే అవకాశం నాకు కలిగింది. విజయవాడలో ఉదయరేఖల ద్వారా చేసిన సాహిత్య, సామాజిక, సైన్స్ కార్యక్రమాలు నాతో పాటు ఆకాశవాణికీ గర్వకారణం. కొత్త కేంద్రానికి వెళ్ళిన వెంటనే అక్కడి చరిత్ర, సంస్కృతి, సామాజిక జీవనం మొదలైనవి అర్థం చేసుకొని, ఆ ప్రాంతంలో ఉండే వివిధ రంగాల నిపుణులను గుర్తించిన తర్వాత కార్యక్రమాలకు రూపకల్పన చేయటం పరిపాటి. అనంతపురంలో జానపద కళల పరిచయం, విజయవాడలో ఉదయరేఖలు, 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యం పరిచయం 'శత వసంత సాహితీ మంజీరాలు', తెలుగు భాష గొప్పదనం గుర్తుచేసిన 'మన

తెలుగు' (హైదరాబాదు), అన్నమయ్య సాహిత్య, సంగీత సౌరభాన్ని విశ్లేషించిన 'అన్నమయ్య పదగోపురం' (కడప), పాతతరం ప్రముఖులను గుర్తు చేసిన 'నాన్నకు నమస్కారం' (మద్రాసు) వంటి ప్రయోగాలు చాలా ప్రసిద్ధి పొందాయి. ఇంకా సీమ కథలు, అమరావతి కథలు, ప్రళయ కావేరి కథలు, తెలుగరవ కథలు, చిత్తూరు కథలు... ఇలా కథాసాహిత్యాన్ని శ్రోతలకు మరింత చేరువ చేయడానికి ప్రయత్నించాను. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'యూనివర్సిటీ యువత', హెచ్ఐవి బాధితులతో రూపొందించిన క్షేత్రాధారిత 'జీవన బింబం' (విజయవాడ), ఆదివాసుల ఉత్పత్తులకు సరైన విలువను కల్పిస్తూ, వారి జీవితాల్లో వెలుగు చిందించిన ధారావాహిక 'ఆదివాసీ అంతరంగం' (విశాఖపట్నం), మద్రాసులో సీనియర్ సినీ ప్రముఖులతో నిర్వహించిన 'తారా మణిహారం' వంటివి నాకు చాలా సంతృప్తిని కలిగించాయి.. ఎక్కడికెళ్ళినా యువతను కేంద్రంగా చేసుకొని రూపొందించిన కార్యక్రమాలు, విశ్వవిద్యాలయాల్లో సైన్స్ కార్యక్రమాలు, వేటపాలెం కేంద్రంలో యువకవి సమ్మేళనం మొదలైనవి మంచి ప్రయోజనం కలిగించాయి.

**వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నప్పుడు స్థానిక భాషకు, పదజాలానికి ప్రాధాన్యతనిచ్చేవారట...?**

స్థానిక చరిత్ర, సంస్కృతి, సామాజిక జీవనంతో పాటు అక్కడి భాషను కూడా అవగాహనా చేసుకొని, అదే పదజాలం ఉపయోగిస్తే శ్రోతలకు మరింత దగ్గరవుతాము. అనంతపురంలో "సేద్యపు సుద్దులు", "లేపాక్షి", "చేనూ-సేద్యం", "మల్లెపూదండ" వంటివి స్థానికతను ప్రతిబింబించాయి. ఇతర కేంద్రాల్లో కూడా ఇలాంటివి రూపొందించాము. విశాఖపట్నంలో పనిచేస్తున్నప్పుడు లిపి లేని ఆదివాసుల కార్యక్రమాలు కూడా రూపొందించాం. 'శ్రామిక శకటం' కార్యక్రమంలో వివిధ వృత్తిదారులు, నైపుణ్యం కలిగిన కార్మికుల చేత వారి వృత్తికి సంబంధించిన అనుభవాలు వారి భాషలోనే చెప్పించాము. అలాగే 'తమిళ తెలుగు సొబగు' కూడా మంచి పేరు తెచ్చుకొంది.

**సైన్స్ రచయితగా మీరు ఆకాశవాణిలో రూపొందించిన సైన్స్ కార్యక్రమాల గురించి చెప్పండి.**

1991లో అనంతపురంలో ప్రారంభించిన "విజ్ఞానపథం", తిరుపతి ఆకాశవాణిలో ప్రసారమైన "రండి .. చూసొద్దాం తారామండలం", "స్కై వాచ్", "అడగండి, తెలుసుకోండి" వంటివి సైన్సు కార్యక్రమాల కోసం చేసిన ప్రయోగాలు. 1995లోనే ఢిల్లీ నుంచి "రేడియో స్కోపు" అనే ఆంగ్ల సైన్స్ సంచికా కార్యక్రమం దేశంలో అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమై ఎంతో గుర్తింపు తెచ్చింది. "బొమ్మా బొరుసా" అనేది సంస్కృతి, విజ్ఞానం మేళవించి రూపొందించిన కార్యక్రమం.

**వందలాది వ్యాసాలు రాశారు. పుస్తకాలు ప్రచురించారు. దీనికోసం విస్తృతంగా చదవాలి కదా? ఇదెలా సాధ్యమైంది?**

ఒకటి టైం మేనేజ్మెంట్. రాత్రి చదవడం, తెల్లవారుజామున లేచి రాయడం. రెండోది ఇంట్లో వాతావరణం. విస్తృతంగా చదవడం, స్పృహతో చదవడం చేస్తే ఏం రాయాలి, ఎలా రాయాలి అనే అంశాల మీద స్పష్టత ఉంటుంది. అలాగే ఫలానా విషయం మీద వేణుగోపాల్ రాయగలడు అని సంపాదకులూ, పత్రికలూ భావించటం వల్ల కూడా ఇది సాధ్యమైంది. సైన్స్ వ్యాసాలు రాసేటపుడు సమాచారం ఇవ్వడం కాకుండా, సామాజిక కోణం నుంచి విశ్లేషించి రాయడం నాకు ఇష్టం.

**మీడియా గురించి అనేక కాలమ్స్ నిర్వహించారు. ఆ సమయంలో ఇబ్బందులు, వత్తిళ్లు ఎదుర్కొన్న సందర్భాలు న్నాయా?**

ఒక ప్రభుత్వోద్యోగిగా ఉండి మీడియా గురించి రాసినా నాకు పెద్ద ఇబ్బందులు ఎదురవలేదు. నా విమర్శలను లెక్కలోకి తీసుకున్న సందర్భాలూ చాలా ఉన్నాయి. వారు నాతో నేరుగా అన్న దాఖలాలేమీ లేవు, పరోక్షంలో ఏమన్నా వ్యాఖ్యానించే వారేమో తెలియదు. ఆ రకంగా చూసినపుడు తెలుగు మీడియా చాలా ఆరోగ్యకరంగా ఉన్నట్లే!

**టీవీ చానళ్ల తీరుతెన్నులను అనేక వ్యాసాల్లో విమర్శించారు. ఇప్పటికీ వాటి ధోరణి అలాగే ఉంది. ఏం చేస్తే ఫలితం కనిపిస్తుంది?**

1995లో తెలుగు చానెళ్ళు మొదలయ్యాయి. 1997లో టీవీ చానళ్ళపై నా కాలమ్ మొదలైంది. 2010 వరకు రాశాను. అంత ఘాటుగా రాస్తున్నాం కాబట్టే ఈ మాత్రమైనా ఉంది. అప్పట్లో నేను చేసిన పని ఇప్పుడు సోషల్ మీడియా చేస్తోంది. మిగిలిన భాషలతో పోలిస్తే మన పత్రికలూ, చానెళ్ళు కాస్త మెరుగ్గా ఉన్నట్లే!

**అంటే మన పత్రికలు, చానెళ్ళ ధోరణి బాగానే ఉందంటారా? గతంతో పోల్చినప్పుడు ఇప్పటి మీడియా ప్రమాణాలు తగ్గుముఖం పట్టలేదా?**

అంతా బాగుందని అనడం లేదు. మిగిలిన భాషల వాటితో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని మాత్రమే అంటున్నా. చాలా భాషల చానెళ్ళు, పత్రికలు కేవలం సెక్స్, క్రైమ్ వార్తలు, కార్యక్రమాలకు పరిమితమైపోయాయి. తమిళ పత్రికల్లో ఎడిట్ పేజీ కూడా ఉండటం లేదు. తెలుగులో ఆ మేరకు బాగుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు చానెళ్ళ పరిస్థితి దిగజారుతూ వస్తోంది. హెడ్ లైన్ ఏదున్నా చివరికి ప్రోగ్రాం ఎవర్నో తిట్టడానికే ఉంటుంది. ఒక రకంగా టీవీకి క్రమంగా కాలం చెల్లిపోతోందేమో!

**మీరు ప్రచురించిన సాహిత్య గ్రంథాల గురించి చెప్పండి.**

వాస్తవానికి నాకు మొదటి గుర్తింపు సాహిత్యంతోటే మొదలైంది. 1978లో ఆంధ్ర పత్రిక దినపత్రికలో కవిత ప్రచురణతో నా సాహితీ ప్రయాణం మొదలైంది. శత వసంత సాహితీ మంజీరాలు, వెలుగుజాడ, నేటికీ శ్రీపాద, జ్ఞాన సింధు సర్దేశాయి తిరుమల రావు, చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు, సంక్రాంతి కథా తోరణం, మన తెలుగు, మదరాసు బతుకులు, వైజ్ఞానిక కథలు నేను సంపాదకత్వం వహించిన పుస్తకాలు. సాహితీ స్పర్శ, సాహితీ వీక్షణం, విద్వాన్ విశ్వం ... ఇలా మరికొన్ని ప్రచురించాను.

**ఉద్యోగ విరమణ అనంతరం సైన్స్, పర్యావరణం, జర్నలిజం, మీడియా, సాహిత్యం – వీటిలో ఏదైనా ఒక రంగానికి ప్రాధాన్యత ఇస్తారా? లేక అన్నింటినీ కొనసాగిస్తారా?**

మనం ఎంతనుకున్నా కొన్నిసార్లు మనమనుకున్నట్లు జరగవు. దేని గురించి చెప్పినా ఆకారం మాత్రం అంటే ఎక్స్ప్రెషన్ సాహిత్యమే.. అది చరిత్రయినా, వర్తమానమయినా. ప్రతిదాన్ని హేతుబద్ధంగా చూస్తాను, అంటే సైన్సే. సాహిత్యమైనా, సైన్సయినా రెండూ సమాజం కోసమే. కాబట్టి అన్నీ కలిసే ఉంటాయి. ఇలా సమగ్రంగా చూడటంలో మన దృష్టి ఇంకా కొరవడిందేమోనని అనుమానం. ఇదివరకు నేను చేయాలనుకున్న పనులు, నా మనసుకు ఇష్టమైనవి చాలానే ఉన్నాయి. కొని ఇంకా పేజీలు తెరవని పుస్తకాలు చాలా ఉన్నాయి. వాటిని ఇష్టంగా చదువుకుంటాను. రాయడం కంటే చదవడం చాలా ముఖ్యం.

సంభాషణ : ప్రగతి

## ఉరమని మెరుపులు

- అవ్వారు శ్రీధర్ బాబు
85001 30770

అలల చైతన్యాన్ని
కుట్రదారులెవరో
కప్పేసే ప్రయత్నమేదో జరుగుతోంది
ఉరమని మెరుపులే
కావాలి వారికిపుడు
పచ్చని ఆకు ఎండుటాకులా
దొర్లాలని వారి ఆలోచన

కాలేజీలు ఇప్పుడు
చేవ చచ్చిన సైన్యాన్ని
రూపొందిస్తున్నాయి
ఉద్యమాలను నేర్వాల్సిన
యువత నాలుకలనిప్పుడు
కాగితాల తాళ్లతో కుట్టేశారు
మెదడుని పోటీలమందుతో నింపేశారు

జనానికి దూరంగా
యువతరాన్ని డబ్బు సోపుతో
ఉతుకుతున్నారు
అలాంటివారు సమాజానికి
ఉపయోగపడని కుళ్లిన పండ్లే!
ఇక సింహాసనం కోసం
వారసత్వపు ఇంటి కాళ్ళే అడులేస్తుంటాయ్
కడిగేయని నోర్లిప్పుడు
ఆ కాళ్లను నెత్తిమీద పెట్టుకొని
జయ జయ ధ్వానాలు చేస్తూ
ఊరేగింపు ఆనందాన్ని అనుభవిస్తుంటాయి

◆ ◆ ◆

అలల చైతన్యాన్ని
ఆపాలనుకోవటం భ్రమ మాత్రమే..
అవి ఎప్పటికైనా.... పొగమంచుని ఛేదిస్తాయ్ ■

కవిత

# ప్రేమ లేఖ

- పద్మావతి రాంభక
9966307777



చీకటి చార భూగోళమంతటా
విస్తరిస్తూ పోతోంది
వెన్నెలజాడ ఎంత వెతికినా
అగుపించట్లేదు
ఎంతగా చేతులు రాపాడి
వేడిమి పుట్టించినా
గడ్డకట్టిన సముద్రం
కాస్తైనా కరగట్లేదు
బొత్తిగా కనికరించట్లేదు
పగబట్టిన కాలం
ఒక స్తబ్ధతను
ఆకాశానికి నల్లమబ్బులా
అతికించింది
రుతువులు వస్తూ పోతూ
ఎప్పట్లాగే పలకరిస్తూనే
ఉన్నాయి
మునుపటి స్పందనలే
కరువవుతున్నాయి
ముఖాలు ఊపిరిని
వడగడుతున్నా
భయం రాబందు
పదునైన ముక్కుతో
పొడుచుకు తింటూ ఉంది
జవాబు కనుక్కోలేని ప్రశ్న
మంటను ఎగదోస్తూ
సవాల్ విసురుతోంది
పల్లవులూ చరణాలూ
పోగొట్టుకున్న పాట
విషాద వాక్యాలను ఆలపిస్తోంది
అంతూ దరీ లేని ఈ
ప్రయాణం
ఏ తెలియని మజిలీకి
తీసుకుపోతోందో తెలియదు
గుండెకూ గొంతుకూ నడుమ
ఏదో అజ్ఞాతబాధ
ఒడ్డున పడ్డ చేపలా కొట్టుకుంటోంది
పోగొట్టుకున్న శ్వాసల దుఃఖాలు
లోపలెక్కడో
పొలమారుతూనే ఉన్నాయి
ఘల్లుఘల్లున మోగుతూ
సందడి సందడిగా
తిరిగిన ఎన్నో అక్షరాలు
మూగబోయాయి
ఎంత తట్టి లేపినా లేవని కలం
గది మూలన ముడుచుకుంది
సిరాకొలను ఇంకిపోయిందేమో
అనే అనుమానం
చెదలా తినేస్తోంది
మనసు దిగులునదిలో నానిపోతూ
సాయంసంధ్యలోని
రెక్కలు రాల్చుకున్న పువ్వైంది
పూలవనాల జ్ఞాపకాలను
తడుముకుంటూ
హృదయం ఎడారి కన్నై
మూలమలుపులో నిలబడింది
రాబోయే ఉగాదులకై నిరీక్షణలో
ముచ్చెమటలతో వణుకుతున్న క్షణాలు
ఆశలనాట్లు వేస్తూ ఉన్నాయి
అస్థిపంజరపు దేహం కాళ్ళీడుస్తూనే
ఘడియఘడియనూ
తడిమి తడిమి చూస్తూ
రాత్రులను లెక్కగడుతోంది
ఎక్కడో ఒక
అందమైన చంద్రుడు
వెక్కుతున్న దిక్కులను ఓదారుస్తూనే
మళ్ళీ పరిమళాలతో పూసే ఉదయాన్ని
కాస్త కరుణించమంటూ
ప్రేమలేఖ రాయడంలో
నిమగ్నమై ఉండి ఉంటాడు! ■

కవిత

# మిస్సింగ్ ఔట్!

- వేణు మరీదు

85550 53547



అక్కడా ఇక్కడా ఎక్కడని నిను వెదకను?

కల్యాణ మండపాల్లోనూ, కబేళానీడల్లోనూ నువు లేవు
శునకం దగ్గర లేవు – కనకం దాపునా కనపడవు!

తల్లి రొమ్ములు కుమ్ముతూ పాలు కుడుస్తున్న
లేగదూడ కన్నుల్లో
అల్లసాని వారి అల్లిక జిగిబిగిల్లో, ఆట వెలదుల
వేమన్నల్లో...

అక్కడా ఇక్కడా ఎక్కడని నిను వెదకను ?

విమానాల పక్కలు, విహంగాల రెక్కలూ
అన్నీ వెదికాను
వనాల్లో అతుక్కుపోయి ఉన్న ప్రేమికుల మధ్యనా
గాలిలా దూరి చూసాను

విందుల్లో సందుల్లో బారుల్లో నిశాచర దర్బారుల్లో
సుఖంలో దుఃఖంలో మోహంలో దాహంలో
అహంలో ఇహంలో...

నారి పట్టి లాగితే వంగే కొత్త విల్లుల్లా వంగి
పడతులు వేసే చక్కని ముగ్గుల్లో...
ప్రతి మధుమాస రతికి సిద్ధం చేసే కమ్మని మల్లె
మొగ్గల్లో...

అక్కడా ఇక్కడా ఎక్కడని నిన్ను వెదికేది?

ధనంలో వనంలో జనంలో రణంలో మెట్రోనగరాల
వేగంలో...
శోభా యాత్రలకు సిద్ధమైన గుళ్లలోని
దేవుళ్ళ వైభోగంలో...

అక్కడా ఇక్కడా ఎక్కడని నిను వెదకను?

నీకై భూగోళంపై గోలీకాయలా గుండ్రంగా తిరిగాను

అగ్గిగోళాల్లో హరిశ్చంద్రులు కాలిపోతున్న కమురులో
వెతికాను
'అశ్వత్థామతహ: కుంజరహ' వచనాల చెవిలో కారే
చమురులో తడిమాను

పంచభూతాల నుంచి చిరునామా అడుక్కుని
నిన్ను వెతుక్కున్నాను!
అనంతానంత దిగంతాలను గాలించి
నిన్ను అన్వేషించాను...

నువ్వు తప్పిపోయావు..
దారి తప్పి పోయావా?
నేనూ తప్పిపోయాను...
దారి తప్పిపోయానా...?

నీ దారిలోనేగా నేనూ!

మనుషుల దారుల్లోనే...
మనిషితనం లేని దారిలోనే...
నువ్వూ నేనూ మనుషులమైనా
ఎప్పుడో తప్పిపోయాము!

■

## సమీక్ష




# శ్రమ విశ్వరూపానికి మహాక్షరాభిషేకం

- తిరునగరి శ్రీనివాస్



**అ**న్నింటికీ అతీతమైన అతి గొప్ప పదం శ్రమ. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదన్నది నిజమే! మనిషి తన మూలాన్ని శ్రమ పునాదిపైనే కట్టుకున్నాడు. ఏ జీవనానికైనా శ్రమ ఒక అపూర్వ చరిత్రగా మారుతుంది. అవిశ్రాంత కార్యకలాపం, నిజాయితీకి దర్పణం, ఐక్యతాసాధనకు ప్రతిరూపం శ్రమే. రాజ్యాధికారం సృష్టించిన వికృత కల్పనల ప్రకంపనలు శ్రమను అణగదొక్కేందుకు చేయని ప్రయత్నమే లేదు. వేలయేళ్ల ఆధిపత్యం శ్రమను, శ్రమ వారసత్వాన్ని విభజించి పాలిస్తుంటే– శ్రమీయుల అంతరంగ వేదన పోరాటపు అగ్నిశిఖలను రగిలిస్తూనే ఉంది. శ్రమ పునాదిపైనే సంస్కృతి, నాగరికత, భాషలు, కళలు, సమస్త సంపద నిర్మింపబడతాయి. ప్రపంచం అంగీకరించిన శాశ్వత సత్యం ఇదే. ఆదిమానవుల నుంచి ఆధునికుల దాకా శ్రమ చిందించిన చెమట పరిమళాల పునాదుల ఎరుకను సాహిత్యం గొప్పగా ప్రతిబింబిస్తూనే ఉంది.

శ్రమకు ఊతమైన పాటల ఊపిరిని భావాల ఆయువుగా మార్చుకొని చారిత్రక కథా కావ్యాలాపనగా శ్రమకావ్యాన్ని ప్రఖ్యాత సినీ గేయ కవి డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ప్రతిభావైవిధ్యతతను చూపుతూ వచనంలో రాశారు. సన్నివేశంలో లోతైన ఆలోచన, అనుభవం వెల్లివిరిస్తే మేధోశక్తి చోదకశక్తిగా మారి ఆకృతి తొడిగిన పురోగతికి పర్యవసానంగా శ్రమకావ్యం వెలువడింది. ఊహాజనిత వాస్తవం, వాస్తవాధార చారిత్రకంగా ఈ కావ్యరూప ప్రతిపాదన జరిగింది. శ్రమి, శ్రముదు అన్న జంట చుట్టూ జరిగిన శ్రమైక అల్లిక ఇది. శ్రమే మూలం అన్న సత్యానికి ఆ రెండు పాత్రలు ప్రతీకలయ్యాయి. చరిత్ర పరంపరలో గొప్ప అద్భుతం శ్రమే. శ్రమీశ్రముల మూలాలపై మలిచిందే ఈ కావ్యం. ప్రకృతి, ప్రపంచం మనిషిని అర్థం చేసుకోవడంలోనే శ్రమ రూపం బోధపడుతుంది. మనిషి తయారు చేసుకున్న పనిముట్లు, ఆయుధాలే కాకుండా మనుషుల మధ్య అదృశ్య శక్తిగా పుట్టిన మాట, ఆట, పాటలతో పాటు శారీరక మేధోశ్రమ దాగి ఉందని చెప్పారు. కావ్య అంకురాలు ఏమిటో తెలిపారు. పరికరాలతో జ్ఞానాన్ని సృష్టించి అభివృద్ధి పరిచిన తెలివి కష్టజీవిది అన్న సత్యాన్ని వివరించారు. ఊహలకు అనేక యథార్థాలను ఆధారంగా చెప్పారు. శారీరక, మేధోశ్రమ జీవిగా మనిషిని చూపించారు. శ్రమ ప్రయాణపు సువిశాలతను ప్రపంచానికి పరిచయం చేశారు. శ్రామికుల శ్రమతో ఉత్పత్తి అయిన సర్వ పరికరాలు,

కళలు పరాయీకరణ కావడాన్ని నిరసిస్తూ శ్రమైక జనతా సిద్ధిని లక్ష్యంగా ఆవిష్కరించారు.

**శ్రమైక జగతి/ పురోగమనాగమనాన్ని/ శ్రమ ఆది/ శ్రమ మధ్య/ శ్రమ ఆదిమధ్యాంతాతీతముగా/ దిగ్దిగంతముల నాక్రమించిన/ శ్రమ విక్రమాకృతిని నేను కీర్తిస్తున్నాను** అంటారు కవి. శ్రమీశ్రములు జంట ద్వారా శ్రమే అన్ని వస్తువులను, కళలను సృష్టించిందని నిర్ధారించడమే కాకుండా భౌతికవాద వైజ్ఞానిక జ్ఞానాన్ని అందించారు. **ఏకైక/ శ్రమైక/ మతాన్ని నేను ప్రకటిస్తున్నాను** అంటూ శ్రమయిక ప్రపంచాన్ని ఆవిష్కరించారు. **పోచమ్మ పోతరాజు సర్వాయి పాపన్న/ బీరప్ప జాంబవంతుల చారిత్రక కథాలాపనలకు ముందు/ చిందులు శారదాకారులు బీర్ల కథకులు వివిధ/ కులవృత్తి జానపదాల చరిత్ర/ మూల కథల నేరుకుని గొంతు/ సవరించుకున్నట్టు శ్రమకావ్య చారిత్రక కథాలాపన** సాగుతుంది. మానవ ప్రస్థానపు పరిణామ శీలతతో అలౌకికమైన ఆలోచనాధోరణి వ్యక్తమైంది. ప్రయత్నం, కృషి, అన్వేషణ, ఆలోచన, పరిశోధన, పరిశీలన, స్పందన, ప్రతిస్పందన, అవలోకన, ఆచరణ వంటి అంశాల వెనుక ఉన్న శక్తి శ్రమేనని నిర్ధారణగా చెప్పారు కవి. సృష్టిలో జరిగే ప్రతి పరిణామానికి శ్రమే ప్రేరణ శక్తిగా మారిందన్న నిర్దేశాన్ని అందించారు. మానవ ప్రస్థానం ప్రత్యేకమైన దృష్టికోణంలో ఆవిష్కరణ జరిగి కవి స్వాప్నికతను, అందుకు తగిన యథార్థతను ప్రకటించింది. **నాలుక రుచికీ, ముక్కు వాసనకూ/ ముఖ కందరాల చైతన్యం శ్రమే** అన్నారు కవి. **అశ్రుగ్రంథులు అవతరించడానికి/ ముఖంపడ్డ యాతనే శ్రమ** అని వివరించారు. మార్మిక ధోరణిలో రచన కొనసాగింది. అనితర సాధ్యమైన జిజ్ఞాస కనిపిస్తుంది. తొలి మానవుని ఉనికిని చెబుతూ **పెద్దబండతో/ మంచు ఎలుగును/ చుంచు ఎలుకను వేటాడే/ వికసించని తొలి మానవ మేధస్సు** అది అంటారు. మానవుడు రాతిని ఆయుధంగా మార్చుకున్న క్రమంలో **మబ్బుమబ్బు కరుసుకుంటే మింటిలోన మెరుపు నిప్పు/ రాయిరాయి ఒరుసుకుంటే రవ్వల రూపంలో నిప్పు** అన్నారు. మొదటి ఆయుధాన్ని ప్రకృతిలోంచే శ్రముడు సృష్టించుకున్నాడని చెబుతూ ఆలోచనల **అమ్ముల పొదకు/ పాదు పురుడు** పోసుకుందని చెప్పారు. నాగరికతను సాధించిన మనిషికి గూడు కావాలి/ కడుపులో దాచుకునే నిలవనీడ కావాలని భావించారు.

క్షణక్షణం సృష్టిలో జరుగుతున్న పరిణామాల గుర్తింపు శ్రమ కావ్యంలో అడుగడుగునా కనిపిస్తుంది. స్పష్టమైన ప్రణాళికతో కూడిన కవి చూపు ముందుకు నడిపిస్తుంది. మార్మిక ధోరణిని పాటిస్తూనే కలంతో అలవోకగా దృశ్యాలను చెక్కారు. శ్రవణనాడిని/ శృతి చేసేందుకు ముఖం చేసే ప్రయత్నం కూడా శ్రమే అన్నారు కవి. ముఖకండరాల చైతన్యాన్ని శ్రమకు సంకేతం చేశారు. కథావిష్కరణకు సిద్ధం చేసిన శ్రముడు, శ్రమి పాత్రల నేపథ్యంలో నాల్గుకాళ్ల శ్రమనంతా వెనుగాళ్లకు మునుగాళ్లకు విరామం ప్రకటించి ... అంటూ తొలి మానవుని ఉనికి, వేట, నిప్పు వంటి అంశాలను ప్రస్తావించారు. శ్రమి ఆలోచన, శ్రముడి ప్రశంస, ప్రకృతిలోంచే మొదటి ఆయుధంగా వెదురును బాణంగా మలచుకోవడం, చర్మాన్ని తాకినప్పుడు పుట్టిన శబ్ధం విని డప్పును తయారు చేసుకోవడం, ధ్వన్యనుకరణ, గుర్రం పరుగునే వేగానికి, శక్తికి సంకేతంగా చూపించారు. పొట్ట కింద గుడ్డును పిట్ట పొదువుకోవడం ఎలాగో మనిషి తలదాచుకునేందుకు నిలవనీడగా గూడును కట్టుకున్నాడని తెలిపారు. శత్రువును ఎదుర్కొనేందుకు భయపు గాయం చేయడం నేర్చుకోవడం, చెట్టును తనకు తిండి పెట్టే పెద్ద దిక్కుగా గుర్తుపట్టడం, పండు తినగా మిగిలిన గింజ భూమిలో నాటినాక మళ్లీ మొలకగా పుట్టడం గురించి కవి చెప్పారు. భూమిని దున్నడానికి నాగలిని, నడక పరుగుగా మార్చుకోవడానికి చక్రాన్ని శ్రమి శ్రములు సాధించారని తెలిపారు. ఆహారాన్ని నిలువ ఉంచుకోవడం కోసం **మేధోయజ్ఞ గుండంలో/ మరిగే ఆలోచనల గిన్నెలోంచి/ పొంగి పొలికిందొక వెలుగు** అంటూ కుమ్మరి చక్రాన్ని చూపి.. అది సృష్టించిన ముంత, కూజా, అటిక, గురిగి, కంచుడు, పొంత వంటి వాటిని గుర్తు చేస్తారు. శ్రమిశ్రముల జీవితం చైతన్యతను సంతరించుకుందని అంటారు. వెన్నెలను, బంగారాన్ని/ తోడు బెడితే పేరుకున్న/ గడ్డకట్టిన మీగడ పెరుగు శ్రమి అని చెప్పారు. ఆదిమ మానవుడి మనస్సు ఆనాడు చేసిన ఆలోచనలను 21వ శతాబ్దంలోకి ఒంపి అందించిన సృజన పనితనం కవిది. మొట్టమొదటి చెప్పు తయారీ కోసం చేసిన

ప్రయత్నం తరువాత పాదుకలకు మాతృకలుగా మారాయని చెబుతారు. మృగ చర్మాలను కట్టుకొని తిరిగే ఆది మానవునిడికి వస్త్రాల నేత ఆలోచనను చెప్పిన గురువు సాలీడు అంటారు. ఉపాధి, ఉనికి, ఆనందం, పరవశం, ఉత్తేజం, అంతర్ముఖం వంటి అనేక అంశాలు శ్రముడి నేపథ్యంగా చెప్పారు. శ్రమి చింతపిక్కల మంట వెలుగుల్లో ఆనంద పరవశురాలైతే నాట్యం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. జీవించే ప్రయత్నాన్ని కళగా చూపించారు. తన ఆనందాన్ని పంచుకోవడం, ఉమ్మడిగా ఉండడం మనిషిపరంగా చూపించారు. ఆహార అవసరాలకు ఇతరులను హింసకు, దోపిడీకి గురి చేసే తీరు తొలగిపోవడంలో వెలుగును చూపించి చీకటికి అదే అర్థమని వివరిస్తారు. దెబ్బ తగిలితే అశ్వగంధి పుట్టిందని అంటూ ఆనందం పాటగా, మాటగా రూపుదిద్దుకుందని తెలిపారు. మనిషి తొలిమాట అన్వేషణకు దారులు తీసి శబ్దశక్తి, యుక్తిని పెంచిందని తెలిపారు. దరువు, లయలతో శబ్ద శ్రమ యజ్ఞానికి సంగీత విన్యాసాన్ని చూపించి క్రమంగా ఎదుగుతున్న జీవితపు ఛాయలను ఆవిష్కరింపజేశారు. చిత్రకళ, శిల్పకళ మానవునిలో తాండవించిన తీరులను చెబుతూ... బొంతపురుగు రెక్కలు వచ్చి సీతాకోకచిలుక అయినట్టుగా– రాతి కార్మికుడు శిల్పిగా ఎదగడాన్ని చూపారు.

జీవనది పురిటి గది అన్నది ఈ కావ్యానికి పతాక శిఖరం. నిత్యం మోసే నేలతల్లి ఎలాగో కడుపులో బిడ్డను మోసే తల్లి గొప్పతనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. **సగం నీళ్లలో ప్రసవించింది శ్రమి/ బిడ్డ నీళ్లలోకి జారింది/ తల్లిపేగుతో ముడిపడ్డ/ నీళ్లలో బతుకమ్మలా తేలినట్టాయే అంటూ...** అప్పుడే కన్నువిప్పిన శిశువుకు కొత్త లోకపు బతుకును పరిచయం చేశారు. బిడ్డను కన్న కష్టం భార్యది, పురుషుడిది పెత్తనం అంటూ అక్కడా కూడా పురుషాధిక్యత పురుడు పోసుకోవడాన్ని కవి గుర్తు చేస్తారు. ఊహాత్మక రూపాల్లో వివిధ దశల్ని ఒక అనుభూతి సంద్రంగా మలచి కవి ఆవిష్కరించారు. **భూ ప్రపంచం శ్రమ ఇరుసుగా/ శ్రమ కందెనగా తిరుగుతుంది** ప్రకటించారు. గొప్ప విశ్లేషణకు దారితీసే ఎన్నో పార్శ్వాల విన్యాసం ఈ కావ్యం. శ్రమ విరాట్ స్వరూపానికి ఇది కవి అంతరాళపు మహాక్షరాభిషేకం. ■



# మట్టిబడి

**- ఈతకోట సుబ్బారావు**
**94405 39785**

**ల**క్షలాది భూమి కవుల స్వేద ఘోష
కరకు కసాయి కత్తులపై రాసిన కన్నీటి భాష
నా దేశ ప్రజలకు అందించిన ఉద్యమ కవిత్వం ఇది
కన్యాకుమారి నుంచి హిమాలయాల దాకా పులికిపడ్డ
మహా మానవ హారం చేసిన తాండవ లీలా విలాసమిది
పాలకుల చెదలు పట్టిన చెవులకి వినిపించని శాంతి లయ
మట్టి పిసుక్కొనే చేతులుగా భావిస్తున్న వాళ్ళకి
మట్టి చేతులతో నేల నుంచి ప్రాణాలు పూయిస్తున్న శక్తి
దేశ దేశాంతరాలు ఎరుగని ప్రాణయోగ విద్య
దేశమంతా కోడై కూస్తున్నా వినిపించని బధిరులున్న దేశం
ప్రజాభీష్టాన్నీ అధికార మదంతో తొక్కేస్తున్న దృశ్యం
ఆ రైతుజన సముద్రం పొంగుతున్న రస్తాల మీద
మీరెన్ని కుటిల సేనల్ని ప్రయోగించినా
శాంతి లయకు భంగం వాటిల్లనంతవరకే పచ్చని తివాచీ
అదిగో .. ఆ సముద్రం నేలకు ప్రాణదానం మానేసిందో
మీ బొజ్జల నిండా ఎడారులే పండుతాయి
స్వాతంత్ర్యాన్నే త్యాగాలతో సాధించుకున్న జనాలకి
స్వేదాభిప్రాయ విజయం అసాధ్యం కాని దుక్కి కాదు!

# దేశం నాకు శానా బాకీ

- నాగరాజు మద్దెల
63019 93211



మా పుట్టుకతోనే
దుబ్బతో, ధూళితో విడదీయరాని
అనుబంధం విచిత్ర సంబంధం
సదువుకు నోచని మనుషులం
ఇంట్లో ఎప్పుడూ ఆకలి అమవాస్యలే
నీళ్లులేని దృశ్యాలకు కనుగుడ్లే సాక్ష్యం!
చెంపలు అగాథాలను తలపిస్తాయి
బక్కచిక్కిన ఎముకల్ని కప్పిఉంచే
దుబ్బ సంచిలాంటి సొక్కా
మట్టితో నిండినా లాగులే మాకు నిత్య వస్త్రాలు...

పుట్టిన సోటు మాట్లాడే భాష
తినే తిండి, ఉండే అలవాట్లు
తెలిసిన సోటిడిసి, కొత్త సోటుకు
కలిసుండే సుట్టాల్ని
అనుబంధ పేగుబంధాల్ని
ఆత్మీయ సంబంధాల్ని ఇడిసి
జబ్బునున్న కన్నోల్ల కన్నీళ్ల నిర్మూలన ఆనకట్ట కోసం
నన్ను నేనుగా అర్పించుకుని
కాలితో బోరు పనికై కదం తొక్కిన
నా లాంటి జీవులు కొల్లలు కోకొల్లలు
మా అందరికీ ఈ దేశం శానా బాకీ..!

బోర్లు వేయనీకి
పగలూ రాత్రీ రెండు సమమే
ఎండ, వాన, చలి, మరేదైనా మేము సిద్ధమే
వంద, రెండొందలు, మూడొందలు.. వెయ్యి
ఫీట్లకై మా ఫీట్లు కందేల
రాడ్లను నాగళ్ళ మాదిరి మోసి మోసి
కందిన గాయాలకు, దిగమింగుకుని
దుఃఖపు అరుపులు బోరు యంత్రం
కూతలో కలిసిపోయేవి
దుబ్బను ప్రాణవాయువులా పీల్చి పీల్చి
ఊపిరితిత్తులకు, ప్రమాదమని తెలిసిన
ప్రాణ త్యాగానికి జడవని బీదలం
ఆకలి తల్లికి దత్త పుత్రులం
ఐనా
నీళ్ళు పడ్డాయంటే మా సంబురం ఆకాశం

పానానికి విలువ గుర్తించని
మా గుత్తాదార్లు కమిషన్తో
కొంత మింగి, అప్పుల వడ్డీకి కొంత
కొంత సాధారణ కర్సులకు పోతే
మిగిలిన కొంచెం ఇంటికి ఆసరా..
గిప్పుడు కాలం వంకరగా నవ్వుతున్న
రోజులు వచ్చాయి..
చేతులు పడిపోయే
కాళ్ళు కదపలేక
ఊపిరాడని బతుకులకు
ఊపిరితిత్తులు చెడిపోయి
వాయునాళాలు దెబ్బతిని
శ్వాసనాళాలు పూరుకుపోయి
లోపలి అవయవాలు మొత్తం ఆగిపోయే
స్థితిలో నన్ను మంచానికి పరిమితం చేసిన సందర్భంలో
ఈ దేశం నాకు శానా బాకీ..

ఎన్నో, ఎన్నెన్నో బోర్లు
వేల కుటుంబాలకు నీళ్లనిచ్చి
కడకు ఏడ్వనికి కన్నీరు కూడా రావడం లేని నా స్థితి
మంచాన లేవలేక చావును సమీపిస్తున్న
కుటుంబానికి మరింత కుంగదేసే సందర్భాన
ఈ దేశం శానా బాకీ పడ్డది..
నాకు నా కుటుంబానికి...
లబ్ధి పొందిన ప్రతి బోరు బావీ రుణపడి ఉన్నది
ఈ దేశం శానా బాకీ పడ్డది....




# ఉత్తరాంధ్ర 'వలస పాట'

- డా.చింతపల్లి ఉదయ జానకి లక్ష్మి
94407 31068

**"వచనానికి క్రమశిక్షణ నేర్పే గురువు కవిత్వం"** అంటాడు రష్యన్ కవి జోసెఫ్ బ్రాడ్‌స్కీ. ఈ విషయాలు దాదాపు దశాబ్దంన్నర నుంచి కవిత్వాన్ని రాస్తున్న 'గవిడి శ్రీనివాస్' విషయంలో నిజం. రచయిత మొదటి కవితా సంకలనం "కన్నీళ్ళు సాక్ష్యం" పాఠకుల మనసు గెలుచుకున్న కవిత్వం, రెండవ కవితా సంకలనం "వలస పాట". తెలుగు సాహిత్య సంస్కృతీ వికాసంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎందరో కవులను, కథకులను అందించిన నేల ఉత్తరాంధ్ర. ఆ ఉత్తరాంధ్ర నుంచి 'వలస పాట' వినిపిస్తున్న కవి గవిడి శ్రీనివాస్.

ఉత్తరాంధ్ర రచయితలు ఎవరు కవిత్వం రాసినా వలస గురించి ప్రస్తావించకుండా ఉండరు. గవిడి శ్రీనివాస్ ఈ అంశం గురించి బలమైన కవితలు రాయడంతో పాటు తన కవితా సంకలనానికి **'వలస పాట'** అని పేరు పెట్టారు. 'ఉత్తరాంధ్ర వలస పాట' అనే మొదటి కవితతో ఈ కవితా సంకలనం ప్రారంభమయింది. ఈ కవితలోని వ్యక్తీకరణలో ఉత్తరాంధ్ర ప్రతి పల్లె ఒక్కో దిగులు తల్లి అంటూ...

***గాల్లో తేలాడే బుట్టలు***
***బరువెక్కిన బతుకు మీద***
***గాలిపటాల్లా నలుదిశలను వెదుకుతున్నాయి***
***చరిత్ర గుండెల్ని పిండినపుడల్లా***
***రాలుతున్న వలస పాటలు***

**బస్ స్టేషన్ వెంటో, రైల్వే స్టేషన్ వెంటో**
**తగులుతున్న దృశ్యాలై జ్వలిస్తున్నాయి**
**కాలం నడుస్తున్నా పని చిక్కని చేతిలో**
**పొట్ట కూడదీకుని**
**ఆశల మూటల్ని బరువుగా మోస్తూ**
**వలస బండి గడగడా కదిలిపోతుంది**
**ఎప్పటికీ తెరవని ఉపాధి ద్వారాలు**
**సూర్యోదయాన్ని చీకట్లో బంధించాయి**
**చెదిరే కాలం వెంట**
**వలస విమానం పరిగెడుతుంది ఇప్పుడు..** అంటాడు కవి ఆర్ద్రతతో.

మనిషి సృష్టి రహస్యాలు తెలుసుకొని, ప్రకృతిని సైతం తన గుప్పెట్లో బంధించాలన్న ప్రయత్నంలో ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడు. ఈ కవి కలం నుంచి 'పర్యావరణ పరిరక్షణ' దిశగా సాగే కవితలు ఎన్నో ప్రకృతిని ప్రేమింపచేస్తాయి, వర్షంతో తడిపే స్థాయి 'నీరైపోనూ'... కవితను చూస్తే ద్యోతకమవుతుంది.

**జొన్న సేను రేకుల్లో**
**మబ్బుకళ్ళు జార్చిన**
**పన్నీరే ఈ చిట్టి చినుకులు**
**పువ్వైపోదూ చిరునవ్వైపోదూ**
**చెరుకు గడల మధ్య**
**నిద్రను ఆరేసుకుంటే**
**తడి చినుకు గుండెను హత్తుకుంది**
**ప్రియురాలిలా!**

గాలి వీస్తే, వాన లేస్తే ప్రాణాలు ముద్దవుతుంటాయి, ఆకాశానికి రెక్కలు చాచి, బొంగరంలా గిరికీలు కొడుతుంటే సౌందర్యం శరీరమైనట్లు, మనసు పల్లకిలో తేలియాడుతుంది

అంటాడు కవి. కవిత్వ నిర్మాణం బాగా తెలిసినవాడు కనుకనే తనలోని భావోద్వేగాలకు ప్రతిబింబిస్తూ తనలోని ఊహాశక్తికి సృజనను జోడించి మంచి భావ చిత్ర నిర్మాణం చేశారు. "అలా వెళ్ళి పోతావ్" కవిత హృద్యంగా సాగుతుంది.

**రుతువుల్ని గోరింటాకు పెట్టుకుని**
**ఇంద్రధనస్సుల్ని మెరిపించావ్**
**చిరునవ్వుల సాక్షిగా**
**హృదయాన్ని ఆకాశానికి**
**తారాజువ్వలా ఎగరించేశావ్**
**బతుకు గమనంలో**
**నడకల దిక్కుల్ని శాసించావ్**
**అంతరంగాన్ని ఆప్యాయత**
**దివిటీలతో వెలిగించావ్** అంటూ సాగుతుంది.

కవి కొన్ని ఆనంద క్షణాలతో, మరికొన్ని ఉద్రిక్త క్షణాలతో, కొన్ని కన్నీళ్ళతో, రాలుతున్న జ్ఞాపకాలతో కవిత్వాన్ని ప్రసరించారు. జీవన రేఖలు సరిచేసేందుకై కాలం చేసిన గాయానికి ఏడవకురా కన్నా.. కాలాలు అన్నీ మనవి కావురా అంటూ పట్నం బయలుదేరిన వలస పక్షి అనుభవాలను అనేక కవితల్లో ప్రవహింపచేశారు. యాంత్రిక జీవితాన్ని 'వర్తమాన దృశ్యం'తో కళ్లకు కట్టించారు.

**క్షణం తీరిక లేని**
**పరుగుల ఒరవడిలో**
**యాంత్రికం ఒక నియంత్రిత చర్య**
**మెరుపు గమనంలా**
**మనిషి ప్రవహించాలి**
**పరిగెత్తే ప్రపంచంలో**
**ఒకరికి ఒకరు ఇక్కడ ఒంటరి**
**పరితపించే హృదయాల్లేవ్**
**జనం**
**సాంఘికం కాని వేళ**
**మనసుల్లో నెలవొంకలు పూస్తాయా!?**
**మనుషుల కీకారణ్యాన్ని**
**ఒంటరిగా ఈదటం**
**ఎడారిని ఆరబోసినట్లు ఉంది** అంటారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ దౌర్జన్యాలను చిత్రీకరిస్తూ ప్రశ్నల అస్త్రాలను సంధిస్తాడు. 'ప్రపంచీకరణ ఇంద్రజాలం భూములకు రెక్కలిచ్చి ఆశల్ని ఆకాశానికి

## నేనిప్పుడు సాక్షిని మాత్రమే!

**నా**లుగు దశాబ్దాల క్రితం
నా గుండెలపై నాట్యమాడిన
ఆ లేలేత పాదాల సవ్వళ్ళు
నా చెవ్వుల్లో ఇప్పటికీ
మారుమ్రోగుతూనే ఉన్నాయి
అది నా అలవాటో పొరపాటో
తెలియదు కానీ...

ఇప్పుడు కూడా ఆ పాదాలే
నా గుండెను తాకుతుంటే
అమానవత్వపు ఆనవాళ్ళుగా
చెరగని ముద్రలేస్తుంటే
పేగుబంధపు చాటుగా
మనసుని శిలగా చేసి గుండెలోతుల్లోనే
ఎంత దాచాలని ప్రయత్నించినా
మబ్బులు కమ్మిన మనసులోంచి
కన్నీళ్లు వర్షిస్తున్నాయి
బరువైన బంధాలకు
నేనిప్పుడు
ఒక సాక్షిని మాత్రమే!


**- ఎంఎస్ రాజు**
**95020 32666**

వేలాడదీస్తుంది/ నిట్టూర్పులో పరిశ్రమలు మట్టిని ఎంత వినయంగా మింగినా, హరిత స్వప్నం ప్రగతిని నిలదీస్తే మరో తరానికి ఆకలి ప్రశ్నలు ఎదురవుతాయి' అని నిర్ద్వంద్వంగా వ్యక్తీకరిస్తారు.

ఈ కవితా సంకలనంలోని కవితలు అన్ని సామాజిక స్పృహతో, తనదైన శైలితో, భావుకతతో, ప్రతీకలతో సాగాయి. 20 ఏళ్లుగా కవిత్వం రాస్తూ పాటల రచయితగా, తెలుగు ప్రచారకులుగా, సంగీత దర్శకుడిగా, షార్ట్ ఫిలిం డైరెక్టర్‌గా విభిన్న కోణాల్లో రాణిస్తున్న గవిడి శ్రీనివాస్‌కి హృదయపూర్వక అభినందనలు. ■

## నివాళి


## ఏడు దశాబ్దాల జర్నలిస్టు తుర్లపాటి



సీనియర్ పాత్రికేయులు, రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత తుర్లపాటి కుటుంబరావు జనవరి 11వ తేదీన కన్నుమూశారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. 1933 ఆగస్టు 10న కృష్ణా జిల్లాలో జన్మించిన ఆయన, 14 ఏళ్ల వయస్సులోనే జర్నలిజంలోకి అడుగుపెట్టారు. ఏడు దశాబ్దాలపాటు పాత్రికేయునిగా, రచయితగా వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్రంలో పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి జర్నలిస్టు ఆయనే. తెలుగు జర్నలిజం, సాహిత్యానికి ఎంతగానో తోడ్పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. ప్రముఖులు రాజాజీ, డాక్టర్ ఎస్ రాధాకృష్ణన్, వీవీ గిరి, పీవీ నరసింహారావు వంటి వారితో తుర్లపాటికి సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. జాతక కథలు (1958), జాతి నిర్మాతలు (1968), మహానాయకులు (1971), 1857 విప్లవవీరులు, 18 మంది ముఖ్యమంత్రులతో నా ముచ్చట్లు, నా కలం – నా గళం వంటివి ఆయన రచనలు.


అనర్గళంగా మాట్లాడగలిగే కుటుంబరావు.. 20 వేలకు పైచిలుకు సభల్లో పాల్గొన్నారు. వేలాది సభలకు అధ్యక్షత వహించి 1993లో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. తానా ఆహ్వానం మేరకు 1985 లాస్ ఏంజెల్స్‌లో జరిగిన తెలుగు సభల్లో ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్నారు. కుటుంబరావు భార్య కృష్ణకుమారి 1969లో మృతి చెందారు. కుమారుడు టీవీఎస్ జవహర్‌లాల్ విజయవాడలోనే క్రెడాయ్ సంస్థలో సీఈవోగా పనిచేస్తున్నారు. కుటుంబరావు మృతికి సాహితీ స్రవంతి సంతాపం తెలుపుతోంది. ■

## నందలూరు కథానిలయం రాజేంద్రప్రసాద్ కన్నుమూత



తెలుగు కథను, కథా రచయితలను ప్రోత్సహిస్తూ.. ఎంతగానో తోడ్పాటునందించిన సాహితీ కృషీవలుడు నందలూరు కథా నిలయం వ్యవస్థాపకుడు డాక్టర్ అబ్బిగారి రాజేంద్రప్రసాద్ జనవరి 31న కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలో తుది శ్వాస విడిచారు. కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నో సేవలు అందించారు. నందలూరు మండలం పొత్తపి గ్రామానికి చెందిన అబ్బిగారి సుబ్బయ్య, తులసీదేవమ్మ దంపతు లకు 1962లో ఆయన జన్మించారు. బీఏ, బీఈడీ చేసి, 1987లో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. నందలూరు మండలం పాటూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. విద్యార్థి దశలో వివిధ ఉద్యమాల్లో పాల్గన్నారు. కడప ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదివే సమయంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడుగా, కళాశాల విద్యార్థి సంఘం నాయకుడుగా పనిచేశారు. జర్నలిజంపై మక్కువతో కొంత కాలం వివిధ పత్రికల్లో పనిచేశారు. 2004లో నందలూరు లో కథానిలయాన్ని ఏర్పాటు చేశారు. అందులో దాదాపు 5 వేల కథల పుస్తకాలను సేకరించి పెట్టారు. ఈ కథానిలయం ద్వారా ఏటా కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత, సీనియర్ రచయిత కేతు విశ్వ నాథరెడ్డి పేరిట ఉత్తమ రచయిత లను ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు. కడప జిల్లా రచయితల కథలను సేకరించి ఒక సంకలనం ప్రచురించారు. స్వయంగా కడప నానీలను రచించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్త లను నందలూరుకు రప్పించి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు సందర్భాల్లో కథల పోటీలను జరిపారు. మహాకవి గురజాడ అప్పారావుపై అభిమానంతో నందలూరులో తాను నివసించే ప్రాంతానికి గురజాడ నగర్‌గా నామకరణం చేశారు. రాజేంద్రప్రసాద్ ఎస్‌టియు రాష్ట్ర కళా విభాగం కన్వీనర్‌గా, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. ఆయన భార్య వనజాక్షి ప్రధానోపాధ్యా యురాలుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. రాజేంద్రప్రసాద్ మృతికి సాహితీ స్రవంతి ప్రగాఢ సంతాపం ప్రకటిస్తోంది. ■

# స్వీకారం



## సోవియట్ సాహిత్య భాస్కరులు

**రచన : డాక్టర్ యస్.జతిన్ కుమార్**
**వెల : రూ.150 పేజీలు : 186**
**ప్రతులకు : 98498 06281**

**ఈ** పుస్తకంలో మిత్రుడు జతిన్ కుమార్ సోవియట్ సాహిత్యాన్ని తనదైన చక్కని శైలిలో, ఆయా రచయితలపరంగా వ్యాఖ్యానించిన తీరు ఆకట్టుకుంది. విమర్శనా పరంగా ఆయా కోణాలను ఆవిష్కరించే ప్రయత్నం క్లుప్తంగా అయినా సారాంశాన్ని వెలికి తీయగలిగింది. సోవియట్ సాహిత్యాన్ని ఈ తరానికి గుర్తు చేసినందుకు రచయితకు అభినందనలు.

**- నిఖిలేశ్వర్**



## అమ్మ ఒడి కథలు

**రచన : చెన్నూరి సుదర్శన్**
**వెల : 150 పేజీలు: 216**
**ప్రతులకు : 94405 58748**

**ఈ** 27 కథల్లో నేను గమనించిన ప్రత్యేక గుణం మానవీయమైన అంశాల చిత్రణ. ఎంతో ఆర్తితోనూ, ఆర్ద్రతతోనూ చేశారు రచయిత. ఈ లక్షణం ఉన్న కథలే నిజానికి వ్యక్తి వికాసానికీ, సమాజ శ్రేయస్సుకూ దోహదపడతాయి. పాఠకుడికి మరపురాని మధురానుభూతి కథలు ఇవన్నీ.

**- విహారి**



## సభల్లో సరదాలు

**రచన : చలపాక ప్రకాష్**
**వెల : 20 పేజీలు: 40**
**ప్రతులకు : 92474 75975**

**స**భలు, అందులోనూ సాహిత్య సభలంటే ఊరకే జరుగుతాయా? బోలెడు విశేషాలతో పరిమళిస్తాయి. వక్తల ఛలోక్తులతో నవ్వులను పూయిస్తాయి. కొన్ని సందర్భాలు సృష్టించిన సరదాలూ ఉంటాయి. రచయిత చలపాక ప్రకాష్ తను పాల్గొన్న సభల్లో తారసపడ్డ హాస్య సన్నివేశాలను ఈ చిన్ని పుస్తకంగా తీసుకొచ్చారు.

**- సాహిత్య**




## నన్ను మాట్లాడనివ్వండి

(కవిత్వం)

**రచన : మల్లాప్రగడ రామారావు**
**వెల : 90 పేజీలు: 72**
**ప్రతులకు : 99511 71696**

**నే**ను ఎప్పుడెప్పుడో రాసిన కవితల సంకలనం ఇది. నా కవితా రచన సామాజిక స్పృహతోనే మొదలైనా... మధ్యలో నా యవ్వన సహజోద్వే గాలను అక్షరీకరించే దిశగా సాగింది. అయితే 1970 తరువాత రాసిన వాటిలో ఒక అంతస్సూత్రం దాగి ఉంది. రాయకుండా ఉండలేకపోతే రాశాను తప్ప రాయాలని రాసినవి కావివి. ఆలోచనలతో కొన్నేళ్లు నానినాని వెలువడిన కవితలు కొన్ని ఉన్నాయి.

**- రచయిత**



## కాలం నా చేతిలో ఉంది

కవిత్వం

**రచన : అడిగోపుల వెంకటరత్నం**
**వెల : 100 పేజీలు : 136**
**ప్రతులకు : 98482 52946**

**దా**దాపు అర్ధ దశాబ్దం నుంచి కవితలు రాస్తున్న కవి కలం నుంచి ఇప్పటికి పాతిక కావ్యాలు వెలువడ్డాయి. ఈ కవి హృదయం సుకుమారం, సున్నితం. అది స్పందించినప్పుడు కవితా మయంగా ఆవిష్కృతమవుతుంది. సమాంతర వాక్యనిర్మాణం ఈ కవిత్వంలో ఎంతో విశిష్టంగా దర్శనమిస్తుంది. ఎత్తుగడ నుంచి దింపుడు దాకా ఎక్కడా వాక్యనిర్మాణం బెసగదు. చాలాకాలానికి మంచి కవిత్వం చదివిన ఆనందం కలుగుతుంది సహృదయ పాఠకులకు.

**- ఆచార్య కొలకలూరి ఇనాక్**



## నానీ విహంగాలు

**రచన : అరవింద రాయుడు దేవినేని**
**వెల : 100 పేజీలు: 120**
**ప్రతులకు : 90594 83804**

ఒక సంపుటిలో అదీ ఇదీ అని కాకుండా నానీలన్నీ బాగున్న సందర్భాలు నా అనుభవంలో తక్కువే! ఎక్కడన్నా పరిష్కరణ చేద్దామన్నా పెన్ను పెట్టనిస్తలేవీ నానీలు. దానికి ఈ కవిశక్తి కారణం. జీవితానుభవం, సామాజిక అవగాహన, విలక్షణమైన కవితాభివ్యక్తి దేవినేని అరవిందరాయుడి సొత్తు. నానీ ప్రక్రియ కవిత్వపరమైంది. ఏది రాసినా కవిత్వముండాలి. కవిత్వానికి రాయుడి నానీల్లో లోటు లేదు.

**- డాక్టర్ ఎన్.గోపి**

# స్వీకారం



## వేణునాదం

**రచన : డా॥ నాగసూరి వేణుగోపాల్**

**వెల : 200 పేజీలు : 240**

**ప్రతులకు : 94405 03061**

**అం**దరి జీవిత కథలు రాయమని ప్రోత్సహించే క్రమంలో తనూ తన జీవితానుభవాలను కొన్నింటిని 'వేణునాదం' పేరిట పుస్తకంగా తెచ్చారు డాక్టర్ నాగసూరి. ఇందులో బాల్యం, చదువులు, కుటుంబ విశేషాలు ఒక భాగమైతే– ఆకాశవాణిలో ఉద్యోగ జీవితం రెండోభాగంగా ఉంది. పాత్రికేయునిగా, బహు గ్రంథ రచయితగా, పత్రికలు, ప్రసార మాధ్యమాల విశ్లేషకుడిగా తన అనుభవాలను, ప్రముఖులతో తనకు గల సాన్నిహిత్యాన్ని మూడోభాగంలో ప్రస్తావించారు.

**- జి.మాల్యాద్రి**



## నేమిషిస్

కవిత్వం


**రచన : సర్వమంగళ**

**వెల : 98 పేజీలు : 50**

**ప్రతులకు : 89616 26848**

**ఈ** సంకలనంలోని కవితలను రెండు భాగాలుగా విభజిస్తే.. ఒక భాగం రచయిత్రి ఆత్మాశ్రయమైనా, రెండోభాగం సమాజ పరిణామాలపై ఆమె పరివేదన కనిపిస్తోంది. అందులోనూ ఏదో నేమిషిస్ కనిపిస్తుంది. అభినందనలు సర్వమంగళకు.. ఏ కోణంలోనూ హృదయాన్ని జారవిడుచుకోనందుకు ...

**- నల్లి ధర్మారావు**



## కొత్త సూర్యుళ్లు మొలిచి తీరాలి (కవిత్వం)

**రచన : రావి రంగారావు**

**వెల : 100 పేజీలు: 128**

**ప్రతులకు : 92475 81825**

**ప**ద్యకవిగా, వచన కవిగా, మినీ కవిత ఉద్యమ ప్రచారకర్తగా, విద్యావేత్తగా, బాల సాహిత్య సృష్టికర్తగా ఈ కవి సుపరిచితులు. అనేక కవితా సంపుటాలను ఇప్పటికే వెలువరించారు. ఆయన కవిత్వంలో సామాజిక చైతన్య ఉద్యమ దృష్టి ప్రముఖంగా కనిపిస్తుంది. ఇనుములా ఉక్కులా బలిసిపోయిన చీకటిని పగలగొట్టే అధునాతన మహా సూర్యుళ్ల కోసం ఎదురుచూస్తున్న కవి హృదయం ఈ తాజా కవిత్వం నిండా పరుచుకొని ఉంది.



## విప్లవ తపస్వి పివి

వ్యాసాలు

**రచన : ఎ.కృష్ణారావు**

**వెల : 150 పేజీలు : 224**

**ప్రతులకు : 94948 75959**

**పివి** ప్రాభవం వెలిగిపోతున్న దశలో జరిగిన పరిణామాలనే కాక, ఆయన చివరి రోజుల్లోని ఘట్టాలను కూడా గమనించే అవకాశం నాకు లభించింది. ఒక విలేకరిగా దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అనేక చారిత్రక పరిణామాల గురించి 'పివి నుంచి మోడీ వరకు' అన్న పుస్తకం ద్వారా చెప్పాలనుకున్నాను. కానీ, పివి గురించి ప్రత్యేకంగా రాయడం అవసరమని ప్రియమిత్రుడు మా శర్మ చెప్పటంతో రాయటానికి ఉపక్రమించాను.

**- రచయిత**



## లైఫ్ ఇన్ గల్ఫ్

సమాచారం

రచన : **సయ్యద్ సమీయుల్లాహ**

**వెల : 98 పేజీలు : 128**

**ప్రతులకు : 97045 80867**

**ఈ** పుస్తకంలో గల్ఫ్ దేశాల గురించిన సమాచారం ఉంది. వీసాల గురించి, అక్కడి ఉద్యోగ అవకాశాల గురించి, లైఫ్‌స్టైల్ గురించి, ఇంకా అక్కడి కష్టాలూ సమస్యలూ, జాగ్రత్తల గురించి వివరించటం జరిగింది. గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునేవారికి, అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకోవాలనుకునేవారికి ఈ పుస్తకం మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

**- సమీర్**



## ఊరవతల ...

నవల

రచన : **వరకుమార్ గుండెపంగు**

**వెల : 140 పేజీలు : 96**

**ప్రతులకు : 99485 41711**

**ద**ళిత జీవితాన్ని చిత్రించిన నవల ఇది. ఉత్పత్తి కులాల సేవలను అడుగడుగునా ఉపయోగించుకున్న ఊరు.. అదే సేవలను వారు పొందేందుకు మాత్రం కులాన్ని సాకుగా చూపుతుంది. సేవలు అందించేవారు తక్కువ వారు కాదని, వారికి గౌరవ స్థానం ఇవ్వాలని చెబుతుంది ఈ నవల.

**- రచయిత**

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

23.04.1891 – 25.02.1961



వడ్లగింజలు, అరికాళ్ళకింద మంటలు, కీలెరిగి వాత, కలుపు మొక్కలు, గులాబీ అత్తరు వంటి వీరి కథలు సుప్రసిద్ధం. వీరపూజ, మిథునానురాగము, శ్మశానవాటిక, అనాథ బాలిక, రక్షాబంధనము వంటి రచనలు చేశారు. 'అనుభవాలూ–జ్ఞాపకాలు పేరుతో రాసిన స్వీయ చరిత్ర ప్రసిద్ధ పుస్తకం.

సాహితీస్రవంతి

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 2 ▪ SANCHIKA - 4 ▪ KRISHNA ▪ February 2021
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.1.2021


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



## విప్లవం అంటే ఏమిటి?

పేజీలు 32
రూ. 10/-

భగత్‌సింగ్‌ను భారతదేశంలో తొలితరం మార్క్సిస్టుల్లో ఒకరుగా పేర్కొనవచ్చు. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ స్థాపకుల్లో ఆయన ఒకరు. భారత్, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని జైలులో 64 రోజులపాటు నిరాహారదీక్ష చేపట్టి బ్రిటీషు పాలకులకు సింహస్వప్నంగా నిలిచారు. ఆయన రాసిన రెండు ముఖ్యమైన వ్యాసాలను ఈ చిన్న పుస్తకరూపంలో అందిస్తున్నాం. ఇవి నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి.

## నాన్నా ఎందుకిలా చేశారు.



పేజీలు 32
రూ.10/-

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్‌ను కాల్చి చంపిన పోలీసు అధికారిపై ప్రతీకారం తీర్చుకోవడం, పార్లమెంట్ భవనంలో బాంబు విసరడం చేసినందుకు 1931 మార్చి 23న భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీశారు. భగత్ సింగ్ అమరుడై దాదాపు 90 ఏళ్లు కావస్తున్నా నేటికీ యువతరానికి వేగుచుక్కగా నిలిచారు. ఆయన ఉరితీతకు ముందు తన కుటుంబీకులకు, విప్లవ సహచరులకు రాసిన లేఖలు నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయి. వాటన్నిటినీ ఈ చిన్న పుస్తకరూపంలో అందిస్తున్నాం.

భారతదేశ చరిత్రను మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించిన గ్రంథమిది. భారతదేశ చరిత్ర చాలా సంగ్రహంగా ఇందులో చెప్పారు. మనదేశ చరిత్రలో జరిగిన విభిన్న సంఘటనలను మార్క్సిస్టు తత్వశాస్త్రమైన 'చారిత్రక భౌతికవాద సిద్ధాంత' దృక్పథంతో కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఈ పుస్తకంలో పరిశీలించారు. భారతదేశంలో ఇంత వరకు జరిగిన సామాజిక మార్పులు, యుద్ధాలు వాటి వర్గ ధోరణి, సామాజిక మార్పుల్లో విభిన్న వర్గాల పాత్ర, భారతీయ సామాజిక వ్యవస్థ ప్రత్యేకతలు మొదలగువాటిని సంగ్రహంగాను, స్పష్టంగాను కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. వివరించారు.

భారతదేశ చరిత్ర
ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్
పేజీలు 128 రూ.100/-





గతితార్కిక భౌతికవాదం
పేజీలు 104 రూ.80/-

మార్క్సిజాన్ని అధ్యయనం చేసేవారు గతితార్కిక భౌతికవాదాన్ని తెలుసుకొని తీరాలి. అందులోనూ కమ్యూనిస్టులైన వారికి ఇది విధి. గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని అధ్యయనం చేయకుండా కమ్యూనిస్టులైనవారు సరైన రాజకీయ అవగాహనకు కూడా రాలేరు, సరైన విధానాలనూ అనుసరించలేరు. అందుకు జరిగే ప్రయత్నంలో ఒక భాగంగానే ఈ పుస్తక రచన. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని ఇంకా ఎక్కువ లోతుగా ఎక్కువ వివరాలతో అభ్యసించడానికి ఇది ప్రాతిపదికగా ఉపయోగపడుతుందనే ఆశతోనే దీని ప్రచురణ.

ప్రజాశక్తి బుక్‌హౌస్
27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
బ్రాంచీలు : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు,
విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendrum, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**